RNI No. APTEL/2003/12253


# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 5 Monthly May 2024 ISSN No. : 2456-4702 Rs. : 15/-



కాశీనాథుని నాగేశ్వరరావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)




# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 9949929674, 7989088274

# BHAVAVEENA

(MONTHLY MAGAZINE)

Journal - Arts, Literature, Cultureand Language Study

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253


| | | |
|---|---|---|
| ముద్రణ | : | **మే - 2024** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి.నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి.నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509. |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

*Founder :*
Kolla Sri Krishnarao (Late)

*E-mail :*
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue : 5 - May 2024 - ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs.: 15/-**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,***

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
***M.A.(Tel), M.A.(Pol-Sci.)., M.Ed., Ph.D.,***
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P

2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) Ph.D
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu &
Chairman, BOS Philothrophy& Religion Studies,
Andhra University, Visakhapatnam.

7. **Prof. T. Ramaprasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swaruparani,** M.Sc., M.Ed., M.Phil., Ph.D.
Principal,
St Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Prof. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Professor, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P. R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46.
Hyderabad. Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narsapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur- 2 . 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.

# కాశీనాథుని నాగేశ్వరరావు (1867-1938)

కాశీనాథుని నాగేశ్వరరావు పాత్రికేయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు, విద్యావేత్త, దానశీలి, ఖాదీఉద్యమనేత. అతనను "దేశోద్ధారక", "విశ్వదాత" అని వ్యవహరిస్తారు. వీరు విద్యావేత్త కాదు గోప్ప సాహితీవేత్త.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కృష్ణా జిల్లా ఎలకుర్రు గ్రామంలో 1867 మే 1వ తేదీన జన్మించారు. తల్లి శ్యామలాంబ, తండ్రి బుచ్చయ్య. వీరి ప్రాథమిక విద్య ఎలకుర్రు గ్రామంలో పూర్తిచేసిన తరువాత మచిలీపట్నంలో ఇంటర్ పూర్తి చేశారు. తరువాత ఉన్నత విద్యకై మద్రాసు వెళ్ళి 1891 మద్రాసు క్రిష్టియన్ కాలేజిలో పట్టభద్రుడయ్యాడు. ఆ కాలేజీలో చదువుకునే రోజులలో ప్రముఖ విద్యావేత్త డా॥. రెవరెడ్ మిల్లర్ ప్రభాం నాగేశ్వరరావుపై పడింది. తరువాత ప్రముఖ సాహితీవేత్త కందుకూరి వీరేశలింగం పంతులు గారి ప్రభావం కూడా నాగేశ్వరరావును బాగా ప్రభావితం చేసింది. ఆ ప్రభావంతోనే వారిలో జాతీయతా భావాలు రేకెత్తి గోప్ప స్వాతంత్ర్య సమరయోధుడ్ని చేశాయి. 1907లో సూరత్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సభలో పాల్గొన్న తరువాత అతను తెలుగువారికి తెలుగులో వార్తా సమాచారాలను అందించాలన్న అవసరాన్ని గుర్తించారు. కాని దేశీయ పత్రికలపై ఆంగ్ల ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు విధించింది. అయినా కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు భయపడకుండా 1908లో బొంబాయిలో "ఆంధ్ర పత్రిక" అనే వార పత్రికను స్థాపించారు. ఆయన ఎంతో ధైర్యంగా, అంకిభావంతో ముందుకు నడిపించారు. పంతులు వ్యాసాలు ఎంతో సామాజిక చైతన్యం సామాజిక స్పృహ గల ఎన్నో అద్భుత వ్యాసాలు ప్రచురించారు. అంతేగాక సమకాలీన చరిత్రపై అతను అవగాహననూ ప్రతిబింబించాయి. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు ప్రపంచంలో మారుతున్న పరిస్థితులనూ రాజకీయ పరిణామాలనూ తెలుగువారికి తమ స్వంత భాషలో అందించాలనే ఉద్దేశ్యంతో 'ఆంధ్రపత్రిక' దినపత్రికను 1914 ఏప్రిల్ 1న మద్రాసు నుండి తొలి దినపత్రిక వెలువడడం తెలుగు పత్రికా రంగంలో ఒక సువర్ణాధ్యాయం తరువాత 1924లో 'భారతి' అనే సాంస్కృతిక, సాహితీ పత్రికను ప్రారంభించాడు. తెలుగు సాహితీ ప్రియులకు ఇది చాలాకాలం అభిమాన పత్రికగా నిలిచింది.

కాశీనాథుని నాగేశ్వరరావు పత్రికారంగంలోనే కాక ప్రచురణారంగంలో కూడా తన కృషిని విస్తరించాడు. 1926లో 'ఆంధ్ర గ్రంథమాల' అనే పుస్తక ప్రచురణ సంస్థను ప్రారంభించారు. ఎన్నో ప్రాచీన గ్రంథాలను పునఃముద్రించి తెలుగు నాటి గ్రంథాలయోద్యమానికి కాశీనాథుని నాగేశ్వరరావును పితామహునిగా వర్ణించవచ్చును. ఫలితంగా 120కి పైగా గ్రంథాలయాలు తెలుగునాట ఆ కాలంలో వెలిశాయి. కాశీనాథుడు అసమాన దానశీలి. అతని ఇల్లు ఎప్పుడూ అతిథులతో, అర్థులతోనూ కళకళలాడుతుండేది. వివిధ సేవా కార్యక్రమాలు ధారాళంగా కొనసాగుతుండేవి. తన ఇంటికి వచ్చిన వారు ఇంటి నుండి వట్టిచేతులతో ఎవ్వరూ తిరిగి వెళ్ళేవారు కాదు. అతని దాతృత్వానికి అబ్బురపడిన మహాత్మగాంధి స్వయంగా కాశీనాథుని "విశ్వదాత" అని కొనియాడినారు. నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం సమకలీకుడు. 1924-34 మధ్యకాలంలో ఆంధ్ర రాజకీయాలలో కాశీనాథుడు చాలా చురుకైన పాత్ర పోషించారు. నాలుగుసార్లు ప్రాంతీయ కాంగ్రెసుకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఖద్దరు ఉద్యమానికి నాయకత్వం వహించి, ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో అది విజయవంతం కావడానికి ఎంతో కృషి చేశారు. అదేవిధంగా ఉప్పుసత్యాగ్రహం సమయంలో కూడా నాగేశ్వరరావు ఎంతో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజలకు ఆయన పట్ల అపారమైన

నమ్మకం, విశ్వాసం ఉప్పు సత్యాగ్రహం సమయంలో గాంధీతోపాటు తాను కూడా జైలుకి వెళ్ళాడు. 1931 సంవత్సరంలో జైలులో ఉన్నప్పుడు నాగేశ్వరరావు భగవద్గీత గురించి వ్యాఖ్య వ్రాశారు. గీత ఒక మతానికి పరిమితమైనది కాదనీ గీత సందేశం సమస్త మానవాళికీ వర్తిస్తుందని వారి విశ్వాసం.

మద్రాసు ప్రెసిడెన్సీలో తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలని, పొట్టి శ్రీరాములు ఆంధ్ర ఉద్యమం చేపట్టిన దగ్గర నుండి కాశీనాథుడు ఆయన వెంటే నడిచారు. ఈ ఉద్యమాన్ని పత్రికలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అంతేకాకుండా వీరు తెలుగుభాష, సంస్కృతికి మరియు తెలుగు జాతికి చేసిన సేవలను గౌరవిస్తూ తెలుగు జాతి వారిని "దేశోద్ధారక" అని సత్కరించారు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు పాత్రికేయుడు దానశీలి, స్వతంత్ర్య సమరయోధునిగా, రాజకీయవేత్తగా ఆంధ్ర దేశానికి వీరు చేసిన సేవలు కొనియాడదగినవి. చెన్నైలోని నాగేశ్వరరావు నివాసమైన శ్రీబాగ్‌లోనే చారిత్రాత్మక "శ్రీబాగ్" ఒడంబడిక 1937లో జరిగింది. కోస్తా, రాయలసీమ ఒడంబడిక ద్వారానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని చెప్పవచ్చును. వీరు చేసిన సేవలకు 1935 సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అతనను "కళా ప్రపూర్ణ" బిరుదుతో సత్కరించింది. కాశీనాథుని నాగేశ్వరరావు 1938లో మరణించారు. ఆ తరువాత కాలంలో వీరి మేనల్లుడు శివలెంక శంభుప్రసాద్ తనమామ గారి బాధ్యతలను నిర్వహించారు.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు దేశోద్ధారకుడిగా, పాత్రికేయుడిగా తెలుగు సాహితీవేత్తగా, రాజకీయ నాయకుడిగా, ఉద్యమనేతగా ఆంధ్రదేశంలో వీరు పేరు స్థిరస్థాయిగా నిలిచిందని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | గిరిజన సాహిత్యం - కళలు | - డా॥. బి. చక్రవర్తి | 8 |
| 2. | మానవ సంబంధాల సంఘర్షణ 'ఆసు' | - డా॥. మహమ్మద్ హుసేన | 12 |
| 3. | నర్మద నది పుష్కర మహాత్మ్యము | - డా॥. పడాల జగన్నాథరావు | 15 |
| 4. | పాటల బాటసారి 'గోరటి వెంకన్న' | - డా॥. బోయిన్‌పల్లి ప్రభాకర్ | 18 |
| 5. | హోళీ పండుగ చారిత్రక నేపథ్యం | - డా॥. లక్ష్మణ్ నాయక్ బానోత్ | 21 |
| 6. | బి.ఎస్ రాములు చూపు నవల - సామాజిక అంశాలు | - రాజు మోరె | 26 |
| 7. | నీలా జంగయ్య రచనల్లో- దృక్పథానుశీలనం | - బామండ్ల రాజు | 32 |
| 8. | ముకుంద రామారావు అనువాద రచనలు - ఒక పరిశీలన | - నారగోని సైదులు | 38 |
| 9. | రాయలసీమ కథానికల్లో సాంస్కృతికాంశాలు - స్త్రీల భాగస్వామ్యం | - వేలూరు భారతి | 46 |
| 10. | తెలంగాణ సాహిత్యంలో చేనేత వృత్తి కథలు - సామాజికత | - వై. శివకుమార్ | 50 |
| 11. | చింతపల్లి యమున కథల్లో విద్యావిషయక చైతన్యం | - పాలురు త్రినాథ | 56 |
| 12. | ప్రజాకవి కాళోజీపై వల్లంపట్ల రచనలు - ఒక పరిశీలన | - బుర్క ప్రియాంక | 62 |
| 13. | శ్రీశ్రీ సినీ గీతాలు - అభ్యుదయ దృక్పథం | - అంబటి సరిత | 65 |
| 14. | స్త్రీ వాద కవిత్వంలో వివాహ వ్యవస్థ | - కుమ్మరి ఆదిలక్ష్మి | 70 |
| 15. | తెలుగు కవిత్వంలో పోటెత్తిన ప్రవాహం విప్లవ స్త్రీవాదం | - కత్తెరపాక నవీన్ | 73 |
| 16. | జానపద వ్రత గేయాలు - కౌటుంబిక సంస్కృతి | - చేరాల సుధాకర్ | 77 |
| 17. | బంజార సంస్కృతిలో మాయమవుతున్న స్త్రీ రూపం | - భానోతు కవిత | 82 |

# గిరిజన సాహిత్యం - కళలు

- డా॥. బి. చక్రవర్తి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

గిరిజనులు 'గిరి' అనగా కొండ లేదా పర్వతం అని అర్థం. 'జనులు' అంటే ప్రజల సమూహమని అర్థం. గిరిని ఆధారంగా చేసుకుని బతికేవాళ్ళు గిరిజనులు, అంటే అడవులు పైన ఆధారపడి జీవించేవారు. వీరు ఒకప్పుడు అడవుల్లో జీవిస్తూ రానురాను మైదానాల్లోకి వచ్చి స్థిరనివాసాలేర్పాటు చేసుకున్నారు. అడవిలో దొరికే తేనె, విప్పపూలు, ఔషధాలకు పనికివచ్చే వేర్లు, అడవిలో పెరిగే వెదుర్లతో బుట్టలు, బొమ్మలు, ఆకులు వంటివి అమ్ముకొని జీవించేవారు. అలాంటి గిరిపుత్రుల్ని గిరిజనులు అంటారు.

ప్రపంచంలో అనేక జాతులున్నాయి. ఒక జాతి నుంచి మరో జాతిని వేరుచేసే చిహ్నాల్లో ఆ జాతి మత విశ్వాసాలు, వారి ఆచార వ్యవహారాలు, వేషభాషలు, జాతి నివాసం ముఖ్యమైనవి. విద్య, విజ్ఞానం, కళలు, వినోదాలు, విలాసాలు, ఆటలు, నమ్మకాలు అనే అంశాలు జోడించ వచ్చు. పై చెప్పబడిన అంశాల సమష్టి స్వరూపం ఒక జాతి సంస్కృతిగా రూపొంది, ఒక జాతి నుండి మరో జాతిని వేరు చేస్తుంది. ఒక సమాజం తరాల నుండి అలవాటుగా ఆచారంగా జన జీవనంలో కలిసిపోయిన భావాలు ఆలోచనలు సమాజానికి ఒక నిర్ణీత జీవన ధోరణిని అలవరుస్తాయి.

ఆటవికులు ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగారు. వారు రకరకాల పిట్టల కూతలు, నడకలు హొయలు వినివిని, చూసిచూసి వారిలో అవి జీర్ణించుకొని పోయి అనేక నృత్యాలుగా పరిణమించాయి. ఆంధ్రదేశంలో కొండల ప్రాంతంలో నివసించే గిరిజనుల ఎన్నో ప్రత్యేక నృత్యాలు చేస్తారు. గదబలు, గోండులు, కొండరెడ్లు, లంబాడీ వారి వారి ఆచారాల్ని బట్టి నృత్యాలు రూపొందించుకున్నారు.

గోండులు, కోయలు వర్షఋతువు ఆరంభంలో 'భూమాత'ను పూజించి నృత్యం చేస్తారు. చెంచులు నేటికి చెంచులక్ష్మి, నృసింహస్వామి వేషం వేసి వీధి నాటకాన్ని ఆడతారు. చెంచుల నుండి వేరైన వారే యానాదులైనారని ఒక అభిప్రాయం ఉంది. యానాదులు వీధి భాగోతాలు వేసి జీవిస్తారు.

గిరిజనులు అడవిలో అక్కడొక ఇల్లు దూరదూరంగా ఏర్పరచుకోనుంటారు. వారందరు కలిసి జంతుదాడి కాని, గిరిజనేతరుల నుండి ఎదురైన సమస్య నుండి బయట పడటానికి ఒకచోట జమకావాలి. జమకావడానికి వీరు తుడుంని ఉపయోగిస్తారు. తుడుం మోత వినబడిన దగ్గరకి అందరు వచ్చి కలిసి మాట్లాడుకొంటారు. తుడుం కొట్టడం, డప్పుకొట్టడం కూడా కళే.

గిరిజనులు సామూహికంగా గానం చేస్తారు. సంతానం కలిగినపుడు, బారసాల సమయం, వధూవరులు ఒకరి నొకరు ఎన్నుకొనేటపుడు, అంత్యక్రియలు, వరినాటే సమయం, పొలం దున్నే సమయం పంటలు పండన పుడు, కోతలు, అతిథులొచ్చినపుడు, సాగనంపే సమయంలో పాటలు పాడుతారు. జలజల పారే నీటి గలగలలు, పెళపెళ మంటూ మోగే మేఘ గర్జనల నుండి వివిధ తాళగతుల్ని గిరిజనులు తమ సంగీతంలో మేళవించారు. గోండులు గీతాలు పాడడానికి లక్ష్యం దేవతల్ని కొలవడం, కొండ వ్యవసాయంలో శ్రమ ఉపశమనానికి పాటలు పాడుతారు.

**సవరల పాట :**

"సిగురేసిన పెట్టమ్మా..... పాట
కెరటాల గెడ్డమ్మా ..... పాట
ఉలికించే పూపమ్మ .... పాట
ఊరికి వూపిరమ్మా ... పాట
సావులేనిదమ్మ పాట సారమైనదీ పాట...."

**కోయల గీతం :**

పెళ్ళైన కొత్తజంటకు బతుకు పయనం పాట ద్వారా తెలియజేస్తారు.

"అడవిలో బతుకులూ ఆపదలమయమే
దున్నినా దుక్కి ఏసినా పైరూ నోటి కందేదాక
కంటికీ రెప్పగా కాపాడుకోయే
ఎమరు పాటున రెప్ప వేశావంటే
పైర కంకులెల్ల పిట్టలాపాలై - అడవి పందూలెల్ల
ఆగమూచేసే!"

గిరిజన నృత్యాలలో స్వేచ్ఛగాసాగే అవయవచాలనం ప్రధానం. ఏరకమైన అడ్డంకులూ లేకుండా ప్రవహించే భావ స్రవంతి ఇక్కడ అంగ చలనాన్ని నడుపుతుంది. ఆనందం నుండి విచారం వరకూ ఉండే అన్ని రకాల భావచ్ఛాయలూ ఇక్కడ స్పష్టంగా భాసిస్తాయి. చూసేవారికి నృత్యాలు కళాఖండాలుగా కనిపించినా, వాటిని ప్రవర్తించే వారికి అవి ఆచారంలో భాగం.

ఆంధ్రప్రదేశంలో గిరిజనులకు ఎవరికి వారికి ప్రత్యేక మైన నృత్య పద్ధతులున్నాయి. నృత్యాలను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు. మత, సాంఘీక, వినోదాత్మకమైన నృత్యాలు. నృత్యం చేయడానికి కాలికొమ్ము కొమ్ముడప్పు, కొమ్ముబూర, డప్పు, రోలు, డోలుకొయ్య, తూర్పులి, దస్మా. పారా వంటి సంగీత సాధనాలు వాడుతారు. డప్పు దరువు అనుసరించి నృత్యం చేస్తారు.

**ధింసానృత్యం :**

చైత్రమాసం పండుగలప్పుడూ, వివాహాదిశుభ కార్యాలలోనూ, ఆడా, మగా, పిన్న, పెద్దలు తేడాలు లేకుండా అందరూ ఈ నృత్యోత్సవంలో పాల్గొంటారు. ఈ సమయంలో ఒక పల్లె నుంచి మరో పల్లెకు పోతూ, వాళ్ళిచ్చే సామూహిక భోజనాలు స్వీకరిస్తూ జనం ఆనందిస్తారు. ఈ నృత్యం ఇలాపల్లె పల్లెలో నెరిపే వారిని 'సంకిడి కేల్చరు' లంటారు. అందువల్ల ఈ నృత్యం కేవలం వినోదం కోసం మాత్రమే కాక, మనుషుల మధ్య సౌభ్రాతృత్వాన్ని కలిగించడానికి ఉపయోగపడుతుంది. మోరి, కిరిది, తుడుము, డప్పు, జోడు, కొమ్ములు అనేవి ఈ నృత్య సందర్భంలో ఉపయోగించే వాద్యాలు. ధింసా నృత్యంలో ఎనిమిది రకాల భేదాలు కనిపిస్తాయి.

**బోడ ధింసా :**

గ్రామదేవతలను పూజిస్తూ చేసే నృత్యం. కుడివైపు మగవాళ్ళు. ఎడమవైపు ఆడవాళ్ళు వరసలో బారులు తీరి వీపు వెనక నుంచి చేతులు పోనిచ్చి ఒకరి నడుము ఒకరు పట్టుకుంటారు. కుడి వరుసలోని మొదటి వ్యక్తి అడుగులు కదుపుతూ ముందురాగా, ఎడమ వరసలోని చివరి వ్యక్తి అతణ్ణి కలుసుకోవడం జరుగుతుంది. అప్పుడు మిగిలిన నృత్య కారులంతా, పాములు వలె మెలికలు తిరుగుతూ హరి, హుయి అని ఆనందాతిశయంతో అరుస్తూ తిరిగి, చివరకు మళ్ళీ తమతమ వరుసల్లో చేరిపోతారు.

ఆదిలాబాద్ జిల్లాలోని రాజగోండులకు దీపావళి చాలా పెద్దపెండగ. అప్పటికి పంటయింటికి వచ్చి వాతా వరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంటుంది. గోండులు రంగు రంగుల వస్త్రాలు ధరించి, ఆభరణాలు వేసుకుని, గుంపులు గుంపులుగా చుట్టుపక్కల పల్లెలకు పోయి సామూహిక భోజనాలు చేస్తారు. ఊరుని, ఊర్లోని పిలా ్లపెద్దా చల్ల గుండాలని ఆశీర్వదిస్తారు. ఈ గుంపుల్ని 'దండారి' గుంపులంటారు. లేదా గుస్సాడిలంటారు. ఒక్కో గుంపుకు 20 నుంచి 40 వరకూ మనుష్యులుంటారు. ఈ పెద్ద గుంపు నుంచి అంతర్భాగంగా ఇద్దరు గానీ, అయిదుగురుగానీ చేరిమరో గుంపు కడతారు. పౌర్ణమి నాడు మొదలై తిరిగి బహుళ చతుర్దశి వరకూ ఈ నృత్యాలు కొనసాగుతాయి. ప్రతివాడూ నెమలి యీకలు పొదిగిన, పెద్ద తలపాగా ధరించి, జింక కొమ్ములీ్న, కృత్రిమమైన మీసాలనూ, గడ్డాలను తగిలించుకుంటారు. ఒంటికి మేక చర్మం చుట్టుకుంటారు. వీళ్ళకు సహాయంగా డప్పు, తుడుం, పిప్రి, కాలికొమ్ము వంటి వాద్యాలు మోగుతుంటాయి. గుమేలా ధ్వనిస్తుండా దండారీ గుంపు క్రమ విన్యాసంతో లయబద్ధంగా అడుగులు కదుపుతూ నృత్యం చేస్తుంది. నృత్యం పరాకాష్ట నందుకున్న

తరుణంలో గుస్సాడి గుంపు హఠాత్తుగా మధ్యకు జొరబడుతుంది.

నాయకుడు మొదట గొంతెత్తి పాడుతాడు. మొత్తం గుంపుదాన్ని అందుకుంటూ నృత్యాన్ని కొనసాగిస్తారు. దండారీవలయం చెదిరిపోగా, చూసే వాళ్ళకు బెదురు కలిగేటంత భీకరంగా పెద్దపెద్ద అంగలు వేస్తూ, గంతులతో, పొలికేకలు పెడుతూ నృత్యాన్ని నిర్వహిస్తారు. వలయం చుట్టు మూగి ఉన్న ప్రేక్షకుల దగ్గరికి కూడా వచ్చి వాళ్లను తమ చేతుల్లో ఉన్న కర్రలతో తాకి వాళ్ళకు గిలిగింతలు కలిగిస్తారు. చిన్న పిల్లల్ని భయభ్రాంతుల్ని చెయ్యడం పెద్దవాళ్ళను తమ కొంటె చేష్టలతో నవ్వించడం ఇవన్నీ నృత్యంలో భాగాలే. నృత్యం అయిన తరువాత గ్రామస్థులు వారి కాళ్ళు కడిగి గౌరవం చూపుతారు.

దండారీ కథలో గుసాడీ నృత్య ప్రస్తావన కనిపిస్తుంది. "ఈ లాంఛనాలు గుసాడీలు వెళ్లే ప్రతి వూళ్లో జరుగుతాయి. ఇవి పూర్తయిన తర్వాతే గుసాడీల నృత్యం".

**వీధి భాగవతం :**

వీయానాదులు వీధి నాటకాలు, భాగోతాలు వేస్తారు. హరిశ్చంద్రుడు, భీముడు, కృష్ణుడు, కీచకుడు వంటి పౌరాణిక పాత్రలతో నాటకాలు వేస్తారు. నాటకాలు వేస్తూ జీవిస్తున్న యానాది కుటుంబ ప్రస్తావన కథలో కనిపిస్తుంది.

"వీళ్ళది యానాది కులమైనా నా మొదటి నుండీ వీళ్ల వీధి నాటకాలూ, భాగోతాలూ, పాటలూ నేర్చుకొని ఊరూరా నాటకాలాడి జీవనం చేసుకొనేవాళ్ళు".

**తుడుం కొట్టడం :**

నగారాని తుడుం అంటారు. ఇది ఒక చర్మ సాధనం. తుడుం మోగితే గిరిజనులకు ప్రమాదం జరగబోతుందని సూచన. దాంతో గిరిజనులందరు జాగరూకులవుతారు. గూడేలన్ని సమైక్య బాట నడవడానికి ఉపయోగపడే సాధనం. తుడుంకొట్టడం కూడా ఒక కళ. తుడుంమోత ఇంటింటికెళ్లి మనిషి పిలిచినట్లు ఉంటుంది. పంచాయితీ ఏర్పాటు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోడానికి గిరిజనులందరిని ఒక్కచోట చేరుస్తుంది.

"తుడుం పట్టుకొని - కొండమీదికి పరుగెత్తాడు. మరో పదినిమిషాల్లో ఖాకి బట్టలోల్లు గూడెంలో ప్రవేశించడం నగారా మోగడం ఒక్కసారే జరిగాయి. తుడుం టట్టర టట్టర మోగుతూనే ఉన్నది. ప్రమాదాన్ని సూచిస్తూ గూడెంలోకి అడుగు పెట్టిన ఖాకి బట్టల వాళ్ళ నాయకుడు బెదిరి బెదిరి చూశాడు తుడుం ఆగిపోయింది. మళ్లా దూరంగా ఎక్కడో తుడుం మోత అతని ఉబ్బు చెంపల మీది కంటా చెమట అసహ్యంగా కారు తుండగా బిక్విక్ - గుడిసెల్లో వెతకండి అర్డరేశాడు".

గూడెం పటేల్ ఎగోదిఆవు ఇస్రూని తుడుం కొట్ట మంటాడు. పంచాయితీ ఏర్పాటుకు తుడుంమోగిస్తారు.

"ఇంకా తిండికాలేదురా - తుడుంగొట్టుపో - పంచాది మర్సినవా? అన్నాడు. ఇస్రూ నీళ్ళు గటగటతాగి తుడుం తీసుకొని బొగడమీది బంగళా దిక్కు పరుగెత్తాడు టట్టర... టట్టర.... టరటర ... టరటర.. తుడుం మోగుతోంది. గాభర గాభరగా కాకుండా ఉండీ ఉండీ గుడిసె గుడిసెకు మనిషిబోయి పిలిచినట్లుగా తుడుం మోగుతుంది. గోండు గుడిసెల్లో కలకలం. ఒక్కొక్కరే ఎముకులు తేలినవాళ్ళు - చిరిగిన బట్టల వాళ్ళు. కంపలాటి నెత్తులున్న స్త్రీలు - పిల్లలు నెత్తుకొని ఒక్కొక్కరే బొగడ మీద చేరుతండ్లు - తుడుం మోత వినవచ్చినంత మేరకు చుట్టు పక్కల గూడేల వాళ్ళు ఆ ఊరికేసినడువ సాగిండ్లు".

**వేట :**

గిరిజనులు వేటపై ఆధారపడుతారు. పక్షులు, జంతువులను వేటాడేటపుడు పలురకాలైన వేటసామాగ్రిని ఉపయోగిస్తారు. అవి గంధ్రగొడ్డలి, గద, గుణపం, గేలం, గుప్పిడి, బొడంకర్ర, విల్లంబులు, బాణాలు మొదలైనవి. పులి, ఎలుగుబంటి వాటినుండి రక్షించుకోడానికి చురకత్తుల్ని ఉపయోగిస్తారు. దొడిశెను కోతుల్ని పిట్టల్నిచప్పుడు చేసి తరమడానికి ఉపయోగిస్తారు. వేటలో మంచి నైపుణ్యం కలిగుంటారు. ఒక్క బాణంతో పులిని చంపే

వీరులు గిరిజనుల్లో కనిపిస్తారు. అరణ్యరోదన కథలో కొర్సఈరయ్యకు వేటాడటంలో ఉన్న ప్రావీణ్యం తెలుపబడింది.

"సారూ! గీ వీని పేరు కొర్స ఈరయ్య మంచి వేటగాడు, గురిచూసి బాణం యిడ్సిపెట్టిండంటే చిటారు కొమ్మన కూసున్న పిట్ట తలకాయల ఉన్న కన్ను ఊడి పడాల్సిందే".

**కుక్క :**

గిరిజన జీవితంలో కుక్క ఒక భాగం. గిరిజనులు వేటాడటానికి వెళ్లినపుడు కుక్కకూడా వారి వెంటే ఉం టుంది. జంతువుల్ని చాకచక్యంగా పట్టుకొనే నైపుణ్యం కలిగివుంటాయి. వేటమాత్రమే కాదు తమ యజమానికి అన్యాయంతల పెట్టిన వారిని చంపి రక్తాన్ని కళ్ళ చూసేంత వరకు నిద్రపోదు.

కుక్క యజమానికి వేటలో సహాయకారిగానేకాక, యజమాని శత్రువుల్ని అంతం చేసే విశ్వాస పాత్రంమైంది కూడా వేటకుక్క కథలో కుక్క కోయకన్నె మున్నీకి వేటలో సాయంగా ఉంటుంది. ఆమె ఫారిస్టాఫీసరుని వల్ల మోసపోయి చనిపోతుంది. రాజా "యెగిరి అతని గుండెల మీద పడింది. రాజా వాడైన పళ్ళతో అందిన చోటల్లా కండలు ఊడొచ్చేలా పీక సాగింది. ఆ బాధకు తట్టు కోలేకున్నాడు రాజారామ్ లోయలో పడి ప్రాణాలు కోల్పోవడం మేలనుకొని దూకేసాడు". కుక్క గిరిజనుని జీవితంలో భాగంగా కథల్లో చిత్రించబడింది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కోయతెగ - సంస్కృతి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా సంస్థ (సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ), భద్రాచలం.
2. తెలుగు కథా సాహిత్యం - గిరిజన జీవితం, ద్రావిడ విశ్వవిద్యాలయం, డాక్టర్ జి.శైలమ్మ
3. సంచార స్రవంతి - డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి
4. పగటి వేష కళాకారులు సాంస్కృతక జీవనం, 2010, రమేష్‌భట్టు, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు.
5. కొండరెడ్డి గిరిజనుల జీవన విధానం, 2010, రమేష్‌భట్టు, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్లు.

❖❖❖

# మానవ సంబంధాల సంఘర్షణ 'ఆసు'

– డా॥. మహమ్మద్ హసేన, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ), నల్లగొండ.

కళ్ల ముందున్న భౌతిక ప్రపంచానికి, మదిలో మెదులు తున్న / కదులుతున్న ఊహా ప్రపంచానికి మధ్య సమన్వయం చేసేవాడే కవి. రెండింటి మధ్య తేడాను గమనిస్తూనే వాస్తవిక ప్రపంచంతో పాటు ఊహా ప్రపంచంలో విహరింపజేసేవాడే కవి. అందుకే 'రవి గాంచని చోట కవిగాంచున్' అన్నారు పెద్దలు. ఊహా శక్తికి, కల్పనాశక్తికి అవధులు ఉండవు అనేది జగమెరిగిన సత్యమే. అందుకే కవి యొక్క కల్పనా చాతుర్యము, అతను పాఠకులను తన్మయత్వంలో ముంచెత్తి ఆనంద పరవశులను చేస్తే ఆ ప్రక్రియ ఉద్దేశ్యం నెరవేరినట్లే. డా॥ వెల్దండి శ్రీధర్ గత మూడు దశాబ్దాలుగా సాహిత్య రంగంలో అనేక పాత్రలు పోషిస్తూ విభిన్నమైన రచనా దృక్పథంతో విమర్శ, కవిత్వం, పరిశోధన, కథారచన మొదలైన ప్రక్రియల్లో రచనలు చేస్తూ ఎప్పుడు మనల్ని పలకరిస్తూనే ఉంటారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వీరు అందరకీ సుపరిచితులే. ఇటీవలనే వీరు 'ఆసు' కవితా సంపుటిని వెలువరించారు. వీరు వృత్తిరీత్యా సహాయ ఆచార్యులుగా ఉన్నప్పటికీ జన్మత: వచ్చిన వృత్తి 'మగ్గం' పని. ప్రస్తుతం పద్మశాలీల జీవితాలు ఏ దశలో ఉన్నాయో 'ఆసు' కవితను చదివితే కన్నీళ్లు రాక మానవు.

"చినుకుల అలికిడి కోసం
నేల నేలంతా నోళ్లు తెరుచుకొని
ఎదురు చూస్తోంది
కాసింత పదన కోసం
దేహం దేహమంతా
కళ్ళు చేసుకొని చూస్తోంది"

'ఒక్క వాన కోసం' శీర్షికతో ఉన్న ఈ కవితను చదివితే 'వాన' యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. వాన అలికిడి కోసం ఎంతో కాలంగా భూమి అదే విధంగా కర్షకుడు ఒళ్లంతా కళ్ళు చేసుకొని ఎదురు చూడడం కొత్తేమీ కాదు. వాన చినుకులతోనే ప్రకృతి పులకరిస్తుంది. ఆ వాన చినుకు లేకపోతే ప్రకృతి, దానిపై ఆధారపడి మనుగడ కొనసాగించే చెట్టు పుట్ట మిగతా జీవజాలం ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ కవితను చదివిన తరువాత శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'ప్రతిజ్ఞ' కవిత గుర్తుకు వస్తుంది. అందులో కూడా 'పొలాలనన్నీ హలాల దున్నీ, ఇలాతలంలో హేమం పండగ' అంటూ కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం శరీర స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు అంటూ ముగిస్తాడు. వెల్దండి శ్రీధర్ కవితలో కూడా

"నాగటి మట్టిని ముద్దాడాలని, కుమ్మరి కుండ అమృతంతో నిండిపోవాలని, కమ్మరి కొలిమి భుగ భుగ మండిపోవాలని జాలరి వలలు కొర్ర మీనుల్ని కౌగిలించు కోవాలని, పనిముట్లన్నీ వాన స్పర్శతో జీవం పోసుకోవాలని" ఒక ఆశావాద దృక్పథంతో కవితను ముందుకు నడిపిన తీరు బావుంది. దీనితో పాటుగా ఈ కవితను చదవగానే నాకు ఆ మధ్య కాలంలో వచ్చిన ఖైదీ నెంబర్ 786 సినిమాలో రామజోగయ్యశాస్త్రి వ్రాసిన 'నీరు నీరు రైతు కంట నీరు చూడనైన చూడరెవ్వరు' అంటూ సాగిన పాట నీటి ప్రాముఖ్యత, వాన చినుకు ప్రాధాన్యత గుర్తుకు వచ్చింది.

"కొంగబావతోని నునుగారపు సోపతి
ఈదులాడే 'బంగారుతీగ'ల సోయగం
సాకలి బండ మీద వదులుతున్న ఊరి మురికి
నీటి అలల మీద ఆత్మగౌరవంతో
కదిలిపోతున్న కోటొక్క పూల సింగిడి"

ఈ కవితలో కూడా 'గుండె చెరువు' పేరుతో నెర్రెలుబారిన చెరువును చూసి చలించిన హృదయంతో అక్షరాలలో పొదిగారు. చెరువు నిండినపుడు జలసిరులు,

అందులోని బంగారుతీగలు, ఊర్లోని బట్టలు చాకలి రేవు చేరి మలినాన్ని చెరువు నీళ్లతో వదిలించుకొని మురిసి పోవడాన్ని విశదీకరించారు. అలాగే నీరు లేనపుడు ఎండిపోయి నెర్రెలుబారిన చెరువును అందరం కలిసి చేయి చేయి కలిపి బాగుచేయాలని చైతన్యపరుస్తూ ముగించటం బాగుంది. "చేయి చేయి కలుపుదాం! అరువు చేసైనా చెరువుకు ప్రాణం పోద్దాం!!" అనడం బాగుంది. చెరువు జీవకళతో, జలకళతో ఉంటేనే ఊరికి ప్రాణం.

"ఎప్పుడు ఎవరు సెలవంటూ
దూరం అవుతారో తెలీడం లేదు
నిన్నటి దాకా కలిసి నడిచిన అడుగు
కలిసి తిరిగిన భుజం
చేయి కలిపిన చేయి
మాట కలిపిన మాట
ఇవాళ బూడిదల కలిసిపోతున్నాయి"

'మట్టిపాట' శీర్షికతో ఉన్న ఈ కవితను చదివిన తరువాత మనస్సు ఉద్వేగంతో నిండిపోయింది. పదాలు ముందుకు కదలలేదు. నిన్నటి వరకు భుజం తట్టి తోడు నడిచిన మిత్రుడో, రక్త సంబంధీకుడో తెల్లరాగానే చని పోయాడన్న వార్త వింటే ఎంతగా కదిలిపోతామో! అంత ఉద్వేగభరితంగా సాగుతుందీ కవిత. 'జాతస్య హి ధ్రువో మృత్యుః' అన్న గీతా సారాన్ని గుర్తుకు తెస్తుందీ కవిత. చివర్లో "మట్టిదెపుడూ తెర వెనక పాత్రే కానీ జీవన సూత్రాలన్నీ దాని చేతిలోనే. నడిపించేది గుండె చప్పుడే అనుకుంటాం. మట్టి హృదయపు సవ్వడి విన్న వాడిదే బతకు పల్లవైనా చరణమైనా" అంటూ ముగిస్తారు ఈ కవితను. ఇంతటి పరిపక్వమైన వాక్యాలు ఎవరికైనా జీవిత సారాన్ని జీవన గమనాన్ని అనుభవిస్తేనే అక్షరాల రూపంలో జాలువారుతాయి. అద్భుతం ఈ కవిత.

"ఆటుపోట్లను
బడబాగ్నులను
తన గుండెలోనే
దాచుకునే నిశ్చల సముద్రం
కుటుంబ భారాన్ని
భుజానికెత్తుకొని
పొదరిల్లును పదిలంగా కాపాడే జీవగర్ర.."

'నాయిన' శీర్షికతో ఉన్న ఈ కవితను చదివి భారంగా వ్రాయాల్సి వచ్చింది. ఆ లోటును నేను కూడా అనుభవిస్తున్నాను. ఎంతగా వ్రాసిన ఒడువని కావ్యం 'నాయిన'. ఎంత చెప్పినా తీరని వేదన, రోదన నాయిన ధీరత్వం. నాన్నే కదా! ప్రతి కుటుంబానికి నాయకుడు. ముందుకు నడిపించే కెప్టెన్. నాన్న ఓ ఉద్వేగం, ఓ సముద్రం, నాన్న ఓ ప్రశాంత వాతావరణంలా కనిపించే అద్భుతశక్తి. నాన్న ఉన్న ప్రపంచంలో రంగురంగుల జీవితం నాన్న పోయాక రంగులు వెలసిన జీవితం ఇంతకు మించి ఏమి వ్రాయగలను కన్నీటి వాక్యాలు తప్ప.

"సూర్యుని చుట్టు భూమి తిరిగినట్టు
పోగులన్నీ ఆసు చుట్టే తిరుగుతాయి
కళ్లతో పాటు చేతులు కూడా
ఆసు చుట్టూ ప్రదక్షిణ చేస్తాయి
ఏ వస్త్రమైనా
అవ్వ మునివేళ్లలోనే పురుడుపోసుకుంటుంది"

ఈ కవిత 'ఆసు' శీర్షికతో వ్రాయబడింది. బట్టను తయారు చేసే యంత్రం 'ఆసు'. దారాలన్ని ఒక్కటై 'ఆసు' చుట్టూ తిరిగితేనే ఆకారం దాల్చుకుంటాయి. ఏ బట్ట ఐనా అవ్వ మునివేళ్లలో తయారు కావాల్సిందే అంటూ ఊచ నుండి దారాన్ని పీల్చడమంటే దేహం నుండి ప్రాణ వాయువును త్యాగం చేయడమే. నాగలి లేనిదే పంటను పండించలేనట్లు 'ఆసు' లేనిదే బట్టను నేయలేం అనే పోలిక బావుంది. మరయంత్రాల 'కాబూసు'లో చిక్కుకు పోయిన అన్న అస్థిపంజరమై తేలి శ్వాస కోసం తన్లాడు తున్నాడు. ఇప్పుడు 'ఆసు' మౌనంగా అశ్రువులను కారుస్తోంది అంటూ ముగిస్తారు ఈ కవితను. ప్రపంచీకరణ పైత్యం నరనరాన జీర్ణించుకున్న మనిషి ఆధునిక యంత్రా లను ఆహ్వానించడం వలన పాత కాలం నాటి చేనేత మగ్గాలు మూలకు పడే స్థితి దాపురించింది. నేసిన బట్టతోనే ఆత్మహత్య చేసుకోవడం అంటే చేనేత రంగం

ఎంత దీన స్థితిలోకి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ జెండాను తయారు చేసే చేతులే నేడు పని లేక పస్తులుండడం బాధ కలిగించే విషయం. ఈ కవితను చదివితే గోరటి వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల' అంటూ 'సాలెల మగ్గం సడుగులిరిగినవి' అన్న వాక్యాలు గుర్తుకు వచ్చినవి.

ఈ 'ఆసు' కవితా సంపుటిలో మొత్తం 60 కవితలున్నవి. అన్నీ ఆలోచింపజేసేవే. ఒకటి అని చెప్పలేము. ఈ కవితా సంపుటి చదివితే ఎన్నో జ్ఞాపకాలు, ఎన్నో విషాదాలు కళ్లవెంట కదలాడుతాయి. పచ్చని సిరుల పంట, పొలాలు, చెరువులు, చిన్నప్పటి బాలాజి డిపో ఎక్కాల పుస్తకం, మట్టి పరిమళం, మోదుగుపూల వాసన, వాన చినుకుల ప్రాముఖ్యత, రొట్టె, బడిపిల్లలు, ఎండాకాలం, ఆఖరి మజిలీ.. ఇలా ఒకటేమిటి అన్ని కవితలు గుండె లోతుల్లోకి వెళ్లి మనిషిలోని మానవత్వాన్ని తట్టిలేపుతాయి. దీనికి జూకంటి జగన్నాథం 'రోకు' పేరుతో ముందుమాట వ్రాసి పుస్తకానికి మంచి రూపం ఇవ్వటం కొసమెరుపు.

**ఆధార గ్రంథాలు :**

1. అసు (కవిత్వం) - వెల్దండి శ్రీధర్.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 05, May 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# నర్మద నది పుష్కర మహాత్మ్యము

– డా॥. పడాల జగన్నాథరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గవర్నమెంట్ డిగ్రీ & పిజీ కాలేజ్, ఖైరతాబాద్.

మన దేశంలో ఎన్నో మహానదులు ఇంకెన్నో ఉప నదులు ప్రవహిస్తున్నాయి. మన దేశంలోలాగానే ఇతర దేశాల్లో కూడ ఎన్నో నదులు ప్రవహిస్తున్నాయి. కానీ మన నదులకు ఇతర దేశాల్లో నదులకు తాత్త్వికంగానే ఎంతో తేడా వుంది. అక్కడ సమాజం ఆ నదులను కేవలం జల కేంద్రాలుగా, తమ జీవనానికి ఉపయోగించే జలాశ్రయాలుగా చూడడమే జరుగుతుంది. వేదకాలం నుంచి జలాలు మనకు దేవతలు. హిమపర్వత శిఖరాగ్రం నుంచి పొంగి పొర్లి మహోత్సాహంతో ఉరకలు వేస్తూ ప్రవహించే భాగీరథి దగ్గర నుంచి కుగ్రామం ప్రక్కగా సన్నగా పారుతున్న చిన్న నది వరకు మనమొక పవిత్రభావాన్ని తరతరాలుగా పెంపొందించుకున్నాం. వాటిని నదీమ తల్లులని ఎంతో గౌరవంగా మన తల్లులతో సమానంగా పూజిస్తున్నాం.

భారతదేశము మృత్యులోకానికి ఉత్తమాంగములో ఉన్నది. దీనివల్ల భారతదేశంలో భాషా-శరీర సౌందర్యాదుల యొక్క ప్రకృతి యొక్క అపూర్వమైన పూర్ణత్వము కనబడుతోంది. భారతదేశంలో అరుంధతి, సీత, సావిత్రి, దమయంతి మొదలు పాతివ్రత్య ధర్మపరాయణులైన స్త్రీలు, ధ్రువ, ప్రహ్లాదాదులు అయిన భక్తప్రవరులైన బాలకులు, హరిశ్చంద్ర, యుధిష్ఠిరాదులు సత్యవ్రత పరాయణులు ధర్మాత్ములైన రాజులు, శిబి, దధీచి, బలి, కర్ణ మొదలగుదాతలు, వసిష్ఠ విశ్వామిత్రాదులైన తపస్వినులు, రామకృష్ణాదులైన అవతారములు, యాజ్ఞవల్క్య, పతంజలి మొదలగు యోగులు, మార్కండేయ, కపింజలాదులైన మునులు, అత్రి, భారద్వాజ వామదేవాదులైన ఋషులు, వాల్మీకి, వ్యాసాదులు అయిన గ్రంథప్రణేతలు మహర్షులు, గౌతమ కణాదులైన దార్శనికులు, అనసూయ, లోపాముద్రా దమయంతీ నర్మదాదులైన, తపస్వినులు (స్త్రీలు) మదాలస, సుకన్యాదులైన సద్గృహిణులైన స్త్రీలు, భారతదేశము యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు. భారతదేశమునందు పరస్పరము ఆచార-విచార-వ్యవహార - వేషాభూషా - భాషాదుల యొక్క భేదము ఉన్నప్పటికిని అందరు రామకృష్ణాది అవతారములను భావిస్తారు, జన్మాంతరమును అంగీకరిస్తారు. శ్రాద్ధాదులయందు నమ్మకమును పొందుతారు, దేవతా పూజాదుల యందు ప్రవర్తిస్తారు. తీర్థయాత్రాకములను చేస్తారు, దానాలు చేస్తారు. పూజ్యులయందు శ్రద్ధను చూపుతారు. గోవులను రక్షిస్తారు, పరోపకారమునందు ప్రయత్నిస్తారు. పాప కర్యాములను చేయరు.

తపస్తపన్తిమునయః జుహ్వతే చాత్రయజ్వినః ।
దానాని చాత్ర దీయస్తే పరలోకార్థమాదరాత్ ॥
(శివపురాణమ్. ఉ.సం.16-16)

ఇతర సామాన్యనదులందును తటాక కూపోదకాదులందును స్నానము జేయునప్పుడు "యోసౌ సర్వగతో విష్ణుః" అను శ్లోకమును పఠించిన చాలును. కొందరు "గంగాగంగేతి" అను శ్లోకమును గూడ పఠించుట కలదు. భాండోదక స్నానమునందు నీటిలో దర్భనువేసి యుంచ వలెను. నర్మద నదీస్నానమును జేసిన పిమ్మట వరుణునికి నమస్కారముచేసి నదీజలముతో మూడర్యములు విడువ వలెను. మళ్ళీ ఒకసారి స్నానముచేసి నదికిని, సూర్యునకు అర్ఘ్యము లియ్యవలెను. గంగకర్ఘ్యము నీక్రింది శ్లోకము చదువుచు నియ్యవలెను.

శ్లో॥ బ్రహ్మకమండలు సంభూతే ! పూర్ణచంద్ర నిభాననే!
త్రైలోక్య వందితే దేవి ! గృహాణార్ఘ్యం నమోస్తుతే.
సూర్యునికి
నమస్తే కమలా నాభాయ నమస్తే జలశాయినే ।
నమస్తేస్తు హృషీకేశ గృహాణార్ఘ్యం మయాహృతమ్ ॥

ఇది సామాన్యంగా స్నానవిధి. ఇతరకర్మలను చేయువారు తదంగములుగా జేయవలసిన స్నానములను గ్రంథాంతరములందుగాని, తద్జ్ఞుయొద్ద గాని తెలుసుకొనవలయును. ఈ విధమైన నిత్యస్నానమును శిరమలమును తొలగించుకొనుటకే కాక ఆత్మశుద్ధికొరకు

భక్తిభావముతో చేయుటయవసరము. స్నానము ముగిసిన పిమ్మట (సద్యాదులందుచేసినప్పుడు మాత్రము)

శ్లో॥ యన్మయా దూషితం తోయం శారీరమలసంభవం ।
తస్య పాపవిశుద్ధ్యర్థం యక్ష్మాణాం తర్పయామ్యహమ్॥

అను శ్లోకము చదివి, దోసెడు నీళ్లు నదియొడ్డుపైన అర్ఘ్యంగా వదలవలెను. దానితో స్నానము పూర్తియగును.

బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొకనదికి పుష్కరం వస్తుందని మనకు తెలుసు. అయితే పుష్కరుడు అంటే ఎవరు ? అన్న సందేహం కలుగుతుంది కదూ ! ఈ కథ వినండి.

పూర్వం తుందిలుడనే మహర్షి ఉండేవాడు. ఆయన చాలకాలం పరమేశ్వరుణ్ణి ఆరాధించాడు. ఆయన దయవల్ల 3 1/2 కోట్ల పుణ్యతీర్థాలకు రాజై, పుష్కరుడు అనే ప్రసిద్ధి సంపాదించాడు. ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలమయ మూర్తిలో ప్రవేశించి ఈశ్వరుడే అయినాడు. ఇలా వుండగా ఒకప్పుడు బ్రహ్మ తన తపస్సుతో పరమేశ్వరుణ్ణి సంతోషింపచేసి అన్ని కోర్కెలను తీర్చే పుష్కరుణ్ణి సృష్టికార్యం కోసం తనకిమ్మని అడిగాడు. అలాగే అన్నాడు ఈశ్వరుడు జలరూపంలో వున్న పుష్కరుణ్ణి తన కమండలంలో పెట్టుకొని బ్రహ్మ సృష్టిచేస్తున్నాడు.

ఇంకొంత కాలానికి బృహస్పతి బ్రహ్మను మెప్పించి పుష్కరుడు తనకు కావాలని కోరుకొన్నాడు. సరేనన్నాడు బ్రహ్మ. కాని పుష్కరుడు బ్రహ్మను వదలి వెళ్ళడాని కిష్టపడలేదు. ఎట్లాగో ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం బృహస్పతి కొత్తగా ఒకరాశిలో ప్రవేశించినపుడు మొదటి 12 రోజులు, చివరి 12 రోజులు మిగతా రోజుల్లో మధ్యాహ్నం 4 ఘడియలు మాత్రం పుష్కరుడు. బృహస్పతి ఆధీనంలో వుండాలి. ఆ సమయంలో దేవగణాలందరితో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించాలి. ఈ ఒప్పందం ప్రకారంపై చెప్పిన పుష్కర కాలాల్లో 3 కోట్ల 50లక్షల పుణ్యతీర్థాలకు అధిపతియైన పుష్కరుడు బ్రహ్మ మొదలగు దేవతలందరితో ఆయా నదుల్లో బృహస్పతితో కలిసి నివసిస్తాడు. కాబట్టే ఆ నదుల్లో దేవతలందరి సాన్నిధ్యంవల్ల చెప్పలేనంత ప్రభావముంటుంది. అప్పుడు ఆచరించిన స్నాన, తర్పణాది కర్మలన్నింటికీ మనకెంతో పుణ్యం కలుగుతుందీ.

జలమును పవిత్రము చేయుకాలమే పుష్కరము. ఈ పుష్కరకాలమందు సమస్త దేవతలు, ఋషులు, పితరులు, మూడున్నరకోట్ల తీర్థములు ఆయా నదీ జలములతో కూడి హితమును కల్గిస్తాయి. కావున అట్టి శుభ సమయమున స్నాన-దాన-జప-హోమ-అర్చన-పిండప్రదానాది వైదికకర్మలను ఆచరించుటవలన మహోన్నతమైన ఫలము లభించును. సాధారణ దినము లలో చేయుట కంటె పుష్కరకాలంలో చేసినట్లు అయితే అధిక ఫలప్రదము అవుతుంది. సూర్యుడు పండ్రెండు రాశులలో ఒక్కొక్క రాశి యందు ప్రవేశించినపుడు ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క నదికి పుష్కరము ఏర్పడు చుండును.

| | గురుడు ప్రవేశించురాశి | నది | సంవత్సరం |
|---|---|---|---|
| 1. | మేషరాశి | గంగ | 2023 |
| 2. | వృషభరాశి | నర్మద | 2024 |
| 3. | మిథునరాశి | సరస్వతి | 2025 |
| 4. | కర్కాటకరాశి | యమున | 2026 |
| 5. | సింహరాశి | గోదావరి | 2027 |
| 6. | కన్యారాశి | కృష్ణ | 2028 |
| 7. | తులారాశి | కావేరి | 2029 |
| 8. | వృశ్చికరాశి | భీమ | 2030 |
| 9. | ధనూరాశి | పుష్కరవాహిని | 2031 |
| 10. | మకరరాశి | తుంగభద్ర | 2032 |
| 11. | కుంభరాశి | సింధు | 2033 |
| 12. | మీనరాశి | ప్రాణహిత | 2034 |

దేవ గురువు బృహస్పతి మే 1వ తేదీ నుంచి వృషభ రాశిలోకి ప్రవేశించాడు. దీంతో నేటి నుంచి నర్మదా నది పుష్కరాలు ప్రారంభమయ్యాయి. భారతదేశంలోని పన్నెండు పవిత్ర నదులలో ఒకటైన నర్మదా నదిని పూజించేందుకు, శుద్ధి చేసేందుకు అంకితం చేసే పుష్కరాలు ఇవి

**నర్మద ష్కరస్నానము :**

ఈ పుష్కర సమయంలో అందరూ స్నానాన్ని దానాన్ని

ఆచరించవచ్చు. ఎన్నో పుణ్యకార్యాలు ఈ సమయంలో 4చేయాలని శాస్త్రాలు చెపుతున్నాయి. కాని వాటన్నింటి లోకి ముఖ్యమైంది. ఎంతో ఫలితాన్నివ్వగలిగింది పుష్కర స్నానం. దైవ, ఆర్ష, మానవ, ఆసుర భేదంతో నాలుగు రకాలు అని బ్రహ్మపురాణం చెబుతున్నది. త్రిమూర్తుల చేత ప్రవర్తింపచేయబడేవి మొదటి తరగతికి చెందు తాయి. అలా మొదటి తరగతికి చెందిన గంగ, గోదావరి మొదలగువాటితో నర్మద పరిగణింపబడింది. సహజంగా ఇలాంటి గొప్ప ప్రభావం కలిగి పుష్కరకాలంలో 3 1/2కోట్ల పుణ్యతీర్థాలలో ప్రకాశించే నర్మదలో లో స్నానం చేయడం ఎంతటి అదృష్టవంతులకు సాధ్యమవుతుందో మీరే ఊహించండి.

నీళ్ళకింత విలువా ? అని కొందరంటారు. నీళ్ళల్లో రెండు రకాల శక్తులున్నాయని వేదం చెప్తుంది. మురికిని పోగొట్టడం, దాహాన్ని తీర్చడం అనే లౌకికశక్తి అందరికి తెలిసిందే. ఇంకా అతీంద్రియమైన దైవికశక్తికూడా ఒకటివుంది. అది 'మేధ్యం' 'యజ్ఞ్యం' అని రెండు రకాలు. అందులో 'మేద్యం' అనే శక్తి స్నాన ఆచమనాదుల ద్వారా మన పాపాన్ని పోగొడ్తుంది. 'యజ్ఞ్యం' అనే శక్తి ప్రోక్షణాదుల ద్వారా ద్రవ్య శుద్ధిని కలిగిస్తుంది. ఈ రెండూ కంటికి కనబడేవి కావు. ఆ ఫలితం కలగడానికి అలాంటి భావన ముఖ్యం. పుష్కర సమయంలో నర్మద నదిలో స్నానం చేస్తే గంగ. గోదావరి మొదలైన నదుల్లో 12 సంవత్సరాలు ప్రతిరోజూ స్నానం చేసిన ఫలితం కలుగుతుందని, పూర్వ జన్మల్లో మనస్సు, వాక్కు, శరీరమనే త్రికరణాలతో చేసిన అన్ని పాపాలు నశించి మోక్ష ప్రాప్తి కలుగుతుందని బ్రహ్మాండపురాణం చెప్తున్నది. అంతేకాదు. చాలా శ్రమపడి చేయవలసిన ఆశ్వమేధయాగం కంటే ఎక్కువ ఫలితాన్ని నర్మద పుష్కరస్నానం మనకిస్తుందని మనవిశ్వాసం ఇంకా నర్మదాతీరంలో తపస్సు, కురుక్షేత్రంలో దానం, కాశిలో మరణం ఈ మూడు మోక్షాన్నిస్తాయని పద్మపురాణం పేర్కొన్నది.

పుష్కరసమయంలో ప్రాతఃకాలస్నానం ఉత్తమ మైందని, మధ్యాహ్నస్నానం మధ్యమమని, అవరాహ్ణ స్నానం అధమమైందని శాస్త్రాలు చెప్తున్నాయి. అవకాశ మున్న వారు పుష్కరవిధిని ఆచరించడానికి ముందురోజే రెండుపూటలో, ఒకపూటో ఉపవాసం చేసి మరుసటిరోజు ఉదయం ముండనం చేయించుకొని స్నాన, దాన, శ్రాద్ధ. తర్పణాదులు నుందుంచడం ఉత్తమం. స్నానం చేసిన తర్వాత స్నానఫలం సిద్ధించడానికి నర్మద- తీర్థ రాజ, బృహస్పతి - బ్రహ్మ. విష్ణు - మహేశ్వర - ఇంద్రాది దేవతలకు అర్ఘ్యప్రదానం చేసి అటు తర్వాత ధర్మార్ఘ్యాలు ఇవ్వమని బ్రాహ్మణులకు తగిన దక్షిణలనివ్వమని ముత్తైదువులకు వాయనాలను ఇవ్వమని పుష్కర స్నానకల్పం చెప్తుంది.

స్మరణాత్ సర్వపాపఘ్నీం దర్శనాత్ పుణ్యదాయినీం।
స్నానేన ముక్తిదామ్ నర్మదవాహినీం ప్రణమామ్యహమ్॥

కేవలం స్మరణం చేత సర్వ పాపాలు తొలగిపోతాయి దర్శనభాగ్యంతో పుణ్యం లభిస్తుంది. స్నానం వల్ల ముక్తి లభిస్తుందని నర్మద మహిమ వివరించబడింది.

సంప్రదాయంలో స్నానానికి తొలిస్థానం ఉంది. పుణ్య తీర్థాల్లో స్నానం చేసే విధానాన్ని, స్నానంలోని రకాలను వేరువేరు పురాణాలు ప్రత్యేకంగా తెలియజేశాయి. స్నానానికి దిగగానే నమో నారాయణాయ అనుకుంటూ తన చుట్టూ తీర్థకల్పాన్ని నిర్దేశించుకొని గంగను ఆవాహన చేసుకోవాలి. గంగా నామాలతో స్నానం చేస్తున్న నీటిని ఏడుసార్లు అభిమంత్రించి, మూడుసార్లు తలపై పోసుకోవాలి.

**ఆధార గ్రంథాలు :**

1. కృష్ణ తరంగిణి, డా॥లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, 2016
2. పుష్కరవేణి, డా॥ఎస్.బి.రాఘునాథాచార్య, 1981
3. మత్స్య పురాణము, విద్వాన్ కల్లూరి వేంకటదీక్షితులు, 1952
4. యాత్రా మార్గదర్శి (దక్షిణ-ఉత్తర భారతాలు), రాగం వేంకటేశ్వర్లు, 1953

❖❖❖

భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# పాటల బాటసారి 'గోరటి వెంకన్న'

- డా॥. బోయిన్‌పల్లి ప్రభాకర్, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వ), నిజామాబాద్.

ఎక్కడ మనుష్యులుంటే అక్కడ సమస్యలుంటాయి
ఎక్కడ సమస్యలుంటే అక్కడ పోరాటముంటుంది
ఎక్కడ పోరాటముంటే అక్కడ పాట ఉంటుంది

ఆ 'పాట' గోరటి వెంకన్న అవుతాడు. 20వ శతాబ్దం ఆఖరి దశకంలో తన ఆట-పాటతో జనం ముందుకు వచ్చిన గోరటి వెంకన్న, 21వ శతాబ్దం తొలిదశకంలో మహాగాయకునిగా, సహజకవిగా-ఈ కాలపు మహాకవిగా తన్ను తాను 'పాట'కు పర్యాయపదంగా మలచుకున్నతీరు అద్భుతంగా తోస్తుంది. మరెంతో ఉదాత్తంగా అని పిస్తుంది.

పల్లెను చూస్తే పరవశమౌతాడు గోరటి వెంకన్న - పల్లె కూడా వెంకన్నను చూస్తే పాటల ఊటలా మారిపోతుంది. ప్రకృతితో మమేకమౌతాడు వెంకన్న - ప్రకృతి కూడా వెంకన్నపాటలో తనకు తానే కొత్తకొత్తగా పాడుకుంటుంది, ఆడుకుంటుంది కూడా. నిరంతర పరిణామశీలమైన ఈ ప్రపంచాన్ని నిశితంగా పరిశీలించే గోరటి వెంకన్న తన పాటలో తెలంగాణ పల్లెల వాస్తవ పరిస్థితుల్ని, శ్రామిక, దళిత, బహుజన కులాల ఆచార వ్యవహారాలను, మానవ సంబంధాలను, సంస్కృతిని - ఆ పల్లె ప్రజల భాషలో తనదైన పాటలో కళ్ళకు కట్టినట్లుగా ఆవిష్కరిస్తారు.

వెంకన్న కవిత్వంలోని వైశాల్యం అపరిమితం - అనంతం కూడా. పల్లెలు, ప్రకృతి, పట్టణాలు, ఉద్య మాలు, జీవితానికి సంబంధించిన సకల అంశాలు, తాత్వికపరమైన చింతనలతో కూడిన విలక్షణమైన బాట - వెంకన్నపాట. అందుకే వెంకన్న ఆడి పాడిన పాటలతో మనమందరం గొంతు కలుపుతున్నాం. అందులోని సంవేదనలకు తలలూపుతున్నాం.

ఉద్యమాల్లో పాల్గొనే వేళ వెంకన్న పదునెక్కిన పాటే అయ్యాడు. అప్పుడతని గొంతు కొత్త రాగాల్ని అందు కుంది. అతనికున్న నిశిత అవగాహన విశాలదృష్టినిచ్చింది. అప్పుడు పాటకున్న బలం - బలగం అర్థమైంది. ఇక పాటలో కవితాత్మక సౌందర్యం పెంపొందడానికి - తారాస్థాయిని అందుకోవడానికి తాను పుట్టి పెరిగిన నేల - తెలంగాణా మట్టి పాలమూరు జిల్లా స్వభావం, విస్తృతాధ్యయనం కారణాలుగా కనబడుతాయి.

ఎందరో కవులను పోషించి, తెలంగాణాలో సాహిత్య వికాసానికి పెద్దపీట వేసిన సంస్థానాల ఖిల్లా పాలమూరు జిల్లా. ఇక్కడి తెలకపల్లి మండలం గౌరారం పల్లెలో 4 ఏప్రిల్ 1964వ సంవత్సరంలో గోరటి నర్సింహ, ఈరమ్మ లకు జన్మించిన పాటల ఊట గోరటి వెంకన్న. స్వతహాగా జానపద కళాకారుడైన తండ్రి మౌఖిక వాఙ్మయ వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వెంకన్న పాఠశాల దశలోనే తనదైన ముద్రవేస్తూ కీర్తనలు, పద్యాలు రాయటం; పాటలు పాడటం; ఏకపాత్రాభినయంతో పాటు రంగస్థల నాటకాలు వేయడాన్ని ఇష్టంగా అలవరుచుకున్నాడు. పాఠశాల విద్యను గౌరారం, రఘుపతిపేటలో పూర్తిచేసిన వెంకన్న కల్వకుర్తిలో ఇంటర్, జడ్చర్లలో 1985లో డిగ్రీ పూర్తిచేశాడు. హైదరాబాద్‌లోని ఆంధ్రసారస్వత పరిషత్ కళాశాలలో ఎం.ఏ.లో చేరిన కొద్దికాలంలోనే ఏ.పి.పి. ఎస్.సి. నిర్వహించిన గ్రూప్-4 పోటీ పరీక్షల్లో ఓపెన్ కేటగిరిలో 13వ ర్యాంకు సాధించి 1987లో నాగర్ కర్నూల్‌లో కో-ఆపరేటివ్ విభాగంలో జూనియర్ అసి స్టెంటుగా చేరి వివిధ పదోన్నతులు పొంది ప్రస్తుతం సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్నారు.

పాఠశాల దశలోనే పరిచయమేర్పడిన వామపక్ష విద్యార్థి రాజకీయాలు, కళాశాల దశలో వెంకన్నను భాగస్వామిని చేసుకొని ఎన్నో కీలక బాధ్యతలను నిర్వ హించేలా చేశాయి. 1987 తర్వాత ఎం.ఎల్. పార్టీలతో, పౌరహక్కుల ఉద్యమాలతో, విప్లవోద్యమాలతో, సాహిత్య సాంస్కృతికోద్యమాలతో పరిచయం కాస్తా వెంకన్నను

పదునెక్కిన పాటగా, అసలు పాటకు పర్యాయపదంగా దిద్ది తీర్చింది. అటు తర్వాత వెంకన్న తిరిగి చూడలేదింక.... ఒక సమున్నత ఆశయంతో ఈ విశాల ప్రపంచాన్ని తనదైన నిశిత, తాత్విక దృష్టితో పరిశీలించే వెంకన్న మహాగాయకుడిగా, వాగ్గేయకారుడిగా గుర్తించబడ్డాడు. ఆయన నుండి అలవోకగా జాలువారిన పాటలే ఏకు నాదం మోత, రేలపూతలు, అలసెంద్రవంకలయ్యాయి. ఇటీవల ఆ పాటకు తెలంగాణా ప్రభుత్వం కాళోజీ సాహిత్య పురస్కారంతో పట్టాభిషేకం చేయడాన్ని గమనిస్తే ఉద్యమపాటకు ఒక సమున్నత స్థానాన్నిచ్చి గౌరవించి నట్లైంది.

గోరటి వెంకన్న తనను కవిగా పిలవడాన్నే ఇష్ట పడతాడు. తన పాటల్లో ఉన్నదంతా కవిత్వమేనంటాడు. ఏకునాదం మోత పుస్తకంలో ప్రకృతితో మమేకమైన వెంకన్నను ప్రకృతి కవిగా పిలిస్తే దాన్ని ఒక అద్భుతంగా స్వీకరిస్తాడు. ప్రకృతి పచ్చదనం తన పాటకు పత్ర హరితంగా భావిస్తాడు. ప్రకృతిని అర్థం చేసుకోవడం, ప్రకృతిలో ఉన్నదాన్ని ఉన్నట్లుగా అర్థం చేసుకోవడం మరియు ప్రకృతి రహస్యాన్ని అర్థం చేసుకోవడాన్ని ఆధునికతగా చెప్తాడు. ప్రకృతిని ధ్వంసంచేసి; ప్రకృతికి, ప్రకృతిలో భాగమైన మనుషులందరికి సంకటంగా మార్చేది అభివృద్ధి, ఆధునికతలు కావంటాడు. అర్థ రహితమైన ఆధునికతకు వ్యతిరేకి గోరటివెంకన్న.

'గోరెంక పిట్టల సవ్వడేమాయె / రంగు పాలపిట్ట ఏ రాజ్యమెల్లె /
కొంగబావల నింగి బారులేమాయె / పలికేటి సిలకల అలికిడేమాయె /
గంతులేసే జింక గుంపులేమయిపాయె / కుందేలు మందల పరుగు పంద్యాలేవి....'

అనే ప్రశ్నల్లో ప్రకృతిపై మనిషి స్వచ్ఛందంగా ఆధి పత్యాన్ని వదులుకోవాలని, అలా చేస్తేనే ప్రకృతి సమ తుల్యత ఏర్పడుతుందని వెంకన్న పాట మనల్ని ప్రకృతి లోకి పయనించేలా చేస్తుంది.

'కిరీటమేమో భారమై వున్నది / కిందేసితే నడక భలె వున్నది /
చెప్పులు లేకున్న మేలన్నయి / ముండ్లు తుప్పలేవొ తెలిసి తెలిసి పోతున్నవి/
కాలిమట్టికేదొ మహిమున్నది / తేళ్ళు పురుగులు తొలగిపోతున్నవి'

అని వెంకన్న - మనుష్యులు తమ స్వార్థాన్ని వదులు కొని ప్రకృతికి లోబడి, ఇంకా చెప్పాలంటే ప్రకృతితో మమేకమై జీవించమంటాడు.

'పల్లే కన్నీరు పెడుతుందో /
కనిపించని కుట్రలో - తల్లీ బందీయై పోతుందో /
కుమ్మరి వాముల తుమ్మలు మొలిసెను / కమ్మరి కొలిమిలో దుమ్ము పేరెను /
పెద్ద బారిశ మొద్దు వారినది / సాలెల మగ్గం సడుగులిరిగినవి /
చేతివృత్తుల చేతులిరిగిపోయే నా పల్లెల్లోనా /
గ్రామస్వరాజ్యం గంగలోన పాయే నా పల్లెల్లోనా'
॥ పల్లే కన్నీరు ॥

గోరటి వెంకన్న పేరు చెప్పగానే చాలామందికి గుర్తుకు వచ్చేపాట ఇదే. గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా వచ్చిన పాటల్లో దీనిదే అగ్రతాంబూలం. 1997లో రాసిన ఈ పాటలో మొత్తం 19 చరణాలున్నాయి. గ్లోబల్ విధ్వంసంలో నేటి పల్లెల దుస్థితిని దృశ్యమానం చేసిన ఈ పాట ఒక మహాకావ్యానికున్నంత గౌరవాన్ని పొందింది. నేటి పల్లెల్లో వచ్చిన వేగవంతమైన మార్పులు, శతాబ్దాలుగా నడుస్తున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు గ్లోబల్ విధ్వంసానికి గురికావడం; వాటితోపాటు మానవ సంబం ధాలు అడుగంటిపోవడం లాంటి వర్తమాన జీవన విధ్వంస విషాధాన్ని నిక్షిప్తం చేసిన ఈ పాటకు నేపథ్యంగా రఘుపతిపేట గ్రామాన్ని సజీవ సాక్ష్యంగా చూపిస్తారు. పల్లెలు మారి గుడిసెల స్థానంలో భవంతులు వచ్చినా, ఆ ఇళ్ళలో దీపం పెట్టడానికి ముసలివారు తప్ప మనుషులే లేరని, పదిమంది ఇళ్ళు కడితే ఎనిమిది

మంది పల్లెను విడిచి, చేస్తున్న వృత్తులను వదిలేసి బతుకుతెరువు వెదుక్కుంటూ వలసపోయారు. రఘుపతి పేట ఒక్కటేకాదు, పల్లెల అవస్థ అన్నిచోట్లా ఇంతే కదా! అనే దాంట్లో వెంకన్న ఆవేదన, ఆక్రోశం మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

'వాగు ఎండిపాయెరో / పెదవాగు తడిపేగు ఎండి పాయెరా/
అందాల దుందుభి అలసెంద్రవంక / జలమెరుపుతీగ తడి పరుపుబండ/
ఆరుగాలం పారే వాగుల/ ధారసైతంలేక ఎండె....'

అనే వెంకన్న పాట విన్నప్పుడు మన గుండె చెరువవు తుంది. తానుచూసిన, ఈదులాడిన, నీటి జలతారులతో, ప్రవాహాలతో కళకళలాడిన దుందుభివాగు ఎండి పోవడంతో పట్టరాని దు:ఖానికి లోనైన వెంకన్న గొంతు నుండి జాలువారిందీపాట.

'సంచారమే ఎంతో బాగున్నది / దీనంత ఆనందమే డున్నది /
ఇల్లు పొల్లులేని ముల్లెమూటలేని / వెంబడించే వెర్రి జ్ఞాపకాలు లేని....'

అనే 'సంచారం' పాటను గమనిస్తే జనజీవనంలో ఉంటూ అన్ని బంధాల్లో చిక్కుకుని, అనుభవిస్తూ కూడా - తామరాకు మీది నీటిబొట్టు చందంగా - ఒక బైరాగి తత్త్వంతో జీవితాన్ని దర్శించడం, అనుభవించడం, అది చిక్కనైన పాటగా రూపాంతరం చెందడం గోరటి వెంకన్న లోని విశిష్ట లక్షణంగా చెప్పవచ్చు. సంచారమంటే కాళ్ళతో తిరగమని కాదు. ఎవరైనా ఒక్కచోట ఆగకూడదు. నిరంతర చలనశీలమైన జగత్తులో నిరంతరం ప్రయాణిం చాలి. ఆలోచనలు ప్రయాణించాలి. ఆసక్తులు ప్రయాణిం చాలి. మార్క్సిజం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం ఇవన్నీ ప్రయాణాలేనని, అవి ఆగిపోవద్దని, చలనశీలంతో మనిషి నిత్యసంచారం చేయాలంటాడు వెంకన్న. అలా అనడమే కాకుండా పాటల ప్రవాహమే అయ్యాడు.

గోరటి వెంకన్న - ఒక కదులుతున్న పాటల ఇంద్ర ధనుస్సు అని కె.శివారెడ్డి అభివర్ణించడాన్ని నూటికి నూరుపాళ్ళు సజీవ సత్యంగా పేర్కొనవచ్చు. ప్రకృతితో పెనవేసుకున్న - శ్రమతో అల్లుకుపోయిన జనజీవన దృశ్యాన్ని వెంకన్న పాటలు అలా అలలు అలలుగా కదుపు కుంటూపోతాయి. మనకు తెలిసిన మనుష్యులు -పని పాటలు చేసుకునేవాళ్ళు, ఊళ్ళు - ప్రదేశాలు, చెట్టు - చేమలు, పొలాలు - కాలువలు, మెట్ట ప్రాంతాలు - కరువు బతుకులు ఇలా అన్నిటికీ జీవంపోసి తనపాటలో నింపుకుంటాడు. దేన్నీ వదలడు. ఇతరులు చూడని కోణంలో దర్శిస్తాడు. సమస్త ప్రపంచం తన పాటల్లో ఇమిడి పోవాల్సిందే. పాటకు నిలువెత్తు కళారూపం గోరటి వెంకన్న. జానపద కళాకారుని కంటె ఒక ఆధునిక వాగ్గేయకారుడే వెంకన్నలో మనకు దర్శనమిస్తాడు. అందుకే ఒక బైరాగిలాగా, భక్తకవిలాగా, తాత్త్వికునిలాగా తన పాటలద్వారా లోకాన్ని మేల్కొల్పడం ఆయన పాటల్లోని విశిష్టతగా చెప్పవచ్చు. కలేకూరి ప్రసాద్ ఓ సందర్భంలో... 'గోరటి ఎంకడు బతికున్న కాలంలోనే మనం పుట్టినందుకు గర్వపడాలి. వాడొక బైరాగి, వాడొక పాటల చనుబాలు, వాడొక నిర్లక్ష్యపు బాటసారి, కుపిత ఆకాశనేత్రంలోని ఎర్రని జీర గోరటి వెంకన్న' అని పల్కిన మాటలు అక్షర సత్యాలు.

**ఆధార గ్రంథాలు :**

1. గోరటి వెంకన్న 'అల సెంద్రవంక'
2. గోరటి వెంకన్న 'రేలపూతలు'
3. గోరటి వెంకన్న 'ఏకునాదం మోత'
4. తెలంగాణ ఉద్యమాలు - పాట - సి.కాశీం
5. తెలంగాణ సాహిత్య విమర్శ - డా.యాకూబ్
6. పాలపిట్ట - ఏప్రిల్ 2010 మాసపత్రిక

❖❖❖

# హోళీ పండుగ చారిత్రక నేపథ్యం

- డా॥. లక్ష్మణ్ నాయక్ బానోత్, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరు, యాదాద్రి భువనగిరి జిల్లా.

యావద్భారత ఖ్యాతి నార్జించిన పండుగల్లో రమణీయమైన రంగుల పండుగ హోళీ, పాల్గుణ శుద్ధ పౌర్ణమికి కాముని పున్నమ అని పేరు. భారతదేశంలో పాటు ప్రపంచంలోని భారతీయులు హోళీ పండుగు అత్యంత ప్రాధాన్యమిస్తూ జరుపుకుంటారు.

వసంతం అడుగిడే వేళ ప్రకృతి రసాకృతి దాల్చి హరిత వర్ణాశోభ సంతరించుకుంటుంది. ఆమని రాకతో అంతటా నవ్యానందం ప్రకటితమవుతుంది. వ్యక్తుల్లో కొత్త చైతన్యం వెల్లివిరుస్తుంది. వసంతానికి శుభ స్వాగతం పలుకు తుంది. నవనవలాడే లేత చిగుళ్ళు రాగిరంగు నుంచి ఆకు పచ్చ రంగులోకి మారే తరుణంలో పలు వర్ణల్లో పుష్పాలు గుబాళిస్తుండంగా ఆనందం, ఉత్సాహం, ఉల్లాసం, హాస్యం, శృంగారంతో కలగలిపిన రంగులను విరజిమ్మే కమనీయమైన పండుగ హోళీ విచ్చేస్తుంది.

తెలుగుదేశంలో కొండవీటి రెడ్డిరాజుల కాలం నుండి హోళీ ఉత్సవాలు జరిగాయి అనడానికి ఆధారాలున్నాయి. విజయ నగర రాజులు తమ రసికతను అనుగుణంగా హోళీ సందర్భంగా కామోత్సవాన్ని ఇంకా గొప్పగా జరిపే వారు.

హోళీ పండుగ పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకోవడం, కాలాన్ని నిర్ణయించడం సాధ్యమయ్యేపని కాదు. ఈ పండుగను అత్యంత పూర్వకాలం నుంచి జరుపు కుంటున్నారని పురాణాల వల్ల తెలుస్తుంది. వైదికకాలంలో హోళీని 'నవాస్నేష్టి యజ్ఞం' అనేవారు. పొలంలో సగం పక్వమైన, సగం పచ్చిగా ఉన్న ధాన్యం తెచ్చి హోమాగ్నిపై ఆవుపాలతో పాయసం తయారుచేసేవారు. ఆ క్షీరాన్నాన్ని 'హోళీ'గా వ్యవహరిస్తూ, ప్రసాదంగా స్వీకరించేవారు. అందువల్ల దీన్ని 'హోళికోత్సవం'గా చెప్పేవారు. వేద మంత్రోచ్చారణలతో, అగ్ని ఆరాధనా క్రతువుగా హోళీ జరుపుకొనే సంప్రదాయం అనాదిగా ఉంది. ఆ పరంపర కామదహనం పేరిట నేటికీ కొనసాగుతోంది. జనావాస కూడళ్లలో పెద్ద జ్వాలను ఏర్పాటుచేసి, ఆ మంట చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అగ్ని ప్రసాదమైన బూడిను నుదుట ధరిస్తారు. విభూతిధారణవల్ల దుష్టశక్తులు ధరిచేరవని విశ్వసిస్తారు. మధుర మీనాక్షిదేవి తపోదీక్ష చేపట్టి, సుందరేశ్వరస్వామి మెప్పించి, ఈ ఫాల్గుణ పౌర్ణమినాడే వివాహం చేసుకుందని చెబుతారు. దక్షిణ భారతంలోని దేవాలయాల్లో హోళీనాడు కల్యాణివ్రతం నిర్వహిస్తారు.

వేదకాలానికి పూర్వం హోలిక అనే రాక్షసి భూమిపైన అప్పుడే జన్మించిన పసిపాపలను సంహరించి తినేదట. ఆ కాలానికి చెందిన శ్వేతక్రతువు అనే రాజు బ్రహ్మ విద్యను సంపాదించి హోలికను చంపాడని ప్రతీతి. ఆ రాక్షసి మరణించిన రోజు కావడం వల్ల ఈ పండుగకు హోళీ అనే పేరు వచ్చిందని కొన్ని గ్రంథాలు చెబు తున్నాయి.

దేశవ్యాప్తంగా హోళీ పండుగకు సంబంధించి ఓ గాథ ప్రాచుర్యంలో ఉంది. హోళీ పండుగ ఒక హేల! అదొక కామ దహన జ్వాల శివ పురాణాన్ని అనుసరించి అందానికి ఆకర్షణకు మూలపురుషుడైన ఇంద్రప్రేరితుడైన మన్మథుడు లోక కల్యాణం కొరకు తపస్సులో ఉన్న శివుణ్ణి భంగం కలిగించి ఆ దేవుని తలుపులను ప్రణాయాభి ముఖంగా చేయాలని వసంత ఋతువును ఆ కాలంలో సృష్టించి కామ ప్రేరితుని చేసి ఆ స్థాణువుపై తన పుష్ప భాణాలను వదిలాడు. ఘోర తపస్వి మనస్సు చలించింది. కారణం తెలుసుకొని తన మూడో కన్ను తెరిచి పూవిల్లుని వైపు చూస్తాడు శివుడు. కాముడు బస్మమయ్యాడు. మన్మథుని క్షమించమని తనను పార్వతి ప్రాధేయపడిన అనంతపురం శివుడు శాంతించాడు. ప్రజలందరి మనస్సులో జీవించమని మరుని ఆశీర్వదించాడు. ఆ కామదహన స్మరణే హోళీ జరుపుకోవడానికి కారణం అని కామాన్ని అణచడమే సంకేతంతో కామ దహనం పండుగ చేస్తారని ఆచారంలో ఉంది.

శివుడు కాముని దహనం చేసినందుకు సంకేతంగా కాముని పేరుతో పాత వస్తువులను భోగి మంటలుగ చేసి కాల్చడం కూడా ఉంది. ఉత్తర భారతదేశంలో అయితే హోళీకి అనే రాక్షసి బొమ్మను తయారుచేసి దాన్ని కాల్చుతారు."

హోళీకి సంబంధించిన పురాణ కథలనేకం లంబాడాల మౌకిక ప్రచారంలో ఉన్నాయి. హిరణ్య కశిపుడు రాక్షస రాజు. అతని సోదరుడైన హిరణ్యాక్షుని శ్రీ మహావిష్ణువు చంపాడని విష్ణుమూర్తిపై పగబట్టి బ్రహ్మను గూర్చి కఠోర తపస్సు చేసి అనేక వరాలు సంపాదిస్తాడు. దిక్కులన్నీ జయించి రాక్షస రాజ్యాన్ని పాలిస్తూ దేవతలందరి హింసిస్తుంటాడు. దేవతలందరూ శ్రీమన్నారాయణుని శరణు కోరగా విష్ణుమూర్తి వారిని ఓదారుస్తూ హిరణ్య కశిపునికి నలుగురు పుత్రులు కల్గుతారు. అందులో ప్రహ్లాదుడు తన తల్లి గర్భంలో ఉండగానే నాకు ప్రియభక్తుడు అవుతాడు. అతణ్ణి కన్న కొడుకుని కనికరం లేకుండా ఎప్పుడైతే హిరణ్యకసిపుడు హింసిస్తాడో! అప్పుడు అతన్ని సంహరిస్తానని దేవతలకు అభయమిస్తాడు.

బ్రహ్మకోసం హిరణ్యకశిపుడు భయంకరమైన తపస్సు చేస్తుండగా అతని భార్య లీలావతిని ఇంద్రుడు హింసిస్తాడు. నారదుడు ప్రత్యక్షమై అతని బారినుండి లీలావతిని కాపాడి తన ఆశ్రమానికి తీసుకెళ్లి ఆశ్రయ మిస్తాడు. ఆ ఆశ్రమ పరిసరాలన్నీ హరినామ స్మరణతో మారుమోగుతుంటాయి. అందులో అడుగుపెట్టిన లీలావతి తన గర్భస్థ శిశువుతో సహా శ్రీమహావిష్ణువుకు భక్తురాలవుతుంది. జన్మతః విష్ణుమూర్తి భక్తుడైన ప్రహ్లాదుడు అతని యందే మనస్సు నిలిపి అన్నం తింటూ, నీళ్లు తాగుతూ, మాట్లాడుతూ, నవ్వుతూ, వినోదిస్తూ, నిద్రపోతూ శ్రీహరి ధ్యానమండే నిమగ్నుడై ఈ ప్రపంచాన్నే మరచేవాడు.

ప్రహ్లాదుడు గొప్ప వివేకవంతుడు. సర్వప్రాణులను సమానంగా చూసేవాడు సజ్జనులను చూడకుండా నిప్పులో తోయిస్తాడు. విషప్రయోగం చేయిస్తాడు. అయినా ప్రహ్లాదుడు చెక్కుచెదరడు. ఏనుగులతో తొక్కించినను, పర్వతాల నుండి కిందికి తోసివేసినను అతనికి ప్రాణహాని కలుగదు. చివరకు హిరణ్య కశిపుని చెల్లెలు హోళిక ప్రహ్లాదుణ్ణి తన ఒడిలోకి తీసుకొని అగ్నిలోకి ప్రవేశిస్తుంది. మంటల్లో నశించని వరం పొందినదైనను హోళిక హరి భక్తుని స్పర్శ వల్ల హోలిక శక్తి సన్నగిల్లి అగ్నిజ్వాలలో కాలి బూడిదవుతుంది. హరినామస్మరణ చేస్తున్న శ్రీమన్నా రాయణుని ప్రియభక్తుడు ప్రహ్లాదునికి ఏమాత్రం హాని జరుగదు. అప్పటి నుండి ప్రతి ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు చతుర్ధశినాడు హోళి దహనం చేస్తుంటారు.

ప్రసిద్ధి గాంచిన ఈ భారతీయ పురాణం శ్రీ మహా భాగవతంలోని ప్రహ్లాదుని కథ లంబాడాల మనోఫలకంపై చెరగని ముద్ర వేసిందని చెప్పవచ్చు. హోళిక అగ్నిలో ఆహుతయ్యే వృత్తాంతాన్ని లంబాడాలు గేయాలుగా పాడుతుంటారు. రాయలసీమ ప్రాంతంలో సుగాలీలు పాడే ప్రశ్నోత్తరాల రూపంలో ఉండే హోళీ పాట.

ప్ర. పహెలి హోళీ కతె బళిచె కూణ్ బాళో చె?
జ. బాదర్ బండ టాండేమా సత్తాయిస్ భూక్య హోళి బాళే చె
ప్ర. హోళిరి మలకేర్ నామ్ కాయి చె?
జ. హోళిరి మలకేర్ నామ్ మనమధ కామా ఛె
ప్ర. హోళిరి బాపేర్ నమ్ కాయి ఛె?
జ. హోళిరి బాపేర్ నామ్ గంగా హిరణ్యాక్ష ఛె
ప్ర. హోళిరి భతిజేర్ నామ్ కా కాయి ఛె?
జ. హోళిరి భతిజేర్ నామ్ ప్రహ్లాద్ ఛె
ప్ర. హోళిరి గోదేమా ప్రహ్లాద్ కాయి వేగో?
జ. హోళిరి గోదేమా ప్రహ్లాద్ హోతోతో

**భావం :**

ప్ర. మొదట హోళి దహనం ఎక్కడ చేశారు?
జ. మొదట హోళిని బాదర్ బండా తండలో 27 గోత్రాల భూక్య రాథోడ్ వంశం వారు కాల్చారు.
ప్ర. హోళిక ఉండే దేశమేది?
జ. హోళిక మదనకామ దేశంలో ఉండేది.
ప్ర. హోళిక తండ్రి పేరేమి?
జ. హోళిక తండ్రి పేరు గంగా హిరణ్యాక్షుడు
ప్ర. హోళిక తండ్రి మేనల్లుడు పేరేమి?
జ. హోళిక మేనల్లుడు పేరు ప్రహ్లాదుడు.

ప్ర. హోళిక ఒడిలో ప్రహ్లాదుడు ఏమయ్యాడు?

జ. హోళిక మంటలు రగిలినపుడు ఆమె ఒడిలో ప్రహ్లాదుడు కూర్చొని ఉన్నాడు.

ఈ విధంగా లంబాడాలు సంవాద రూపంలోనూ, గేయ రూపంలోనూ హోళిక కథను చెప్పకుంటారు. బంజారాలు చెప్పుకునే ప్రహ్లాదుని మరోకథ ప్రచారంలో ఉంది. హిరణ్య కశిపుని చెల్లెలు హోళిక ప్రహ్లాదుని తీసుకొని స్వర్గలోకంలో ప్రవేశిస్తుంది. దేవతలు బొందితో స్వర్గానికి వచ్చినందుకు కోపించి వెళ్లగొడతాడు. హోళిక ప్రహ్లాదుణ్ణి తన ఒడిలో కూర్చొబెట్టుకొని నిప్పంటించు కుంటుంది దేవతలు అమృతంతో తడిపి ఇచ్చిన రుమాలు ప్రభావంతో ప్రహ్లాదునికి ప్రమాదం సంభవించదు. కానీ హోళిక మాత్రం అగ్ని జ్వాలల్లో భస్మమవుతుంది.

హోళికి సంబంధించిన మరికొన్ని కథనాలు ప్రచారంలో ఉన్నాయి. దూండ్ అనే రాక్షసుడు పసి పిల్లలను పట్టుకొని తినేవాడు. ఇలా వెయ్యిమంది బాలలను భక్షిస్తాడు. ఒకరోజు హిరణ్యకశిపుడు శ్రీరామ భక్తుడైన తన పుత్రుడు ప్రహ్లాదుని తీసుకొని తినమంటాడు. రాక్షసుడు ప్రహ్లాదుని పట్టుకొని తినబోతాడు. ప్రహ్లాదుడు రామనామాన్ని జపిస్తాడు. అప్పుడు భగవంతుని రూపంలో ఉన్న శ్రీరాముడు వచ్చి రాక్షసునితో యుద్ధం చేసి అతణ్ణి వధిస్తాడు. ప్రహ్లాదుడు రక్షింపబడతాడు. ప్రజలందరూ సంతోషంతో రాక్షసుణ్ణి దహనం చేస్తారు.

పూర్వం కాముడనే రాక్షసుడు కామాంధకారంతో వావి వరసలు లేకుండా కామాన్ని రెచ్చగొట్టే గేయాలను పాడుతూ సంచరించేవాడు. అతడు ఫాల్గుణ మాసశుద్ధ చతుర్ధశినాడు చనిపోయాడు. అతడు అనాథ ఇంటికొక కట్టెను ఒక పిడుకను భిక్షమడిగి సాముహికంగా దహన సంస్కారాలు జరిపారు.

ఖమ్మం జిల్లా పరిసర ప్రాంత తండాల్లోని లంబాడాలు దూండ్ అనే రాక్షసుడి బొమ్మను తయారు చేసి పెద్ద మంటల్లో దహనం చేస్తారు. యువకులు హోళి సందర్భంగా 'దండామారేర్' కర్రలను యువతులు రాక్షసుణ్ణి దహనం చేసి మంటల్లో వేస్తారు. అదే సమయంలో గోనె సంచుల్ని దుప్పటిగా కప్పుకొని యువకులు ఆ కోలాట కర్రల్ని కాలకుండా కాపాడుతారు. ఇది వీళ్ల ధైర్యసాహస సామర్ధ్యాలను వ్యక్తం చేస్తుంది.

బృందావనంలో రాసక్రీడల్లో శ్రీకృష్ణుడు గోపికలపై పలు రంగుల కుసుమాలు విరజిమ్మితే, గోపికలు ప్రేమాస్పదంగా గోపాలుడిపై నీటిని చిలకరించారని, మధుర మనోజ్ఞ వేడుకగా ఈ సంబరం విలసిల్లిందని భాగవతం హృద్యంగా వర్ణించింది. అందుకే ఉత్తర భారతాన ఈ పండుగను 'డొలా' జాతరగా జరుపు కుంటారు. రాధకృష్ణుల మూర్తుల్ని ఊయలలో ఉంచి పూజిస్తారు. ఫాల్గుణ శుద్ధ అష్టమి నుంచి పౌర్ణమి వరకు ఉండే ఎనిమిది రోజుల్ని 'హోలాష్టకం' అంటారు. ఈ తీధుల్లో నవ గ్రహాల్ని పూజించే సంప్రదాయం ఉంది. గ్రహశాంతి పొందాక, వ్యక్తులు సహజ ఉల్లాసంతో ఉన్న పున్నమినడు రంగులు విరజిమ్ముకుని, హోలిని వేడుకగా జరుపుకుంటారు. మోదుగ వృక్షానికి ఆకులు రాలిన అనంతరం పూచే మోదుగ పూలను ఆరబెట్టి, ఆరిన పూలను పొడిగా చేసి అందులో నీళ్ల మిళితం కావించి రంగులు తయారుచేసుకొనే వారు. మోదుగపూల రంగు ప్రకృతిసిద్ధమైందే కనుక ఈ రంగులు ఆరోగ్యానికి హానికరం కావు. ఇలాంటి రంగులతోనే శ్రీకృష్ణుడు, గోపికలు హోలిని జరుపుకొన్నారని చెబుతారు.

ఫాల్గుణ, చైత్ర మాసాల సంధికాలంలో పరిసరాలన్ని మానవ హృదయాలను మదనునికి అంకితం చేస్తాయి. రుతురాజైన సూర్యుడు కొత్త పెళ్లికొడుకుకై భూమి పైని అందాల ప్రకృతి కాంతను పెళ్లికూతురుగా చూడాలని ధరణికి మరీ దగ్గర కావడం ప్రారంభిస్తాడు. ఫాల్గుణ మాసంలోని పూర్ణిమ నాటికల్లా భారతదేశంలోని ప్రకృతి నిండు జవ్వనిగా రూపుదాలుస్తుంది. సహజంగానే ఈ కాలంలో మనుషుల మనుసులు రాగరంజితాలవుతాయి. కోరికలు గుర్రాలై పరుగులు తీస్తుంటాయి. అరి షడ్వర్గాల్లోని కామం మానవ శరీరాలను దహింపజేస్తూ ఫాల్గుణ మాసం పూర్ణిమ చంద్రుని కోసం ఎదురు చూస్తున్న కలువల రాణిని ఆహ్వానిస్తుంటుంది. ఆమని అంకురిస్తుంది.

వసంత కాలాన్ని రుతువుల రాణి అంటారు. వసంతం తన అందాలను ఆర్ధవం చేస్తూ మానవులను ప్రభావితం చేస్తుంది. వాసంతం అసాంతం అందచందాలతో అల రారడం పరిధులు దాటిన కోరికలు వెర్రితలలు వేసే ప్రమాదం ఉంటుంది. ఈ మితిమీరిన కామాన్ని దహింప జేసుకొని సమాజాన్ని ప్రశాంతంగా ఉంచి, ఆరోగ్యానికి మేలు చేకూర్చే విధంగా మసలుకోవాలన్నదే కామదహనం (హోలిమార్ధం. ప్రకృతిపరంగా మానవుల్లో కలిగే శారీరక మార్పులను అనుసరించే పూర్వీకులు మాఘమాసం నుంచి చైత్రమాసం వరకూ వివాహాలు జరపాలని నిశ్చ యించారు. వధూవరులు అనుకూల దాంపత్యం కొన సాగించడానికి ఈ కాలం అనువైనదని పూర్వీకులు భావిం చారు.

తెలుగువారు కాముని పున్నమిగా వ్యవహరించే ఈ ఉత్సవాన్ని తమిళులు 'కామక్ పండగై8 అని, కన్నడ ప్రాంతంలో 'కామనహబ్బ' అని వ్యవహరిస్తారు. ఫాల్గుణ పూర్ణిమనాడు మోదుగపూలతో సిద్ధం చేసిన రంగులు పిచికారీలతో జల్లుకోవడం, బుక్కా జల్లుకోవడం వినోదంగా వాత్స్యాయనుడు పేర్కొన్నాడు. శ్రీహర్షుడు రత్నావళి నాటకంలో ఈ ఫాల్గుణోత్సవాన్ని వర్ణించాడు.

కాముని పున్నమినాడు తెలంగాణ గ్రామాల్లో పశు వుల కాపరులు వారిలో ఒకరిని ఎలుగుబంటి వేషం వేసి నడుముకు గంటలు కట్టి ఇళ్లముందు ఆడిస్తూ, పాటలు పాడుకుంటూ భిక్షాటన చేసే ఆచారం ఉండేదని తెలుస్తోంది. ఈ ఉత్సవంలో జాజర పాటలు పాడేవారు.

కుమారగిరిరెడ్డి పాలన కాలంలో కొండవీడులో వసంతోత్సవం వైభవంగా జరిగేదని - రాజు కస్తూరి, పులుగు, జవ్వాజి, కర్పూర ఖండాలను పంచేవాడని, అందుకే ఆయనకు 'కర్పూర వసంతరాయాలు' అనే బిరుదు వచ్చిందని అనపర్తి శాసనం చెబుతోంది.

మన దేశంలో ఈ 'హోలి' పర్వంలోని విలక్షణ స్వభావం, సంప్రదాయం ఐరోపా దేశాల్లో కూడా వసంత, గ్రీష్మ రుతువుల్లో కనిపించడం విశేషం. ఇంగ్లండులో 'ఏప్రిల్ ఫూల్' అనే వేడుక ఉంది. ఇటలీలో 'రేడికా' ఉత్సవం, రోమ్ నగరంలోని 'లూపరకేలియా' పండుగ ఇటువంటివే, పోర్చుగల్‌లోని 'పెంటా' పండుగకూడా రంగులు జల్లుకునే ఉత్సవమే. గ్రీసు, ఇటలీలో 'ఫ్లొరేలియా' పేరుతో జరిగే పుష్పోత్సవంలోనూ మన 'హోలీ' ఛాయలు కనిపిస్తాయి.

తెలంగాణ ప్రాంతంలో 'హోళి రంగ హోళి' అంటూ, 'ఉంగరాల జుట్టు మీద హోళి' అంటూ పాడుకుంటూ రంగులు చల్లుకుంటూ. వైదికపరమైన పౌరాణిక ప్రాముఖ్యం గల పర్వాలకు భిన్నంగా లౌకికమైన ఈ ఉత్సవం ప్రజల ఉత్సాహానికి, ఉల్లాసానికి ప్రతీక.

లంబాడాలు జరుపుకునే హోళి పండుగ ఇతరుల కంటే భిన్నంగా జరుపుకుంటారని చెప్పవచ్చు. ఫాల్గుణ మాస చంద్రదర్శనం మొదలుకొని పౌర్ణమి వరకు దీన్నే లంబాడాలు 'హోళిర్బాగ్' అని అంటారు. అనగా చంద్రుడు మొదటిరోజు కన్పించునప్పటినుండి పౌర్ణమి వరకు పదిహేను రోజుల వెన్నెల రాత్రిని వీరు రంగరంగ వైభవంగా జరుపుకుంటారు.

తాపి ధర్మారావు గారు 'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు' అనే గ్రంథంలో ఇలా అంటారు. 'నలుగురు ఒకచో చేరాలంటే ఒక వేదిక కావాలి. ఆ సందర్భానికి సంబంధించిన ఒక పండుగో, పబ్బమ, ఉత్సవమో అయితే కాని ఆ ఉత్సవం రక్తి కట్టదు. ఉత్సవాలలో ఉండేదంతా బూతే అదేవిధంగా లంబాదాల పెద్దల నోటి నుండి అనేక విధాల అశ్లీల మాటలు చోటు చేసుకోగ యువతీ యువకులు నోటి నుండి వెలువడే బూతులతో కూడిన కాముని గేయాలను శృతిమించుతాయి. ఈ పండుగలో ఆటకు, పాటకు సమ ప్రాధాన్యాన్నిస్తూ వలయాకారంగా లయానుగుణంగా ఉల్లాసంతో అడుగులో అడుగువేస్తూ చేసే దృశ్యం కనువిందు చేస్తాయి.

'దండమారేర్' అంటే కోలాటం ఆట, యువకులు మూరెడు బిటకు కర్రలను చెక్కికోలగా తయారు చేస్తారు. కోలాటం వేసే వాళ్లు ఒక్కో కోలకుండా చేతితో పట్టుకొని వలయాకారంగా పాటకు అనుగుణంగా తాళం, పల్లవి, పాదాలు కలుపుతూ గంతులు వేస్తూ కోలాటం వేస్తుం

టారు. కొందరు కాళ్లకు గజ్జెలు కూడా ధరిస్తారు. మరోవైపు నగారా వాయిస్తుంటే స్త్రీలు, యువతులు కూడా గేయాలు పాడుతూ వలయాకారంగా నృత్యం చేస్తూ అందులో లీనమవుతారు.

హోళీ పండుగ గేయాల్లో, పన్యాసాల్లోవభావాల్లో, నృత్య విన్యాసాల్లో, మాటల తీరులో ఎక్కడ విన్నా ! పచ్చి శృంగార రసం పరవళ్లు తొక్కుతూ పండుతుంది. లంబాడాల స్త్రీ పురుషుల నోటి నుండి అలవోకగా కామోద్రేకాన్ని రెచ్చగొట్టే మాటల్లో, పాటల్లో బూతుల భావన పాట వరకే పరిమితం కాని ! ఆచరణలో ఉండదంటారు. ఈ కార్యక్రమాలన్ని తండా నాకుని కనుసన్నల్లో అతని అనుమతితోనే జరుగుతాయి. వీరి ఇంటిముందు విశాలమైన ప్రాంగణమే వేదికగా చెప్పవచ్చు. ఇదంతా ఆచారాల్లోని భాగాలే కాని వేరు కాదు.

ఈ పండుగ సందర్భంగా యువతీ యువకుల నూతన వధూవరుల జంటలకు నాందియని చెప్పవచ్చు. పూర్వం కామవాంఛలు జనించడానికి ఇవి వేదికలుగా పని చేశాయని తెలుస్తోంది. జనాభా పెరుగుదలకు పలు కార్యక్రమాలను చేపట్టేవారు. స్త్రీ, పురుషుల సంగమాన్ని పవిత్రకార్యంగా భావించి దేవాలయాలే పడక గదులుగా మారేవి. దేవుని సమక్షంలో అది పవిత్ర కార్యంగా భావించేవారు.

'పూర్వం గ్రామ దేవతల ఉత్సవాలలో వేషాలు వేసేవాళ్లు మాట్లాడే మాటలు పూర్తిగా బూతుతో కూడుకొని ఉండేవి. ఒకడు ఒక రోలును నడుముకు కట్టుకొని రోకటితో దంచుతూ అరచిన అరుపులకి మరి ఎక్కడైనా అర్థముంటుందా? రంగులరాట్నం దగ్గర మహావేశంతో స్త్రీ పురుషులు కూసే కూతలకి ఈ దినాలలో ఏమి వ్యాఖ్యానం చేస్తాం. ఇవన్ని ఎవరో చేసినవి కావు. అనాది నుండి వస్తున్న ఆచారాలు ఇప్పుడు మాత్రం అవి దురాచారాలుగా మిగిలాయి'.

హోళి పండుగలో వివిధ రంగులు చల్లుకోవడం ఓ భాగం వదినలు, మరదులు మొదలైన వరుస అయిన వాళ్లు ఒకరినొకరు బూతులతో, బూతు గేయాలతో గెరియా - గెరణి నృత్యం చేస్తూ రంగులు చల్లుకుంటూ ఆనంద కేళితో మునిగి తేలుతారు. ఎటువిన్నా చూసిన శృంగార రస ప్రాధాన్యమే తాండవిస్తుంది.

**ముగింపు :**

మామిడిపూత, శ్రీ చందనాన్ని కలిపి హోలినాడు స్వీకరించడం వల్ల రాబోయే వేసవిని తట్టుకోగల శక్తిని పొందవచ్చని ఆయుర్వేదం వివరిస్తోంది. పసుపు కలిపిన చందనం, అష్టగంధం, సర్వౌషధ జలం, ప్రాకృతిక వృక్ష మూలాల రసం, మోదుగ పుష్పాల గుజ్జ కలిపిన జలాల్ని హోలి రంగులుగా వినియోగించాలని ధర్మశాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి. పర్యావరణ హితకరంగా హోలి నిర్వహిస్తే శరీరానికి, మనసుకు ఆహ్లాదం చేకూరుతుంది. పండుగ పరమార్థం నెరవేరుతుంది. వ్యక్తుల మధ్య సమైక్యతకు, సామరస్యానికి, అనుబంధానికి ప్రతీక.. హోలి వేడుక. దోష గుణాల్ని, దుష్ట ఆలోచనల్ని దహింపజేసుకోవాలి. సమిష్టిగా ప్రేమైక జీవన సౌందర్యాన్ని ఆస్వాదించాలి. ఇదే రంగుల కేళి హోలి అందించే సామాజిక సందేశం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. డా॥. ఆర్వీ.యస్. సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, పుట : 309.
2. డా॥. జనపాల శంకరయ్య, తెలుగు లంబాడీల గేయ సాహిత్యం, పుట : 164.
3. బి. చీనియానాయక్, బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి, పుట : 216.
4. నూన్సావత్ జీవలా నాయక్, బంజారా వంశావళి, పుట : 67, 68.
5. తాపి ధర్మారావు, దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు, పుట : 55, 57.

❖❖❖

# బి.ఎస్ రాములు చూపు నవల - సామాజిక అంశాలు

**– రాజు మోరె,** పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్

పరిచయం : ప్రతి వ్యక్తికి ఆశలు, కలలు ఉండడం సహజం. వాటిని నెరవేర్చుకోవడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. తన జీవిత ప్రయాణంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ముందుకు సాగిపోతాడు. ఒక్కొక్కసారి ఓడిపోతే మరొకసారి గెలిస్తాడు. ఒక్కో వ్యక్తికి ఒక్కో రకమైన అభిరుచి, అలవాటు ఉంటుం. సమాజంలోని వ్యక్తుల వ్యక్తిత్వాన్ని రచయితలు తమ పాత్రల ద్వారా చూపించడం జరుగుతుం.

బి.ఎస్ రాములు తన చూపు నవలలు చూపించిన సామాజిక అంశాలు ఎంతోమంకి మార్గదర్శకత్వం చూపడమే కాదు నిజాని మనకన్న ముందు చూపించి నట్టుగా అనిపిస్తుం. నవల చదివే క్దొ ప్రతి పాత్ర మనల్ని చూపించినట్టుగా మన చుట్టూ ఉన్న వాళ్ళ స్వభావాన్ని తెలిపినట్టుగా అనిపిస్తుం. ఎవరు చూడలేనటువంటి దాన్ని కొత్త కోణంలో ఆలోచించి చూపించి మానవ నైజం, జీవిత సత్యాన్ని ఈ నవలలో చూపించారు. మానవ సంబంధాలు నేడు కనుమరుగై పోతున్నాయి. రక్తసంబంధాలు రక్తాన్ని పీల్చే జలగలుగా మారుతున్నాయి. డబ్బు డబ్బు ఎక్కడ చూసినా ఇది తప్ప ఇంకేమీ కనిపించడం లేదు దీనికోసం ఎంత దూరమైన ఏది చేయడానికైనా మనిషి వెనకాలేడు. ఇలాంటి అనేక అంశాలని మనం చూడవచ్చు. అన్న, చెల్లి, అక్క, తమ్ముడు పుట్టుకతో మనకు ఏర్పడే బంధాలు. కానీ మన జీవితంలో ఎంతోమంది వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు. కొంతమంతో స్నేహం చివరి వరకు కొనసాగుతుం. ఎంతోమంది రచయితలు స్నేహం యొక్క గొప్పతనాన్ని కథల ద్వారా చూపించినప్పటికీ ఈ నవల చెరగని ముద్ర వేసింది.

సామాజిక విశ్లేషకులుగా, బి.ఎస్. రాములు సమాజ "హితం" కోరే విధంగానే ఎన్నో రచనల్ని జాలువారించి, పరిమళాల్ని వెదజల్లారు. ఒక సామాజిక వర్గాన్నే కాకుండా అనేకానేకమైన సామాజిక వర్గాలను తాను, చూసినవి, విన్నవి, పాత్రలుగా మలిచి సమాజంలోని సమస్యలు ఏమిటి? తన రచనల ద్వారా ఇంకా ఎలాంటి చైతన్యం ప్రజల్లో కలిగిచాలనే నూతనమైన ఆలోచనలతో ఇప్పుడున్న యువతకు ఏం నిర్దేశం చేయాలి ? అనే భావనతో "చూపు" నవలను తన "లో చూపు"తో రచించారు, "మానవుడు సమాజంలో నివసిస్తాడు. ఇతరులతో సంబంధాలు ఏర్పర్చుకుంటాడు. ఆ సంబంధాలను అధ్యయనం చేయడమే "సమాజశాస్త్రం చేసే పని" ఈ సమాజ శాస్త్రం ఒక విధంగా "ప్లేటో" తో ప్రారంభమై సమాజ శాస్త్ర పిత అయిన ఆగస్ట్ కోములో వేగం పుంజుకుని, స్పెన్సర్, వార్డ్ డర్క్ హైమ్ల చేతుల్లో నిర్థిష్ట రూపాన్ని సంతరించుకుని, పారిశ్రామిక, ప్రెంచి విప్లవాలతో ప్రభావితమై పందొమ్మిదో శతాబ్దికి ఆది ఒక ప్రత్యేక నిర్దిష్ట శాస్త్రంగా ఆవిర్భవించింది."సమాజ శాస్త్రం సమాజాన్ని అధ్యాయనం చేస్తుంది. కాని సమాజం అంటే "మానవరాశి" కాదు. వారి మధ్య సంబంధాలు. ఆ సంబంధాల అల్లిక సమాజం. అటువంటి సమాజాన్ని అధ్యయనం చేసేదే సమాజశాస్త్రం."చూపు" నవల వివిధ సామాజిక వర్గాలకు చెంన వ్యక్తుల మధ్య చిగురించిన స్నేహం ఏవిధంగా స్నేహితులుగా, బంధువులుగా మారారు. తర్వాత వారి పిల్లల స్నేహాలు, ప్రేమలు ఏ విధంగా మలుపు తిరిగాయి మరియు సమాజంలో స్త్రీ యొక్క ప్రాధాన్యత, పురుష ప్రవర్తన ఏవిధంగా ఉంటుందనే అంశాలు చిత్రించబడ్డాయి. సమాజంలో పేదవాడు ఉన్నతంగా గౌరవించబడాలంటే చదువే మార్గం అని ప్రన్సిపాల్ రామచంద్రయ్య, ఎం.బి.ఏ. సుధాకర్ లాంటి పాత్రలు కన్పిస్తాయి. ఆర్థిక స్థితిగతులు బాగా ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఉద్యోగంతో పాటుగా,

అదనపు ఆదాయాన్ని ఎలా ఆర్జించాలి అనే ఆలోచనలతో ఎం.ఈ.ఓ. సత్తయ్య, ఆర్.డి.ఓ. వెంకటేశం పాత్రలు కన్పిస్తాయి. ఇంకా ఆర్థికంగా స్థిరత్వం గల కుటుంబాలు చదువుకంటే వ్యాపారం ఉత్తమమని కాంట్రాక్టర్ భాస్కర్, రత్నాకర్ పాత్రలు కన్పిస్తాయి.

"ధనం మూలం ఇదం జగత్" అన్నట్లుగా ప్రతిదానికి సమాజానికి డబ్బు ముడిపడి ఉంటుంది. సమాజంలో గౌరవ ప్రతిష్టలు కావాలంటే మంచితనం ఒక్కటే సరిపోదు దానికి తోడు డబ్బు కూడా కావాలని నవలలోని ప్రతిపాత్ర తనకు తానే ఆదర్శంగా సమాజానికి ఎంతగానో ఉప యోగపడే విధంగా రచయిత తీర్చిదిద్దాడు. ఇందులో 3 తరాలకు చెంన వ్యక్తుల జీవన విధానాన్ని ఇతివృత్తంగా మలిచాడు. మొదటి తరానికి చెందిన వ్యక్తులు పరిపక్వత చెందిన పెద్దలుగా, వారి భార్యలు ఆదర్శమైన స్త్రీమూర్తు లుగా, వారి పిల్లలు తల్లిదండ్రులకంటే గొప్ప స్నేహితు లుగా, కుటుంబ గౌరవాన్ని కాపాడ్డానికి వారి ప్రేమలను సైతం తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలురుగా విద్యార్థులు అనుకున్న సాధించే ఆశయ కిరణాల్లాగా సమాజంలో కనిపిస్తాయి. యుక్త వయస్సు వారి నుండి షష్ఠి పూర్తి వయస్సు వారికి ఈ నవలలోని పాత్రలు అన్ని సమాజంలోని వ్యక్తులకు, తమని తాము ఒక్కసారి చూసుకున్నట్లుగా ఉంటుంది. అందరికి కూడా ప్రవర్తన నియమావళిని సరిదిద్దుకోవాలి అన్నట్లుగా ఉంటుంది. నవలలో సాంఘిక జీవనంలో కుటుంబ నేపథ్యాన్ని గమనిస్తే కుటుంబాల రీత్యా ఆర్థిక అంతరాలు, సామాజిక అంతరాలు ఉన్నప్పటికిని స్నేహం అంటే ఈ విధంగా ఉండాలి అనిపిస్తుంది.

సామాజిక వర్గ తారతమ్యాలతో స్నేహం ఎక్కడకూడా ఛిన్నాభిన్నం కాలేదు. ఉద్యోగాలలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ కుటుంబ స్నేహంలో తారతమ్యం ఈ స్నేహితులు అస్సలే చూపలేదు. కుటుంబంలో తండ్రి పాత్ర ఎంత ప్రధానమైనదో, తండ్రి పిల్లల్ని మార్గదర్శ కత్వంలో ఎలా పెట్టాలో, సమాజంలో కుటుంబ జీవనానికి తండ్రి ప్రాధాన్యత తెలిపినది ఈ తండ్రి యొక్క నడవడి సరిగా లేకుంటే పిల్లల జీవితాలు కూడా ఎంత సంపాదన ఉన్నా కూడా అతలాకుతలం ఔతాయని కాంట్రాక్టర్ భాస్కర్ పాత్ర ద్వారా రచయిత సమాజానికి తెలియ జేశారు. పేదరికంతో ఉండి చదువే పెట్టుబడిగా, డిగ్రీతో పాటుగా ఉద్యోగాలను కూడా పెంచుకుంటూ తన లాగే తన పిల్లలు కూడా ఆదర్శవంతంగా సమాజంలో నిలదొక్కుకోవాలని ఉన్నతంగా ఎదిగినా కూడా సమయం, డబ్బు, విలువ నేర్పిన రామచంద్రయ్య పాత్ర నేటి సమాజానికి చాలా ఉపయోగపడుతుంది. ఆర్.డి.ఓ. వెంకటేశం లాంటి పాత్రలు యువకుల్ని ఎంతగానో చైతన్య పరిచే విధంగా ఉంటాయి. ఒకనొక సందర్భాలలో తన తండ్రి ఉద్యోగాన్ని తనకు ఇప్పించాలని ప్రాధేయపడి ఒక యువకుడు వంగి కాళ్ళు మొక్కుతున్న సమయంలో వెంకటేశం మాటల్లో యువకులు మీ మీహక్కులకై పోరాడా. ఎవరికి వంగి దండం పెట్టకూడదు. రాబోయే సమసమాజ నిర్మాతలు మీరే, మిమ్ము మీరు తక్కువ చేసుకోవద్దు, ఆత్మగౌరవంతో బ్రతకాలి నీ తండ్రి ఉద్యో గాన్ని నువ్వు పొందడం నీ హక్కు అని సామాజిక హక్కును గూర్చి నేటి యువతకు గుర్తుచేస్తాడు. కాని తండ్రిగా తన కొడుకు దయాకర్ ప్రవర్తనలో మార్పు తీసుకురాలేక పోతాడు. దయాకర్ తండ్రికి ఉద్యోగం ఉందని గర్వంతో, అహంకార ధోరణితో జీవితాన్ని చాలా తేలికగా తీసుకొని చపలచిత్తమనస్తత్వంతో కాలాన్ని వృదా చేసుకొని స్థిరత్వం లేక కాలయాపన చేస్తాడు. దయాకర్ లాంటి పాత్ర స్వభావం ఉన్న యువకులకు ఇదొక మంచి పాఠంగా సమాజంలోని యువకులకు రచయిత కనువిప్పు గొల్పుతాడు.

ఎం.ఈ.ఓ. సత్తయ్య "స్నేహమేరా జీవితం స్నేహమేర శాశ్వతం" అనే విధంగా స్నేహం యొక్క గొప్పదనాన్ని వివరించే విధంగా ఉంటాడు. ప్రొఫెసర్ లక్ష్మీపతి ఉన్నతమైన ఉద్యోగం చేస్తూ, ఉస్మానియా విశ్వవిద్యా

లయంలో విద్యార్థులకు ప్రాంతీయ అసమానతలుఇ తెలంగాణ వెనుకబాటుతనం, ఆంధ్రదోపిడి గురించి, ప్రాంతీయ హక్కుల గురించి, విద్యార్థులకు వివరిస్తారు. ఆ సమయంలోనే లక్ష్మీపతి దగ్గర అరుణ్ అనే విద్యార్థి రిసెర్చ్ స్కాలర్గా ఉంటాడు. అరుణ్ యొక్క కుటుంబ నేపథ్యాన్ని గమనిస్తే నాటి తెలంగాణాలో వ్యవసాయ దారుల కుటుంబం కళ్ళకు కట్టినట్టుగా కన్పిస్తుంది. అరుణ్ తండ్రి వ్యవసాయంలో భాగంగా బోర్ బావులు వేసి అప్పులపాలై తండ్రి మరణిస్తాడు. చాలీచాలని తలి సంపాదనతో పి.హెచ్.డి. చేస్తుంటాడు. అరుణ్ కి ఒక చెల్లి తులసి బావ సురేందర్, దుబాయి వెళ్తాడు, మరణిస్తాడు. తెలంగాణ ప్రాంతంలోని వలస జీవన విధానాన్ని సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన అరుణ్ లాంటి విద్యార్థి జీవితాలను వారిని వారు నెమరు వేసుకున్నట్లుగా ఉంటుంది.సామాజికంగా కుటుంబ జీవనంలో స్త్రీ మూర్తులను గమనించినట్లైతే ఈ పాత్రలన్ని కూడా ఎంతో మంది స్త్రీలకు ప్రతిపాత్ర స్వభావం చైతన్యం కొలిపే విధంగానే ఉంటుం. "కార్యేషుదాసి, కరణేషు మంత్రి", అనే నానుడి ఊరికనే పోలేదు. ప్రిన్సిపాల్ రామచంద్రయ్య భార్య మాధవి సమాజంలోని ఒక ఉత్తమ ఇల్లాలుగా కన్పిస్తుంది . పిల్లలకు, భర్తకు సేవ చేయడంలో దాసి లాగా, భర్తకు బాధ్యతను గుర్తు చేయడంలో కార్యార్థిలాగా కన్పిస్తుం. అంత గొప్ప ఇల్లాలు కనుకనే రామచంద్రయ్య ప్రాథమిక పాఠశాల ఉపా ధ్యాయుని నుండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్గా ఎగాడు అంటే ఎంతగొప్ప ఇల్లాలో మనం గమనించవచ్చు. కాంట్రాక్టర్ భాస్కర్ భార్య సుజాత పాత్రరెండవ భార్య పార్వతి పాత్రలు సమాజంలో ఎంతో శోచనీయంగా కన్పిస్తాయి. భర్త పరాయి స్త్రీ (పార్వతి)తో ఉంటున్నాడని తెలిసి కూడా "ఇంటి గుట్టు రట్టు" అవుతుందని నోటిలో నాలుక బయటికి రానివ్వదు. అంతే కాకుండా పిల్లలకి తెలిస్తే పరువు పోతుందని తనలోతానే బాధపడుతుంది. అదే విధంగా రెండవ భార్య పార్వతికి భర్త ఉన్నా కూడా అధికారికంగా లేనట్టే. ఇటువంటి స్త్రీలు ఎంతో మం వేదనాభరితమైన జీవితాన్ని గడిస్తున్నారు. ఇలా భాస్కర్ లాంటి తొందరపాటు వల్ల సమాజంలో స్త్రీలు అణచి వేతకు గురౌతున్నారు. అని తెలిపే రచయిత పాత్ర చిత్రణ ఇప్పుడున్న సింగిల్ మదర్ పేరెంట్సి కన్నీటి సంద్రంలో ముంచెత్తక తప్పదు. సమాజంలోని భాస్కర్ లాంటి పురుషపాత్రలకు వంటింటిలో గృహిణీలు ఎంతో వేదనకు గురౌతున్నారు.

"సాంఘిక అవస్థకు స్పంంచి అభ్యుదయ కవితలు రాసిన మరొక కవయిత్రి వాణీ రంగారావు, "వెలుగు నగరం" మొదలైన కవితా సంపుటాల ద్వారా స్వేచ్ఛను కోరుకుంటుందని తెలుస్తుంది.

హృదయారణ్యాల మారుమూల అగ్నిలోంచి
ఎగసివస్తున్న జ్వాలల మధ్యనించి
పునీతులై పయనిస్తున్న స్త్రీమూర్తుల
చేలాంచలాలనుండి కరుణ పవనాలు
స్నిగ్ధహృదయం నిండా ప్రేమామృతాన్ని నింపుకొని
ప్రగతి కాలకూటాన్ని జీర్ణించుకునే" అని గరళకంఠగా
స్త్రీని వర్ణించారో.

రామచంద్రయ్య మానస చదువు విషయంలో లింగ వివక్షత చూపినట్లుగా కన్పిస్తుంది. కొడుకు మనోజ్ను హైదరాబాద్ కోచింగ్ పంపిస్తాడు. రెండవ కొడుకు మనోహరుని ఢిల్లీకి కోచింగ్ పంపిస్తాడు. మానసను మాత్రం ఎం...ఎస్. లాంగ్ టర్మ్ కోచింగ్ పంపించడు. అమ్మాయిల చదువు విషయంలో అబ్బాయిలతో సమానంగా చూడాలన్ని విషయాన్ని రచయిత రామ చంద్రయ్య పాత్ర ద్వారా గుర్తుచేశారు. అబ్బాయిలకు ఉండే పూర్తి స్వేచ్ఛా అమ్మాయిలకు ఉండదని మానస పాత్ర తెలుపుతుంది. జయ విషయానికి వస్తే నేటి యువతీ, యువకుల్లో "ప్రేమ" అనే అంశం అత్యంత ప్రాధాన్యత పోషించడం సహజమే. 'జయ' మనోజ్ను ప్రేమిస్తుంది. కాని సమాజంలోని ఆర్థిక, సామాజిక

కారణాల మూలంగా వారి ప్రేమ విఫలమౌతుంది. దీనికి గల ప్రధాన కారణం "జయ" ఉన్నతమైన సామాజిక, ఆర్థిక వర్గానికి చెందడమే. "మనోజ్ మన ప్రేమ అమరం జీవితమంతా మన ప్రేమను హృదయంలో పదిలంగా దాచుకుందాం మానసతో సహా ప్రపంచంలో మూడోవ్యక్తికి మన ప్రేమను గురించి తెలియకూడదు. మనం ఇక విడిపోక తప్పదంటూ భయంగా మనోజ్ భుజాలపై చేతులు వేసి దగ్గరకు తీసుకుంది. వీరిపురు ప్రేమ విఫలం కావడానికి జయతండ్రి భాస్కర్ వేసిన ఎత్తుగడ కారణం. "జయ"ను భాస్కర్ తన కంటే ఉన్నతమైన కుటుంబానికి ఇవ్వాలని అనుకున్నాడు.ని'జయ, మనోజ్,'ల ప్రేమ విషయంలో రచయిత పాటించిన విధానం యువతను మేల్కోలుపుతుంది. యువతను సన్మార్గంలో పెట్టాలనే రచయిత సదుద్దేశ్యంతో ప్రేమలు విఫలం అయితే జీవితం పూర్తైనట్టు కాదు, ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే కాని ప్రేమే జీవితం కాదని. ప్రేమలు విఫలమై ఆత్మహత్యలు చేసుకునే ఎంతోమం యువతకు జయ, మనోజ్ పాత్రల ద్వారా మార్గదర్శకత్వం నేర్పించాడు. ఇక్కడ జయతో ప్రేమ విఫలమైన మనోజ్ జయ భర్త రత్నాకర్ కన్న గొప్పగా బ్రతకాలని నిర్ణయించుకున్నాడు. జయ తల్లిదండ్రులకు తాను కూడా గొప్ప కాంట్రాక్టర్గా ఎదిగా సమాజం దృష్టి తన వైపు మల్లించుకున్నాడు.

ఈ విధంగా యువత ప్రేమకు దూరమైతే మంచి మార్గాన్ని ఎంచుకుని జీవితంలో స్థిరత్వం పొందాలి అని రచయిత తెలిపాడు.జయ వివాహం రత్నాకర్తో జరుగు తుంది. రత్నాకర్ జయ తండ్రిలాగా సినిమాలు, బిజినెస్, పరాయి కాంతతో తిరగుతూ బిజినెస్ లో ఇదంతా మామూలే మీ నాన్న  ఇలానే చేశారు కదా అంటారు. ఇలాంటివి చూసి చూడనట్లుగా గుట్టుచప్పుడు కాకుండా ఉండాల్సిందేనని హెచ్చరిస్తాడు. కుటుంబంలో స్త్రీ ఎదురు ప్రశ్నలు వేయనంత వరకు పురుషులు ఎంతగానో స్త్రీని పొగడుతూ దేవతవని ఆకాశానికి ఎత్తుతారు. ఎప్పుడైతే స్త్రీ తనకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపుతుందో ఆ దేవత కాస్త దెయ్యంలాగా కన్పిస్తుంది. "జయ" భర్త రత్నాకర్ మాటలకు కోపోద్రిక్తురాలై

"నేనుబొమ్మను కాదు
నువ్వు రంగులు పులిమితే నవ్వడానికి
నేను బొమ్మను కాదు
నువ్వు విసిరేస్తే పగిలిపోవడానికి
బొమ్మలా నిశ్చలంగా ఉండడానికి
నీ కుంచెలోంచి జాలువారలేదు

నీవు ఉండమన్నట్లు ఉండడానికి, రంగులు పులిమి తేవ్వడానికి, నర్తించమంటే నాట్యమాడడానికి, విసిరేస్తె పగిలిపోవడానికి, వదిలేస్తే విడిపోవడానికి, అగ్నివర్షం కురిపిస్తే కాలిపోవడానికి, కీ ఇస్తే నడవడానికి నేను మరబొమ్మను కాను, నీ కుంచెలోంచి జారిన కాన్వాసును కాను, జడపదార్థం అసలే కాను, నిత్యచైతన్య స్రవంతిని. ఆ విషయాన్ని గుర్తెరిగుతే నీకు శాంతి, మనశ్శాంతి, ప్రశాంతి, లేదా తాండవం విలయ తాండవం, ప్రళయ తాండవం అని గర్జిస్తుంది." రత్నాకర్తో విడాకులు తీసుకోవాలని నిశ్చయించుకోవడం సమాజంలో భర్తలేని భార్యను గురించి అనేక వాదోపవాదాలు మాట్లాడడం జరుగుతుంది.

సరైన ప్రవర్తన లేని భర్త నుండి భార్య విడాకులు తీసుకోవడమే ఉత్తమమైన మార్గం అని రచయిత ఉద్దేశించారు. సమాజంలోని ఇలాంటి స్త్రీలకు ఉప దేశించారు. జయ సింగింల్ పేరెంట్గా ఉంటూ స్త్రీ "అబల కాదు సబల" అని తెలిసే విధంగా మంచి వ్యాపారవేత్తగా ఎదిగి ఎంతో మంకి ఉపాధి కల్పన ఇస్తుంది. "జయ" పెళ్ళి విషయంలో భాస్కర్ ఎంతో తప్పు చేశానని పశ్చాత్తాపడతాడు. "జయ" జీవితాన్ని చూస్తున్న మానస తన పెళ్ళి విషయంలో తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయం మంచిదేనని అనుకుంటుంది. మానస తన భర్త ఎం.బి.ఏ. సుధాకర్ కడు పేదవాడైనప్పటికి చదువే లక్ష్యంగా

పెట్టుకొని ఆర్.డి.ఓ. అవుతాడు. భర్త ఉద్యోగం నుండి తాను గౌరవ మర్యాదలు పొందుతుంది. సుధాకర్ తల్లిదండ్రులు చాలా బాగా చూసుకునేకోడలుగా మానస సమాజంలో గౌరవించబడుతుం.సమాజంలో తల్లి దండ్రుల పెంపకంలో పిల్లల భవిష్యత్తు ఉద్దేశించి పిల్లలు లక్ష్యానికి చేరుకోవాలనే ఆశలో ఉన్నతమైన చదువులు చదివిస్తూ  అమెరికా, ఆస్ట్రేలియా వివిధ దేశాలకు విలువైన జీవితం కొరకు ఎలా పంపిస్తున్నారో, చివరికి పదవి విరమణ తర్వాత రామచంద్రయ్య పిల్లలు కూడా గూడు విడిచిన పక్షుల్లాగా వారి పనుల్లో నిమగ్నమై ఇల్లు విడిచి వెళ్ళిపోయారు.

రామచంద్రయ్య, అతని భార్య మాధవి మాత్రమే. ప్రతి పండగకు వాళ్ళు వస్తారని ఎదురుచూపులు తప్పేవి కావు. అలా పెన్షన్తో జీవిస్తున్న రామచంద్రయ్య తన పింఛన్లో కొంత డబ్బును ఒక నిరుపేద అమ్మాయి చదువుకి ఇచ్చి చవిస్తూ తన చిన్ననాటి పేదరికాన్ని గుర్తు చేసుకున్నాడు. వృద్ధాప్యంలో పిల్లలకై ఎదురుచూసే తల్లిదండ్రుల ఆలోచనల్ని, ఆవేదనని, కనబరిచారు రచయిత అంతేకాకుండా వృద్ధాప్యంలో తమ పనులు తాము చేసుకోలేని స్థితిలో ఎస్.ఎస్. హాస్టల్ (సీనియర్ సిటిజన్ హస్టల్) అనే ప్రస్తావన తీసుకువచ్చారు.నిదీనికి గల కారణాలుగా సామాజిక జీవన విధానంలో భాగంగా ఉద్యోగాల రీత్యా, ఉన్నతమైన భవిష్యత్ రీత్యా తల్లి దండ్రులను విడిచి వివిధ ప్రాంతాలలో జీవిస్తున్న తమ సంతానం, అందుబాటులో లేక వృద్ధాప్యంలో తమ పనులు తాము చేసుకోక, ఈ మధ్య కాలంలో కొన్ని సామాజిక మాధ్యమాలలో చూస్తున్నట్లైతే పిల్లలకు భారంగా ఉండడం ఎందుకని వృద్ధాశ్రమాలకు వెళ్ళి పోతున్నారు. తల్లిదండ్రులు పిల్న భారం అనుకుంటే ఏంటి పరిస్థితి పిల్ల ఇంతవాళ్ళు అయ్యేవాళ్ళా వృద్ధాప్యంలో దూరం చేసుకునే పిల్లలకు తల్లిదండ్రుల మనోవేదన ఎలా ఉంటుందో రచయిత తెలియజేశాడు.

బాల్యం నుండి మొదలుకొని వృద్ధాప్యం వరకు మానవుని సామాజిక కోణాన్ని వివిధ వయస్సుల వారిగా నిశితంగా పరిశీలించినట్లుగా, జీవితంలో ఈ నవల చదివిన ప్రతి ఒక్కరు తమకు తాము ఏదో ఒక కోణంలో ఈ నవల వారి జీవితంలో ప్రతిబింబిస్తుంది. రచయిత సమాజపు “చూపు”ను తన లోచూపుతో ఆవిష్కరణ చేశాడు. సామాజిక తారతమ్యము అనే పనికిరాదని సమాజంలో తానొక సంఘజీవి అని, సమాజంలో రక రకాల మనుషులున్నప్పటి, జీవితాన్ని అన్నింటికి బ్యాలెన్స్ చేసుకొని జీవించాలని, జీవితంలో ఎంత డబ్బు ఉన్నా మంచితనం అనేది మనిషికి చాలా అవసరమని మనిషి ఔన్నత్యాన్ని సమాజమే నిర్ధారిస్తుందని ,మన ప్రవర్తన నియమావళిపై ఆధారపడుతుంది. సామాజిక కోణంలో చూపు నవలను రచయిత మనకు అందించారు.

**ముగింపు :**

స్నేహం మరిచిపోలేనిది మరపురాని. ఎంతమం రచయితలు స్నేహం గురించి కథలు పాటలు ద్వారా తెలియ చెప్పారు. ఈ లోకంలో ఎలాంటి సంబంధం లేకుండా జీవితాంతం ఉండే బంధం స్నేహం మాత్రమే. డబ్బు ఉండడం డబ్బు లేకపోవడం ఇవేవీ స్నేహానికి అడ్డు రావాలని ఈనవలలో చక్కగా చూపించారు. సందర్భానుసారంగా ఆనాటి కాలంలోని ఆంధ్రదోపిడి తెలంగాణ అస్తిత్వం కోల్పోవడం మొదలైన అంశాలను కూడా రచయిత చక్కగా ఇందులో చేర్చారు. భార్య భర్తల బంధం ఎలా ఉండాలి? ఎలా ఉంటే కుటుంబం ఆనందంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఇలాంటి కష్టాలు వచ్చినా భార్య ఇంటిగుట్టుని బయట పెట్టదు. భర్త మాత్రం దానికి భిన్నంగా ఉంటాడు ఇలాంటి వ్యత్యాసం  నవలలో కనిపిస్తుం. భర్త పరాయి వాళ్లతో ఉంటే భార్య కూడా తట్టుకోలేదు. కానీ సుమతి లాంటి పతివ్రతలు పుట్టిన ఈ లోకంలో భర్తను తన కోరుకున్న స్త్రీ దగ్గరికి పంపేవారు కూడా ఉన్నారు అనిపిస్తుం. తినండి విషయాలు ఎన్నో రాములు గారు విభిన్నమైన కోణాల్లో చూపించారు ఇలాంటి నవలలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయి.

ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. స్త్రీవాద కవిత్వం - ఆధునిక దృక్పథాలు, డాక్టర్ వేలూరి శ్రీదేవి, భూమిక శ్రీవారి పత్రిక, ఫిబ్రవరి2- 2018
2. స్వేచ్ఛ నుండి విముక్తి బిఎస్ రాములు
3. గెలుచుకున్న జీవితం బిఎస్ రాములు
4. చూపు నవల, బిఎస్ రాములు, విశాల సాహిత్య అకాడమీ, 2014.

❖❖❖

# నీలా జంగయ్య రచనల్లో- దృక్పథానుశీలనం

- చామండ్ల రాజు, పరిశోధక విద్యార్థి

నల్లగొండజిల్లా దేవరకొండ తాలూకాలోని ఇదంపల్లి గ్రామానికి చెందిన కవిరత్న నీలాజంగయ్య ప్రధానంగా సాహిత్యవేత్తగా పేరు గడించినప్పటికి సంఘసంస్కర్తగా సాంస్కృతికోద్దీపకులుగా కూడా గుర్తింపుపొందారు. తెలుగు సమాజంలో విశిష్ట వ్యక్తిత్వంగల మంచి మనిషిగా పండితుడుగా, కవిగా రచయితగా తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. ఈయన సుమారు 40పుస్తకాలు రాశారు. ఆయన సాహిత్యంలో పద్యం, గద&ం, గేయం, శతకం, వచనం వంటి ప్రక్రియలను స్పృశించారు. వివిధ వివిధ పుస్తకాలలకు రాసుకొన్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. ‘‘పూవుపుట్టగానే ఆనే పరిమళింస్తుంది అన్నట్లుగా చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడే ‘‘బాల గీతాంజలి అనే గ్రంథ రచనతో సాహితీ ప్రపంచంలో అడుగు పెట్టారు. అజ్మతుల్లా అనే ఉర్దూకవి పరిచయం వల్ల సాహిత్యం పట్ల మక్కువపెంచుకున్నారు. చిరు ప్రాయంలో మహాభారతం, రామాయణం, భాగవత కావ్యాల్ని చదివాడు. ఆయన రచనలపై పోతన, వేమనల ప్రభావం అమితంగా ఉంది. అందువల్లనే నీలాజంగయ్య మనకు మనవతా వాదిగా కనిపిస్తూ మానవునిలోని అభ్యుదయం పై పూర్తి విశ్వాసాన్ని ప్రకటిస్తారు.

అటు సంప్రదాయ మార్గంలోను ఇటు ఆధునిక పథం లోనూ కలాన్ని సంధించి సవ్యసాచిగా పేరు తెచ్చు కున్నారు. నేటి యువకవులకు తేజోమయ మార్గ దర్శకుడు, అసమాన్య సాహితీ కృషివలుడు ‘‘ఒకరి పొగడ్త లకు కాక నావిధి నేను నిర్వహిస్తాను. బ్రతుకు ముగిసిన విధి నిర్వాహణ ముగుస్తుంది. అందాక నా బ్రతుకులోనే కాక తన మార్గాన్ని తానే నిర్దేశించుకొని సాగిన పథగామి నీలాజంగయ్య, సంప్రదాయం అభ్యుదయం, ఆధ్యాత్మిక, తాత్వికత, భావుకతలకు నెలవైనవాడు.

వంశపారంపర్యంగా వచ్చిన వ్యాపార వృత్తిని ఇంటిని వదిలిలొక సంచారిగా మారాడు. మనసుకు నచ్చినట్లు స్వేచ్ఛగా తిరగాలని, నిరంతరం ఏదో రాయాలనే తపనతో అక్షరానికి పదును పెట్టి మదిలో మెదిలిన భావాన్ని ఏకబిగిన పూర్తి చేయగల సామర్థ్యంతో అనేక రచనలు చేశారు. నీలాజంగయ్య సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలుచేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప కవి ‘భారతదేశంలోని ‘భిన్నత్వంలోని ఏకత్వం’’ లాగే జంగయ్య రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుంది. ఆయన కులమతాలకంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది అనీ ఆయన రచనలు చెపుతున్నాయి. సామాజిక అవ గాహనతో ప్రాకృతిక సౌందర్యంతో పదాలల్లి సహజకవిగా అవతరించాడు నీలాజంగయ్య. తన రచనల ద్వారా కులమత బేధాలను, రూపుమాపే ప్రయత్నం చేస్తూ అందరూ సమానులేనని, మానవ మూలాలన్ని ఒక చోటనుండే వచ్చాయని మనమందరం సర్వమానవ సౌభ్రాతృత్వంతో మెలగాలనే భావనను బలంగా కోరుకున్న కవి నీలాజంగయ్య.

మతం మత్తు కన్నా మానవసేవయే మాధవసేవ అని గుర్తించినప్పుడే ఈ సమాజం నవ సమాజం నిర్మించడం జరుగుతుందన్నారు. మనిషి విచక్షణను చంపేసేది మతమని, అది మానవ భావన నుండి తొలించాలని నీలాజంగయ్య గారు కోరుకున్నారు. ఎప్పుడైతే మతం పిచ్చిలో నుంచి మనిషి బయట పడతాడో మబ్బువిడిచిన సూర్యుడిలా మనవతా సూర్యుడౌవుతాడని అన్నారు. ఏ సమాజంలో అయితే కుల, మత, వర్ణ, వర్గ బేధలు లేకుండా మనుషులంతా సమానంగా బతుకుతారో అక్కడ మానవత్వం వెల్లివిరుస్తుందన్నారు.

‘‘లచ్చనంగ బతుకు బుచ్చిలింగ’’ అనే మకుటంతో బుచ్చిలింగ పద్యాలు రాశారు. చారుగుణ కదంబ శారదాంబ పద్యాలుగా గ్రంధస్థం చేశారు. శ్రీశైలవాస

చిద్విలాస అను మకుటంతో 403 పద్యాలను రాసి రామలింగ పద్యాలుగా వెలువరించారు. అదేవిధంగా విప్లవ స్వరాలు, జ్ఞానమందిరం, సంస్కార భూషణం వంటి పద్యాలు ఎన్నో రాశారు. ఏ వ్యక్తి అయినా స్వ ప్రయోజనం వ్యక్తి ధర్మం, వర్ణధర్మం కులధర్మం, మతధర్మం వదిలి నప్పుడే వారు చేసే పనులలో గొప్పతనం ఉంటుందని సమసమాజం అప్పుడే సిద్ధిస్తుందని విశ్వసించారు. ఈయన పద్యాల్లో వేమన మాధుర్యం, లోతైన సామాజిక అవగాహన కనిపిస్తుంది. పైన వివరించిన అంశాలను ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు ప్రారంభించారు.

మానవుడు బాగుపడాలి అంటే ముందు తనను తాను తెలుసుకోవాలి. సత్యం, అహింస న్యాయం, నిజాయితీ వంటి సద్గుణాలు అలవర్చుకోవాలి.మతం, కులం, జాతీవంటి స్వార్థపు ఆలోచనల వల్ల మానవుడు బాగుడడం జరుగదని, దానివల్ల సమాజంలో మానవ మనుగడ అస్థవ్యస్థంగా మారుతుందని దేశాభివృద్ధికి అవరోదం ఏర్పడుతుందని ఈ రచనల ద్వారా కవి భావనను వెల్లడిచేశారు. ఈపద్య కావ్యాల ద్వారా భావి తరాలకు ఆదర్శప్రాయమైన ప్రణాళికలను దిశ నిర్దేశం చేశారు. ఈయన పద్యాలన్నీయు దాదాపుగా ఆట వెలదిలోనే రాయడం విశేషం, ఇవేకాకుండా మధువనం వంటి గేయ సంకలనాలను వెలువరించారు. ముఖలింగ క్షేత్ర ఇతివృత్తంతో 'చిత్కళగేయ కావ్యం రాశారు. ఛందస్సు మీద తనకు గల అధిపత్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుతమైన ఛందో బద్ధ ప్రయోగం చేశారు. ఆధునిక కవిత్వంలో భాషపరంగా ఛందస్సులో ఈ కావ్యంలో నూతన ప్రయోగాలు జరిగాయి. ఈ గేయ రచనల్లో మనిషి చైతన్యవంతుడిగా ఉండాలని పొరపాట్లు జరగకుండా చేసుకోవాలని సందేశం ఈ గేయకావ్యాలలో వ్యక్తమవు తుంది. వైశ్యకుల దీపిక, కన్యకా పరమేశ్వరీ చరిత్ర మాణిక్య ప్రభుచరిత్ర వంటి బుర్రకథలను సైతం రాసి తానే స్వయంగా ప్రదర్శనలు ఇచ్చిన సకల కళా సహృదయుడు నీలాజంగయ్య ప్రకృతిని ఆరాధించడం, ప్రజాశ్రేయస్సేను కాక్షించడం, సమాజ సంస్కరణే ధ్యేయంగా రచనలు చేసి ప్రజలలో సామాజిక చైతన్యం కలిగించి సాహితీ లోకంలో ధృవతారగా వెలిగిన కవి నీలాజంగయ్య ప్రతివ్యక్తి యొక్క సాధారణ జీవితంలో ఈ కవితాంశాలు నిత్యం ఎదరుపడడం గమనించవచ్చు. ఇటువంటి కవితా అంశాలతో మానవవ్యక్తిత్వానికి మార్గ దర్శకత్వం వహించే విధంగా నీలాజంగయ్య వచన కవిత్వాన్ని పూరిపూర్ణం చేశారు.

సాహిత్యంలో ప్రతిపాదింప బడిన విశ్వజనీన దృక్పథాన్ని, వివేచనత్వాన్ని ప్రామాణీకరింప బడిన ప్రతిపాదనలను కొనియాడారు. ఇదంతా ఎందుకు చెప్పడం అంటే నీలా జంగయ్య కవితలో తేజస్వంతమైన అభివ్యక్తి మాధుర్యం చైతన్య ధారగా ఉరకలు వేస్తూ సాహితిని పరుపుష్టమంతం చేసే కోణాలు ఉండడమే అదీ అసలైన సమాజకవి కోరిక. జనావళి నాలుకల మీద తన పద్యం, నిలవాలని, అంటే జనాన్ని చైతన్యమంతం చేయటం అభ్యుదయ మార్గం చూపించడం, మాన వత్వాన్ని అందించడం అనేవి. అందమైన పుస్తకంగా అందరి డెందాలకు అంటే హృదయాలకు చేరితే చాలు అలాంటి కవిత్వం సత్యం అవుతుంది. నిత్యం నిలుస్తుంది. నిరంతరంగా వెలుగునిస్తుంది. అదీ తిరునగరి ఆశయం. ఆయనలో బాల్యదశనుంచే పరిస్థితులను అవగాహన చేసుకునే సమర్థత ఉంది. ఆవేశాలను అర్థం చేసుకునే సంయమనం ఉంది. సంఘర్షణల రూపాలను దర్శించే నిపుణత ఉంది. సమస్యల పునాదులను గ్రహించి మలచుకునే చాకచక్యం ఉంది. సాధ్యాసాధ్యాల సంవీక్షణా ఉంది. విచక్షణా ఉంది. బాల్యవయస్సులోనే పుట్టి ఏర్పడిన మానసిక క్రమశిక్షణ ఆయన్నీ ప్రజాకవిగా, సమాజకవిగా, ప్రపంచకవిగా నిలబెట్టింది.ఐదు దశాబ్దా లకు పైగా రచనలు చేస్తున్నా తన నమ్మకాలను విశ్వాసా లను గం వదలిపెట్టలేదు. తనకు వాస్తవమని తెలిసి నప్పుడు ఎవరితోనూ రాజీపడని లక్షణం నీలా జంగయ్యది అని చెప్పడం కవి తన వ్యక్తిత్వాన్ని ఎత్తి చూపడమే. అది సహజకవి అభివ్యక్తి.

కవి వ్యక్తిత్వంలోని వాస్తవికతకు అద్దం పడుతుంది. శాంతి కవిత్వంలోని, విశాల దృక్పథాన్ని ప్రకటిస్తోంది. నీలా జంగయ్య ముందుగా తనను కవిగా కాక మనిషిగా దర్శించుకుంటారు. స్థితి రూపంతోనే రచనలు చేస్తారు. మానవతా విలువలున్న అత్యాధునిక అభ్యుదయాన్ని ప్రామాణిక కొలమానాలతో రూపొందించి సుందరమైన దేశాన్ని నిర్మించాలి. అదే దేశభక్తి అనిపించుకుంటుంది. నీలా జంగయ్య ఈ భావనను అతి జాగ్రత్తగా ఈ దేశవాసిగా నిర్వహించి తన క్రాంత దర్శనాన్ని అందిచారు. కవి అభివ్యక్తి అంతేకాదు ఆయన ఆశ్రమం కూడా అది చైతన్యధారను ఉరకలు వేయించేది. -చైతన్యం అంటే కేవలం కదలికకాదు. ఆశయాలను తన భావాలను భూమిక నుంచి నిలువెత్తుగా ఎగిసి రెపరెపలాడుతూ జాతినాడులలో స్పందనను రగిలించడం అన్నమాట. దాని నుంచే మనిషి నిజంగా మనీషిగా నిలిచే సౌజన్యం పురులు విప్పడం. కవి ఈ లక్ష్యాన్ని సాధించారు.

అప్పుడే అసలైన సమాజం రూపుదిద్దుకుంటుంది. ఏమీ ప్రజాసేవచేయకుండానే రొమ్ముచాచి చేయెత్తి తనను చాటుకునేవాళ్ల సంఖ్య పెరిగిపోతున్నది. వాస్తవాలు మట్టిపొరల్లోకి కుదించబడ్డాయి. అవాస్తవాలు తోసు కుంటూ వచ్చి రంగస్థలం మీద నటిస్తున్నాయి. ఈ వైపరీత్యాలను కవి ఒక్క కలం పోటుతో తుంచివేస్తారు. హృదయాన్ని అందరికీ పంచే అమరభావనను ప్రతిష్ఠిస్తారు. మంచి వాక్యం మనిషి హృదయాన్ని పూలవనం చేస్తుంది. సదాసౌశీల్యాలు పంచుతూ మనిషికి రక్షణ వలయంగా నిలుస్తుంది. అదొక మానవతా చైతన్యకేదారం కాలుష్యాన్ని దరిదాపుల్లోకి రానీయనిదే అసలైన హృదయం. అదే నిర్మలమైంది. సదా నాణ్యమైంది. అలాంటి హృదయం నుండి వెలువడే క్రియ ప్రక్రియలు స్వచ్ఛంగా ఉంటాయి. సహృదయ సంస్పందంగా ఉంటాయి. సౌజన్య బంధురంగా ఉంటాయి.

పద్య వచన ప్రక్రియలో అభ్యుదయాన్ని మించిన మానవత్వం హృద్యంగా చిత్రింపడింది. కప్పి చెప్పేది కవిత్వం'' అని సినారె అన్న కవితోక్తులకు అనుగుణంగా ఈసంపుటిలోని కవిత్వం ఉంది. సంపుటి మానస సమాజాన్ని మార్చివేస్తుందని చెప్పవచ్చు. దేశభక్తి, మానవత, అంతర్వేదన, జాతీయత, దేశీయత, ప్రకృతి మానవ ప్రకృతిలోని భిన్న పార్శ్వాలు, అమ్మ, నవతం అనే అంశాలు ఉన్నాయి. జాతీయాలు, పదబంధాలు, అలంకారాలు, సామెతలు వంటివి సన్నివేశానికి బిగువును కలగజేసే విధంగా అమరాయి. వచన కవితా రచనలో అనేక పోకడలను ప్రదర్శించిన తీరు వీరి రచనల్లో ద్యోతికమవుతాయి. కవి సంకల్పం ఎంత పటిష్టంగా ఉందో గమనించండి. వస్తువు ఏదైనప్పటికీ అందులో మనిషిని సరిదిద్దే మానవత్వం పరిమళిస్తుంది.

మతం మానవులలో మానవత్వం పెంచేదిగా ఉండాలి కాని దానవత్వం పెంచేదిగా ఉండరాదని పక్షులు, పశువులు కలిసి జీవిస్తాయి. మనుషులు మాత్రము మతం పేరుతో కలహించు కుంటున్నారు. మతోన్మాదం మానవ జీవితానికి చీకటిమయం చేస్తుంది. అలాంటి మతం వద్దు అంటారు. మనిషిలో మార్గదర్శి, క్రాంత దర్శి, మహర్షి ఉన్నప్పుడే అతడు మనిషి అవుతాడు. కవి తన రచనల్లో ఉత్తమ మానవుని లక్షణాలను సరళ శైలిలో వర్ణించి పాఠకునిలో మనిషి సుగుణాలను పెంచే ప్రయత్నం చేశారు. ఇంకా అనేక సామాజిక అంశాలు, సమస్యలు, వాటి పరిణామాలు, పరిష్కారాలు తెలిపే కవితలు వున్నాయి. ఈ రచనలు చాలా విశిష్టతను సంతరించుకున్నట్టివి. ప్రతి కవితలో ఆత్మీయత ఉంది. దాన్నొక మానవతా చందన పరిమళంగా అందించే రమణీయ భావధార ఉంది.

'మహాప్రపంచము' 'సుమమాల' 'బుచ్చిలింగ శతకం' 'భావ జలధి' 'మహా ప్రళయం' 'నా పాటలు' 'కాంతి పుంజాలు' 'వ్యాస రత్నావళి' నవజీవని' ''ఎత్తు పల్లాలు' 'దర్శనం' అను అమూల్యమైన వారి రచనలతో లబ్ధ ప్రతిష్ఠులైనారు. కవికి మానవ కల్యాణమే పరమలక్ష్యం నన్నయ ''విశ్వశ్రేయః కావ్య'' మనుటలోని అభి

ప్రాయములే "శుభాశుభ పరిత్యాగ శీలురై మానవులు జగత్కల్యాణ లక్ష్యాలను చేరుటకు కర్మవీరులు కావలెననుటయే" వారి కవితాలక్షణము. భాషావిషయ మునకూడ జంగయ్యగారి దృష్టి విశాలమైనట్టిదే. వారా డంబరమునకై జీవితమునందువలెనే కవిత్వము నందము ప్రయత్నింపరు. సరళము సమరసమునైన జీవితము వారిది. వారి కవిత్వముకూడ నట్టిదే. వారి శైలి వ్యవహారమునకు సన్నిహితమై సులభమై సర్వ సుబోధమై రమ్యముగా నుండును.

కవితల్ సెప్పెడు వారే స్నేహితులు
సత్కా వ్యార్థముల్ సెప్పువా
రెవరైనన్ సరే ఆత్మ బంధువులు.

అన్నభావనల జంగయ్యగారి ఆత్మలో కవితలో ప్రతిబింబిస్తు వుంటుంది ఇది మెచ్చదగిన విషయం. వీరి గ్రంథాలన్నీ చదివి, వాటిలోగల అందాల్నీ, జాతీయతనూ, భావ గంభీరతనూ, కలబోయడం వెల కట్టడం అలతి కార్యంకాదు. తీరికగా పెద్దలు చేయవలసిన పని అది.

నీలా జంగయ్య మత దృక్పథాన్ని చాలా రచనల్లో స్పష్టంగా తెలిపారు. మతం మౌలిక భావనగా ఉంటే ఉండవచ్చు. కానీ అదే ప్రధానం కాకూడదని భావిస్తారు. అదొక విజ్ఞాన రూపంలో విస్తృతంగా ఉండాలని మతాలు, సమతలు పెంచాలని, మానవత్వాన్ని వెలిగించేలా ఉండాలని ఆత్మీయతా గంధాలు వెదజల్లే దివ్య సింధూరంలా ఉండాలని ఆకాంక్షిస్తారు. సమాజాన్ని ఎన్ని కుయుక్తులతో వంచిస్తున్నదీ తెలుసు. కావున ఇవన్నీ మతం పరిధిలోకి తీసుకుంటే మానవత్వం సంపూర్ణంగా తుడిచిపెట్టుకుపోయి రానున్న అందాల భవిష్యత్తును ముందుగా వెక్కిరించినట్లు అవుతుంది. కవి ఇలా అంటారు.

అగ్నియన్న నొకటె అంగారుయన నొకటే
రాముడతడె మరి రహీమతండె
అక్షరములె వేరు అర్థంబులొకటెరా !
(బాలగీతాంజలి, పుట.7)

భారతదేశం సర్వమతాలతో పులకించిన ధాత్రి అంటారు. అన్ని మతాలవాళ్లు సమైక్యంగా జీవిస్తూ విశాల విశ్వంలో తన ప్రత్యేకతను చాటుతున్న పున్యకేదారం. అందుచేత ఆ సుపవిత్ర భావనతో ముందుకు సాగాలి కాని మతాల మధ్య వైషమ్యాలను పెంచటం ఉచితం కాదంటారు. ఏమతమైనా ప్రశాంతతను మాత్రమే ప్రబోధిస్తుంది కాని వైరుద్యాలను పెంచి సమాజ జీవితాన్ని అస్థిరపరచదు. కవి జంగయ్య మత సామరస్యానికి తన కవితలో ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. ఇది మానవతను చల్లగా బతికించే హరిత సంప్రదాయం.

నేను సైతం
విశ్వశాంతికి
పావురమునై నింగికెగసితి
నేను సైతం
జీవధాత్రికిజ
అమృతమైన ప్రవహించియింకితి
(మహా ప్రపంచం, పుట.17)

శ్రీ శ్రీ పట్ల తనకు గల అపార గౌరవాన్ని వెల్లడిస్తారు.

జంగన్న కవితలో సంప్రదాయచ్ఛాయలతో పాటు ఆధునికతకు దర్పణం పట్టే కవిత్వలక్షణాలుకూడ గోచరిస్తాయి. జంగన్న కవిత్వం కేవలం సాంప్రదాయికమని చెప్పజాలము. అవసర మైనప్పుడు అభ్యుదయభావాలు కూడ ఈయన కవితల్లో కోకొల్లలుగా కన్పిస్తాయి.

గమనించండి.

ఏ గ్రంథం ఏ శాస్త్రం
ఏ చట్టం ఏ ధర్మం
బడగువాని కన్నీళుల
బాధల తెగటార్చగలిగే... (అణిముత్యాలు, పుట.14)

పేదవాని కన్నీటి బాధలను పోగొట్టగలదేదైనా అది ఉన్నతమైనదనీ,ఈ శాస్త్రాలూ, చట్టాలూ, ధర్మాలూ ఎన్ని ఉన్నా. అవి ఏవీ పేదల బాధలను తరిమివేయలేవనీ జంగన్న పై కవితలో తన అభ్యుదయతత్వాన్ని వివరిం చాడు. సమాజంలో జరుగుతున్న దురన్యాయాలకు కోపం,

వ్యథవంటి ధోరణలలో కవితలు రాసి 'విప్లవస్వరాలు' అని పేరు పెట్టారు. ఈ సంపుటిలో 'కన్యా విక్రయం' చెప్పుకోదగిన కవిత

కన్నబిడ్డల నమ్ముక కడుపు నింపు
కవని జీవించునట్టి పాపాత్ము లెపుడు
యితర బాగోగు లెట్లు సహింత్రు వారు
కుత్తుకుల దున్మ వెనుదీయ కుందురేమొ?
(విప్లవ స్వరాలు, పుట.16)

పసి బిడ్డనమ్మి యాబ్రత్కు బ్రత్కుటకంటే
పస్తులు బండిన ఫలము గాదె
పరమాన్నములు దిని బలిసి బొజ్జలు బెంచు
కన్న సంకటి మేలుగాదె? తినగ
మెక్కుచున్నాడు కన తండ్రి డొక్కనిండ
రోతదిన్నట్లుగాదె? యీ పాతకుండు
(విప్లవ స్వరాలు, పుట.13)

అని ఈసడించుకుంటారు. దుష్టశాసనాలు చేసే ప్రభుత్వం మీద విమర్శనాస్త్రం సంధిస్తాడు.

జాతిమతంబు మానవని
జాయితి కంతకు చేటు భరత
జాతికి దూరులై కుటిల శాసనముల్ గయిసేయ నెంతురా
ఘాతుకులార ధర్మమును, ఘాతుక జేసెదరా? హరీహరీ
పాతకులార, దుష్టమృగ భాగ్రవ పరంపరలుల్లసిల్లగన్
(విప్లవ స్వరాలు, పుట.17)

కలం పట్టిన తొలినాళ్లలోనే ఇంతటి తీవ్రభావాలు, ఆవేదనలు వారిద్దరి సామాజిక దురన్యాయాలపట్ల ఉన్న నిజాయితికి నిదర్శనంగా నిలుస్తాయి ఇందులోని ఖండికలు. ఇదే స్థాయిలో చివరి వరకూ ఉండి ఉంటే, ఉత్తమ అభ్యుదయ కవి. అయ్యేవాడేమో !

చివరగా తెలుగు సాహిత్యం, సామాజికాంశాల్ని నిరంతరం స్పృశిస్తూనే ఉంది. సాహిత్య ప్రయోజనాల్లో ఆనందం, ప్రబోధం ప్రధానాలు. మోక్ష సాధనం కూడా. సామాజికాంశాల ప్రభావం లేని సాహిత్యం కొయ్య బొమ్మలాంటిదే. బహుశా జీవం లేని సాహితీ సృజనను ఏ రచయితా ఇష్టపడడు. ఎందుకంటే కావ్యాన్ని సృష్టించడమంటేనే ప్రాణం పెట్టి ప్రాణం పోయడం సాహిత్యం-సమాజం పరస్పరాధారాలు. అన్ని భాషల్లో లాగానే తెలుగు సాహితీ ధురీణులు కాలానుగుణంగా సామాజికాంశాలకు ప్రతిస్పందించి ప్రజలను చైతన్యవంతం చేయటంలో సఫలీకృతులైనారు. ఇలాంటి వారసత్వమే నిరంతర చైతన్య స్రవంతిలా ప్రవహిస్తూ సమాజానికి తోడ్పడే రచనలను అందించారు నీలా జంగయ్య.

సమసమాజాన్ని నిర్మించాలంటే సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుంది అని బలంగా నమ్మినవారిలో నీలా జంగయ్య ఒకరు. అందుకే ఆయన శక్తివంచన లేకుండా తెలుగు సాహితీ వనంలో వివిధ ప్రక్రియల్లో విలువైన రచనలు చేశారు. సమాజాన్ని జాగృతపరిచి సామాజిక అభ్యున్నతికి తోడ్పడాలన్నదే ఆయన అభిమతంగా కనిపిస్తుంది. నీలాజంగయ్య తన పుస్తకాలను ఆనాటి ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి కొణిజేటి రోశయ్యతో పాటు కొత్తూరి సీతయ్య, గుప్త, దేవులపల్లి రామానుజ రావు, కాళోజి నారాయణరావు, తూమాటిదోణప్ప వంటి రాజకీయ, సాహితీ ప్రముఖులకు అంకితం ఇచ్చారు. ఉత్పల సత్యనారాయణచార్యుల స్వప్నాల దుప్పటి, డా.గుమ్మా శంకర్‌రావు జాతీయాలు- తీరుతెన్నులు అనే గ్రంథాలను అంకితం పొందిన ఉన్నతుడు నీలాజంగయ్య. తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని స్వయం కృషితో ఏర్పర్చుకున్న కవిరత్న నీలాజంగయ్య గారికి కీర్తి ప్రతిష్టలు ఎన్నొచ్చినా నిండైన అమాయకత్వంతో నిగర్విగా జీవించిన నీలాజంగయ్య విశిష్ట వ్యక్తిత్వంగల మానవతావాది. వారి ఆశయాలు, భావజాలం నేటి, రాబోయే తరాల వారికి స్ఫూర్తిదాయకం.

**ఆధార గ్రంథాలు :**

1. ఆణిముత్యాలు, నీలాజంగయ్య, శ్రీదేవి పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్, 1983.
2. ఆవేదన, నీలాజంగయ్య, నాగేంద్రప్రింటింగ్ ప్రెస్, సికింద్రాబాద్, 1956.
3. కన్యకాపరమేశ్వరి చరిత్ర, నీలా జంగయ్య, బిందు ప్రెస్, హైదరాబాద్, 1980.
4. కలంకల, నీలాజంగయ్య, శ్రీదేవి పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్, 1984.
5. కవితాచంద్రిక, బిందు ప్రింటర్స్, హైదరాబాద్, 1980.
6. కాంతిపుంజాలు, నీలా జంగయ్య, శ్రీ వెంకటేశ్వర శారదా నిలయం, దేవరకొండ,1978.
7. జ్ఞానమందిరం, నీలాజంగయ్య, నాగార్జున ప్రింటింగ్ వర్క్స్, హైదరాబాద్,1978.

❖❖❖

# ముకుంద రామారావు అనువాద రచనలు - ఒక పరిశీలన

- నారగోని సైదులు, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు.

## ప్రవేశిక :

తెలుగు సాహిత్యానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఆదికవి నన్నయతో ప్రారంభమైన తెలుగు లిఖిత సాహిత్యం నేటికి నిర్విఘ్నంగా, నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది. క్రీ.శ.11వ శతాబ్దం మొదలుకొని ఈనాటి వరకు ఎందరో కవులు, కవయిత్రులు, రచయితలు వారి వారి రచనల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ, ఎనలేని కృషి చేస్తున్నారు. అందులో కొంతమంది కవులు, రచయితలు తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ సాహిత్యాలకు పరిచయం చేసే ప్రక్రియకు శ్రీకారం చుడితే, మరి కొంతమంది ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు సాహిత్యానికి పరిచయం చేసే ప్రక్రియకు నాంది పలికారు. అటువంటి కవుల్లో ముందువరసలో ఉండే కవి, అనువాదకులు యల్లపు ముకుంద రామారావు ఒకరు. వీరు 'అదే ఆకాశం, అదే గాలి, అదే నేల, అదే కాంతి, అదే నీరు' (పంచ భూతాల) పేర్లతో భారతీయ, ప్రపంచ దేశాల కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. ఈ వ్యాసంలో ముకుంద రామారావు అనువదించిన పుస్తకాలు, అందులో పొందు పరిచిన అంశాలను సంక్షిప్తంగా పరిచయం చేయడమే ప్రధాన ఉద్దేశం. దానికంటే ముందు కవి పరిచయం, రచనలు, అందుకున్న పురస్కారాలు, అనువాదం గురించి సూక్ష్మంగా తెలుసుకుందాం.

## కవి పరిచయం :

నేటి ఆధునిక తెలుగు కవుల్లో కవిత్వం పరంగానూ, అనువాదం పరంగానూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు యల్లపు ముకుంద రామారావు. వీరి పూర్వీకుల జన్మస్థలం విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామం. ముకుంద రామారావు కుటుంబం వలస కుటుంబం కావడంతో వీరు 1944వ సంవత్సరం నవంబర్ 9న యల్లపు యల్లయ్య నాయుడు, ఎరుకులమ్మ దంపతులకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో జన్మించారు. అక్కడే ప్రాథమిక, ఉన్నత విద్యను అభ్యసించిన ముకుంద రామారావు, మధ్య ప్రదేశ్‌లోని సాగర్ విశ్వవిద్యాయలంలో ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఖరగ్‌పూర్ ఐఐటీలో మ్యాథ్స్‌లో పి.జి. డిప్లొమా, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో పి.జి. డిప్లొమా చేశారు. ఉద్యోగరీత్యా సుదీర్ఘకాలంగా రైల్వేశాఖలో పనిచేసి రైల్వే రిజర్వేషన్ కంప్యూటర్ నెట్ వర్కింగ్ సాఫ్ట్‌వేర్‌ని రూపొందించడంలో ముఖ్యభూమిక నిర్వహించి, పోయెట్ (ప్యాసింజర్ ఆపరేటేడ్ ఎంక్వయిరీ టెర్మినల్స్)ని రూపకల్పన చేశారు. 1995లో తన మొదటి కవిత సంపుటి 'వలసపోయిన మందహాసం'తో సాహిత్య రంగంలో అడుగుపెట్టిన రామారావు, ఓవైపు స్వీయ కవిత్వం రాస్తూనే, మరోవైపు దేశ, విదేశాల కవిత్వాన్ని తెలుగు భాషలోకి అనువాదం చేశారు, చేస్తూనే ఉన్నారు. వీటితో పాటు కథలు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పలు పుస్తకాలను కూడా వెలువరించారు. కవిత్వానికి సంబంధించి వీరు ఇప్పటివరకు 'వలసపోయిన మంద హాసం, మరో మజిలీకి ముందు, ఎవరున్నా లేకున్నా, నాకు తెలియని నేనెవరో, నిశ్శబ్దం నీడల్లో, విడనిముడి, ఆకాశయానం, రాత్రినదిలో ఒంటరిగా' అనే 8 కవిత సంపుటాలను వెలువరించారు. ముకుంద రామారావు తెలుగు సాహిత్యానికి చేస్తోన్న సేవకుగాను శ్రీరమణ సుమనశ్రీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, సి.పి. బ్రౌన్ పురస్కారం (హ్యూస్టన్ యుఎస్ఏ), గంగిశెట్టి స్మారక మహాంధ్రభారతి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం. అజో-విభొ-కందాళం 2024 ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారాలు వరించాయి.

## అనువాదం ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్యం సంస్కృతంలో వేదవ్యాసుడు

రాసిన మహాభారతం అనువాదంతో ప్రారంభమైన విషయం అందరికీ తెలిసిందే. ఆదికవి నన్నయ రాజరాజ నరేంద్రుని కోరిక మేరకు సంస్కృత భారతాన్ని తెలుగులోకి ఆంధ్రీకరించారు. అంటే తెలుగులో తొలి తెలుగు అనువాద కవి, అనువాదానికి మొదటి మార్గదర్శకుడు నన్నయే. ఆ తర్వాత పలువురు ప్రాచీనాంధ్ర కవులు అనువాదం విషయంలో నన్నయ అనుసరించిన పద్ధతులనే అవలంబించారు. తెలుగులో నన్నయతో ప్రారంభమైన అనువాదాల ప్రక్రియ, ఆంగ్ల భాష ప్రభావంతో నూతన మార్పులకు లోనై, ఈనాటి వరకూ నిరంతరంగా, నిర్విరామంగా వెలువడుతూనే ఉంది.

**అనువాదం - అర్థం :**

అనువాదాన్ని ఇంగ్లీషులో 'Translation' అని అనువాదకుడిని 'Translator' అని అంటారు. అనువాదం అంటే తెలియనిదేదో తెలియజెప్పటం లేదా బహిరంగ పరచడం అని అర్థం. ఒక భాషలో ఉన్న దానిని మరొక భాషలోకి మార్చి చెప్పడం.. అది రాత రూపంలో కావచ్చు, మాటల్లో కావచ్చు. అంటే ఒక భాషలో ఉన్న విషయాన్ని గానీ, పదాన్ని గానీ, వాక్య సముదాయాన్ని గానీ వేరొక భాషలోకి మార్చి చెప్పటాన్ని, రాయడాన్నే అనువాదంగా పిలుస్తుంటారు. అనువాద ప్రక్రియ భాషకు సంబంధించింది. మూలభాషలో ఉన్న విషయాన్ని లక్ష్యభాషలోనికి మార్చి చెప్పడం అనువాదమవుతుందని సాహితీవేత్తలు పేర్కొన్నారు.

**అనువాదం - పర్యాయ పదాలు :**

తెలుగులో అనువాదాన్ని వివిధ పేర్లతో ఉచ్చరిస్తున్నారు. అందులో ప్రధానంగా అనువాదం, తర్జుమా, భాషాంతరీకరణం, తెలుగీకరణం లేదా ఆంధ్రీకరణం, అనుసృజన, అనుసరణ, అనుకరణ, తెలుగు సేత, ట్రాన్సులేషన్ వంటి పదాలు పర్యాయ పదాలతో పిలుస్తున్నారు. కానీ, అనువాదం అన్న పదమే నేడు ఎక్కువగా రూఢికెక్కింది. వెలమల సిమ్మన రాసిన 'తెలుగు భాషా చరిత్ర' (పుట సంఖ్య 680) ప్రకారం 'నిజానికి అనువాదం చేయడమనేది అందరు అనుకునేంత సులభమైన ప్రక్రియ కాదు. అనువాదం చేయడమంటే మాటకు మాట, వాక్యానికి వాక్యం నిర్మించడం కాదు. అందరూ ఆ పని చేయలేరు, చేసినా అందరూ రాణించలేరు. దానికి చాలా సామర్థ్యం కావాలి' అని వివరించారు. చాలామంది అనువాదకులు ఒక గ్రంథాన్ని అనువదించడం కంటే స్వతంత్ర రచన చేయడమే మేలని వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనువాదకుడు మూల గ్రంథకర్త అంతటివాడైనప్పుడే, అతడి అనువాదంగా బాగా ఉంటుంది. అప్పుడే ఆ రచన పది మంది చేత మెప్పును పొందుతుంది అని సాహితీవేత్తలు తెలియజేశారు.

**అనువాదం - రకాలు :**

అనువాదాన్ని భాషాశాస్త్రజ్ఞులు శాస్త్రీయ దృష్టితో నిశితంగా పరిశీలించి కొన్ని భాగాలుగా విభజించారు. అందులో కొన్ని ప్రధానమైవి.. యధాతథానువాదం, స్వేచ్ఛానువాదం, మక్కీకి మక్కి అనువాదం, పదానువాదం, పేరానువాదం, సమాచారానువాదం, శాస్త్ర సాంకేతికానువాదం, సాహిత్యానువాదం, వ్యాకరణానువాదం. కోశానువాదంతో పాటు మరికొన్ని అనువాదాలుగా విభజించారు. అయితే, వీటిలో ఏ అనువాదం ఉత్తమమైన అనువాదం అంటే 'స్వేచ్ఛానువాదమే' మంచి అనువాదమని, ఈ అనువాదం ద్వారా మూల రచయిత రచనలకు ఎలాంటి భంగం కలగదని భాషావేత్తలు వివరించారు.

**మూలభాష - లక్ష్యభాష :**

ఏదైనా ఒక అంశాన్ని ఏ భాషలోంచైతే ఎన్నుకుంటారో దాన్ని 'మూలభాష' (Source Language) అంటారు. ఎన్నుకున్న ఆ అంశాన్ని ఏ భాషలోకైతే అనువాదం చెయ్యాలని సంకల్పిస్తారో దాన్ని 'లక్ష్యభాష' (Target Language) అంటారు. రాచమల్లు రామచంద్రారెడ్డి 'అనువాద సమస్యలు' అనే గ్రంథంలో "మూలభాష మాతృభాషగా గలవానికి, మూలరచనలోని సారాంశం ఎంత స్పష్టంగా అర్థమై, ఎంత గాఢమైన అనుభూతిని కలిగిస్తుందో,

లక్ష్యభాష మాతృభాషగా గలవానికి అనువాదంలోని సారాంశం అంత స్పష్టంగానూ అర్థమై, అంతగాఢమైన అనుభూతిని కలిగిస్తే అది మంచి అనువాదం అవుతుంది' అని వెల్లడించారు.

## ముకుంద రామారావు అనువాద రచనలు - పరిశీలన :

"సాహిత్యం నాకు ఇంటావంటా లేని ప్రక్రియ. నేను చదువుకుంటున్న క్రమంలో నాకు దొరికిన గురువులు, స్నేహితులు, బంధువులు సాహిత్య మార్గాన్ని చూపించారు. అందులో మా తాతయ్యని ముందుగా స్మరించుకోవాలి. ఖరగ్‌పూర్‌లో బుర్రకథలు, హరికథలు, నాటకాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు మొదలయిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగుతుండేవి. అవి నా బాల్యంలోనే నాపై బలమైన ముద్ర వేసాయి." అని కవి, అనువాదకులు ముకుంద రామారావు తెలుగు సాహిత్యంతో తనకు ఏర్పడిన బంధాన్ని అజో-విభొ-కందాళం 2024 ప్రతిభా వైజయంతి సమ్మానోత్సవ విశేష సంచిక (పుట సంఖ్య 6)లో తెలియజేశారు. ముకుంద రామారావు అనువాదాలకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 12 పుస్తకాలను వెలువరించారు. అవి వరుసగా 1.అదే ఆకాశం (2010) 2.శతాబ్దాల సూఫీ కవిత్వం (2011) 3.1901 నుండి నోబెల్ కవిత్వం (2013) 4.1901 నుండి సాహిత్యంలో నోబెల్ మహిళలు (2015) 5.అదే గాలి (2016) 6.భరతవర్షం సీతాకాంత మహాపాత్ర (2017) 7.చర్యాపదాలు (2019) 8.అదే నేల (2019) 9. అదే కాంతి (2022) 10.మియా కవిత్వం (2022) 11.బెంగాలీ బౌల్ కవిత్వం (2023) 12. అదే నీరు (2023) అనే పేర్లతో పుస్తకాలను ఆవిష్కరించారు. ఒక్కొక్క పుస్తకంలోని అంశాలను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

### అదే ఆకాశం అనేక దేశాల అనువాద కవితలు:

ముకుంద రామారావు వెలువరించిన మొట్టమొదటి అనువాద సంకలనం 'అదే ఆకాశం'. 2010లో వెలువడింది. ఈ పుస్తకానికి ప్రముఖ విమర్శకులు గుడిపాటి 'ప్రపంచ కవితల్లో తాత్విక సౌందర్యం' అనే పేరుతో ముందుమాట రాశారు. ఇందులో చైనా దేశం మొదలు కొని కెనడా దేశం వరకు మొత్తం 23 దేశాలకు చెందిన 53 మంది కవులకు సంబంధించిన 72 కవితలు తెలుగులోకి ఆంధ్రీకరించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట ప్రేమను, అందులోని మాధుర్యాన్ని వర్ణిస్తూ, చైనా కవి కూన్ తావోషెంగ్ (1262-1319) రాసిన 'పెళ్లయిన ప్రేమ' కవితను అనువాదకులు రామారావు తెలుగులోకి అద్భుతంగా అనువదించారు.''నువ్వు/నేను/చాలా ప్రేమించుకున్నాం/అది అగ్గిలా మండుతోంది/మనం దానిలో మట్టిముద్దని కాల్చి/నీలాగ నాలాగ మలుద్దాం'' అంటూ ప్రేమలోని సౌందర్యాన్నీ, జీవన స్పర్శనీ ఐక్యతనీ, ప్రశాంత జీవితానికి ఆలంబనగా నిలిచే వైనాన్ని చక్కగా వర్ణించారు. అలాగే, రొమానియా కవి మారిన్ సొరెస్కూ (1936-1996) రాసిన 'ఆకుపచ్చ గుడ్డతో' అనే కవిత ఖండికలో ''ఆకుపచ్చ గుడ్డతో/చెట్ల కళ్లని కప్పి/పట్టుకోమన్నాను నన్ను అంటూ మొదలుపెట్టి నేను గంతలు కట్టినవన్నీ/దాచే ప్రయత్నాన్ని మానుకోమన్నాయి/భావాలతో సహా'' అంటూ ప్రకృతిలోని వైవిధ్యాన్ని, సౌందర్యాన్ని ఓ గుడ్డతో కప్పి ఉంచేందుకు ప్రయత్నించి, చివరికి సూర్యుడి పట్టుకునే ప్రయత్నంలో వెనకబడి, తాను గంతలు కట్టి, దాచే ప్రయత్నాన్ని మానుకోమంటూ భావాలు చెప్పిన కవి ఆవేదనను చక్కగా వివరించారు.

### శతాబ్దాల సూఫీ కవిత్వం :

తెలుగు కవిత్వానికి సూఫీ కవిత్వాన్ని పరిచయం చేసిన మొట్టమొదటి కవి యల్లపు ముకుంద రామారావు. వీరు 'శతాబ్దాల సూఫీ కవిత్వం' పేరుతో 2011లో పుస్తకం వెలువరించగా, 2018లో మలి ముద్రణకు నోచుకుంది. ఈ సంకలనంలో శతాబ్దాల వారీగా 8 నుంచి 20వ శతాబ్దం వరకు వివిధ దేశాలకు చెందిన సుమారు 52 మంది సూఫీ కవుల నేపథ్యాన్ని, వారి కవితలను తెలుగులోకి అనువదించారు ముకుంద రామారావు. మరి, సూఫీ కవిత్వం అంటే ఏమిటి?. 'సూఫ్ అనే అరబ్బీ పదం నుండి

సూఫీ వచ్చింది. సూఫీ తత్వాన్ని అరబ్బీలో తసవ్వుఫ్ అంటారు. ఇది ఇస్లాం మతం మార్మిక శాఖ. దేవుడ్ని ప్రేమించే మార్గమే సూఫీ సారాంశం. అంటే అన్ని బంధనాల్నీ వదలుకుని, అన్నింటిలో దేవుడ్ని ప్రేమ మార్గంలో చూసేది సూఫీ పద్ధతి. సూఫీకి సుమారు రెండువేల నిర్వచనాలు ఉన్నాయి. కానీ, ఏ నిర్వచనం సర్వ సమగ్రమైనది కాదు. అవన్నీ సూఫీ మార్గాన్ని సూచించేవే' అని అనువాదకులు ముకుంద రామారావు పుస్తకానికి రాసిన ముందుమాటలో సూఫీ కవిత్వం గురించి వివరించారు. సూఫీ మార్గమంటే జీవితాల్ని ధారపోవటం కాదు, ఆత్మ సింహాసనాన్ని అధిరోహింటం అని 17వ శతాబ్దానికి చెందిన టర్కీ సూఫీ కవి ఐహ్ ఎఫెంది (1591-1651) 'సూఫీ మార్గం' అన్న కవితలో సూఫీ తత్వాన్ని వెల్లడించారు. ''వాళ్లంటారు సూఫీ మార్గమంటే/తమ జీవితాల్ని ధారబోయటమని/సూఫీ మార్గమంటే/ఆత్మ సింహాసనాన్నధిరోహించటం' అని చివరగా 'వాళ్లంటారు, ఇది మహమ్మద్ సందేశం నిదర్శమని/సూఫీ మార్గం, ఓ ఇబ్రహీం/తనకు తానుగా అయినట్టు/దేవునిగా మూర్తీభవించటం.'' అని పేర్కొన్నారు. అంటే సూఫీ మార్గాన్ని ఎంచుకున్నవారు చివరికి దేవునిగా మూర్తీభవిస్తారు అని విషయాన్ని తెలియజేశారు. 8వ శతాబ్దానికి చెందిన రబియా బ్రస్రీ (717-801) అనే కవి 'ఓ భగవంతుడా, మరొక రాత్రి వెళ్లిపోతోంది' అనే కవితలో గడిచిన రాత్రిలో తాను సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాన లేక వృధా చేశానా, ఒకవేళ మీరు (దేవుడు) ఇచ్చిన సమయాన్ని వృధా చేసుకుని ఉంటే చెప్పు, పోగొట్టుకున్న దానికోసం విచారిస్తానని భగవంతుడిని వేడుకుంటాడు. ''ఓ భగ వంతుడా, మరొక రాత్రి వెళ్లిపోతోంది/మరో రోజు వస్తోంది/ రాత్రి నేను బాగా గడిపానని చెప్పు/ నేను శాంతి వృధా చేశాననంటే/ పోగొట్టుకున్న దానికోసం విచా రిస్తాను.''

**1901 నుండి నోబెల్ కవిత్వం (కవుల జీవిత-కవిత్వ విశేషాలు) :**

ప్రపంచ సాహిత్యం ఎలా ఉంటుంది?, విదేశీ కవులు కవిత్వం ఎలా రాస్తారు? అనే సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆస్తకిగా ఉన్నవారు కవి, అనువాదకులు ముకుంద రామారావు ఆంధ్రీకరించిన '1901 నుండి నోబెల్ కవిత్వం (కవుల జీవిత-కవిత్వ విశేషాలు)' అనే పుస్తకాన్ని చదివితే ప్రపంచ సాహిత్యం, కవిత్వం, కవుల జీవిత విశేషాలు అవగతమవుతాయి. ఈ గ్రంథానికి ప్రముఖ తెలుగు రచయిత, విమర్శకులు వెల్చేరు నారాయణరావు 'అరచేతిలో ప్రపంచం' అనే పేరుతో ముందుమాట రాశారు. అందులో ఆయన ''తెలుగు సాహిత్య వాతావరణానికి ముకుంద రామారావు గారు ఒక గొప్ప ఉపకారం చేశారు. నోబెల్ బహుమానపు మహద్వారం తెరిచి, ఆ బహుమానం పొందిన కవిత్వంలో ఏం జరిగిందో కళ్ళు మిరుమిట్లు గొలిపేలా చూపించారు. 1901 నుంచీ 2011 వరకూ నోబెల్ బహుమానం అందుకున్న కవుల జీవిత కథలు సంగ్రహంగా చెప్పి, వాళ్ల కవిత్వంలో మచ్చుతునకలు కొన్ని అనువాదం చేసి మనకు బహుమానంగా ఇచ్చారు.'' అని వివరించారు. ఈ పుస్తకంలో నోబెల్ పురస్కారం అందుకున్న 37 కవులు, వారి నేపథ్యం, 170 కవితలు పేర్కొనబడ్డాయి. 1901వ సంవత్సరం నుంచి ఫ్రెంచ్ కవి సల్లీ ప్రుధోమే మొదలుకొని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు, 2011లో పురస్కారం అందుకున్న టామస్ ట్రాంస్ట్రోహ్మర్ కవి వరకు ప్రస్తావించారు. సల్లీ ప్రుధోమే (పూర్తిపేరు రెనె ఫ్రాంకోస్ ఆర్మండ్) మొట్టమొదటిసారిగా కవిత్వ ప్రక్రియలో నోబెల్ పురస్కారం అందుకున్నారు. సల్లీ ప్రుధోమే విఫల ప్రేమలోంచి ప్రభవించిన తొలి నోబెల్ కవిగా ఖ్యాతికెక్కారు. 'ఈ ప్రపంచంలో' అనే కవితలో సల్లీ ప్రుధోమే ఇలా అంటాడు.. ప్రపంచంలో ఎక్కడ పూలు పూసిన అవి ఏదో రోజు వాడిపోతాయి, పక్షులు తమ గొంతు నుంచి ఎంతటి తీయటి పాటాలు పాడినా అది కొంతకాలమే ఉంటుంది. కానీ, తాను మాత్రం ప్రతి ఏడాది గుర్తుండిపోయే గ్రీష్మాన్నే కలగంటాను అనే కవితను అనువాదకులు అద్భుతంగా తెనిగించారు. ''ఈ ప్రపంచంలో పూలన్నీ వాడిపోతూనే ఉంటాయి/పక్షుల

తీయటి పాటలైనా స్వల్ప కాలికమే/నేను గుర్తుండిపోయే గ్రీష్మాన్నే ఎప్పుడూ కలగంటాను." నార్వే దేశానికి చెందిన మరొక నోబెల్ పురస్కార గ్రహీత జ్యోర్న్ స్టెర్న్ బ్యోర్న్సన్ 1859లో రాసిన 'అవును, ఈ దేశాన్ని వేము ప్రేమిస్తున్నాము' అనే గీతం ఆ దేశ జాతీయం గీతంగా కొనసాగుతోంది. ఈయన రాసిన రచనలకు గానూ 1903 డిసెంబర్ 10న నోబెల్ పురస్కారం వరించింది. అడవి ఆవేదనను వర్ణిస్తూ జ్యోర్న్ స్టెర్న్ బ్యోర్న్సన్ రాసిన 'అడవిలో' అనే కవితను ముకుంద రామారావు తెలుగులోకి అద్భుతంగా తెనిగించారు. "ఒక్కొక్కొటిగా అడవి నెమ్మదిగా గొణక్కుంటోది/తాను నవ్వుతూ ఏకాంతంలో చూసిందంతా,/తరువాత కాలంలో తాను పడ్డ బాధలన్నింటినీ,/గాలికి తెలిసే ఉండాలని, ఏడుస్తూ చెప్తోంది."

## 1901 నుండి సాహిత్యంలో నోబెల్ మహిళలు:

ముకుంద రామారావు తెలుగు సాహితీలోకానికి అందించిన మరొక అపురూపకమైన బహుమానం 'సాహిత్యంలో నోబెల్ మహిళలు' (2015) అనే పుస్తకం. ఈ పుస్తకంలో నోబెల్ కర్త నేపథ్యంతో పాటు 1901 నుంచి 2015 వరకూ నోబెల్ పురస్కారం అందుకున్న 14మంది మహిళల నేపథ్యం, వారి రచనల గురించి ప్రస్తావించ బడింది. 1901 నుంచి 2015వరకూ నోబెల్ పురస్కారం అందుకున్న మహిళలు వరుసగా.. సెల్మా లోగెర్లోఫ్, గరాజ్సీ డేలెడ్డా, సీగ్రిడ్ ఇండ్సెట్, పెర్ల్ ఎస్ బక్, గబ్రియేలా మిస్ట్రాల్, నెల్లీ సాచ్స్, నాదిన్ గోర్డిమెర్, టోనీ మోరిసన్, విస్లావా సింబోర్స్కా, ఇల్ఫ్రీడే ఇయెలిన్, డోరిస్ లెస్సింగ్, హేర్తా మ్యూలర్, అలిస్ మన్రో, స్వెత్లానా అలెక్సీయెవిచ్.

## అదే గాలి ( ప్రపంచ దేశాల కవిత్వం-నేపథ్యం):

'అదే గాలి' పేరుతో అనువాదకులు రామారావు 2016లో ప్రపంచ దేశాల కవిత్వం-నేపథ్యాన్ని తెలుగులోకి అనువదించి, పుస్తకంగా ఆవిష్కరించారు. ఈ గ్రంథంలో చైనా దేశపు కవిత్వం మొదలుకొని లాటిన్ అమెరికా దేశాల కవిత్వం వరకు మొత్తం 20 దేశాలకు చెందిన కవిత్వం, కవుల నేపథ్యం, కవితలు వివరించబడ్డాయి. మొదటగా చైనా దేశంలో కవిత్వం ఎప్పుడు మొదలైంది?, మొదటి కవిత సంకలనం ఎవరు రాశారు?, చైనా దేశపు కవులు కవిత్వంలో ఏయే అంశాలను వస్తువులుగా ఎన్నుకున్నారు? అనే అంశాలను ముందుగా ప్రస్తావించి, ఆ దేశపు ముఖ్యమైన కావ్యాలు, కవుల గురించి విశ్లేషించారు ముకుంద రామారావు. షీ చింగ్ అను కవిత్వ పుస్తక చైనా ఆది కావ్యంగా గుర్తించబడింది. కానీ, దీనిని రాసిందేవరో తెలియదు. ఈ కావ్యంలో 3000 కవితలు ఉంటే కన్ఫ్యూషియస్ అనే కవి వాటిని కుదించి 300 కవితలుగా వెలువరించారు. స్త్రీ భార్యగా పదోన్నతి పొందిన తర్వాత ఇంటి పనుల్లో నిమగ్నమైపోవడం, తెల్లవారకముందే లేచి ఇంటి పనులన్నీ చేస్తుంది. అయినా, భర్తకు తన తప్పులే కనిపిస్తాయని ఆవేదన చెందుతూ, చివరికి తన మీద తానే జాలిపడతాను అంటూ ప్రతి ఇల్లాలి పరిస్థితిని వివరించారు. "మూడేళ్ళుగా నీ భార్యను/ఇంటిపనుల్లో నేనెప్పుడూ అలసిపోలేదు/పెందరాలే లేచి ఆలస్యంగా పక్కమీద వాలతాను/పనిలేని ఉదయమే లేదు/ముందు నా తప్పులే కనిపిస్తాయి/ఆ తరువాత నామీద దౌర్జన్యం.' జపాన్ దేశపు మొదటి కవిగా భావించే 'మన్ యోషు' దీర్ఘ కవిత్వం రాయడంలో అగ్రగణ్యుడు. 'నీ జుత్తు తెల్లబడింది/నాకు ముడిపడ్డ/నీ హృదయం మాత్రం స్థిరంగా ఉండి పోయింది/దాన్ని నేనెప్పుడూ విప్పను" అంటూ రాసిన ప్రేమ కవిత్వం మనసును హత్తుకుంటుంది. జీవితంలో ఎన్ని ముడులిప్పిన నాతో ముడిపడిన ఆ ముడిని మాత్రం విప్పను అంటూ కవి వర్ణించిన విధానాన్ని అనువాదకులు తెలుగులోకి చక్కగా వర్ణించారు.

## భరతవర్షం సీతాకాంత మహాపాత్ర :

ప్రముఖ ఒడియా కవి సీతాకాంత మహాపాత్ర రాసిన 'భరతవర్షం' అనే కావ్యాన్ని ముకుంద రామారావు 2017లో తెలుగులోకి అనువదించారు. ఈ కావ్యానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. కొలకలూరి ఇనాక్ 'పరిమళ దర్శనం'

పేరుతో ముందుమాట రాశారు. ఈ కావ్యంలో మొత్తం 9 సర్గాలు ఉన్నాయి. భారతదేశ శాశ్వతత్వాన్ని ఆశిస్తూ రాయబడిన ఊహాజనిత రూపకం ఇది. కలలు-నిరాశలుబీ నిట్టూర్పులు-దుఃఖాలు, కలలోని అభిన్నమైన అంగంలా ఒక ప్రవక్తగా లేదా కవిగా మారిపోవడం ఈ కావ్యంలో కనిపిస్తాయి. అమెరికా ప్రభుత్వం తమ భూమి కొంటున్నప్పుడు, దస్తావేజుమీద సంతకం చేస్తూ సియటల్ అధ్యక్షుడికి తన తల్లి ఈ భూమీపై ఉన్న దేవదారు వృక్షాలు, ఇసుక, పొగమంచు, ప్రతి పచ్చికబీడు ప్రజల స్మృతులకు పవిత్రాలే అంటూ పలికిన మాటలతో మొదటి సర్గ ప్రారంభమౌతుంది. "మా అమ్మ నాతో అంది/మన ప్రజలకు ఈ భూమిమీదివన్నీ పావనమేనని/దేవదారు ప్రతీ పత్రం/ప్రతీ ఇసుక తీరం/కారడవిలో ప్రతీ పొగమంచు/ప్రతీ పచ్చికమబీడులో ఝుంకారము చేసే కీటకం/అన్నీ మన స్మృతుల్లో పవిత్రాలే అని."

**చర్యాపదాలు :**

'చర్యాపదాలు' అనే పేరుతో అనేక భాషల ప్రథమ కావ్యంగా పిలువబడే, 10వ శతాబ్దపు మహాయాన బౌద్ధుల నిర్వాణ గీతాలను తెలుగులోకి అనువాదం చేసిన తొలి తెలుగు కవి, అనువాదకులు యల్లపు ముకుంద రామారావు. ఈ పుస్తకంలో సుమారు 50 చర్యాగీతాలు పేర్కొనబడ్డాయి. ఈ చర్యాపదాలు సైద్ధాంతిక, ఆధ్యాత్మిక, తాత్విక పరమైన విషయాలకు సంబంధించినవి. ఇవీ ఎక్కువగా పాళీ, హిందీ, బెంగాళీ, ఒడియా, అస్సామీ, మైథిలీ, శౌరసేన భాషలలో రాయబడ్డాయి. ఈ పుస్తకంలో చర్యాపదాల పుట్టుపూర్వోత్తరాలు, చర్యాగీతాలు రాసిన సిద్ధాచార్యుల విషయాలు, చర్యపదాల రచనాకాలం నాటి పారిభాషికపదాలతో పాటు మరికొన్ని విషయాలు వివరించబడ్డాయి. లుయిపాద సిద్ధాచార్యుడు రాసిన ''కాఅ తరువర్ పంచ్ వి డాల్/ చంల్ చీఏ పైఠా కాల్/ దిఢ్ కరిఅ మహాసుహ పరిమాణ్/లుయి బణఇ గురు పుచ్ఛిఅ జాణ్'' అనే చర్యాగీతాన్ని గమనిస్తే, ఇది అంత్య ప్రాసలో రాయబడిందని, వీటిని ద్విపద శ్లోకాలుగా పిలువచుకోవచ్చని అనువాదకులు ముకుంద రామారావు తెలిపారు.

**అదే నేల (భారతీయ కవిత్వం-నేపథ్యం) :**

ముకుంద రామారావు ప్రపంచ కవిత్వాన్ని, సూఫీ కవిత్వాన్ని, నోబెల్ కవులను, వారి జీవిత విశేషాలను, చర్యాపదాలను తెలుగు వారికి పరిచయం చేశారని పై పుటల్లో తెలుసుకున్నాం. వాటితోపాటు 'అదే నేల' పేరుతో ఆయన మన భారతీయ కవిత్వ నేపథ్యాన్ని కూడా తెలుగులోకి ఆంధ్రీకరించారు. వందలాది భారతీయ భాషల నుంచి దాదాపు మూడు వేల మంది కవుల్ని పరిచయం చేసి, ఏడు వందలకు పైగా కవితల్ని తెలుగు లోకి అనువదించారు. ఈ పుస్తకానికి ఎ.కె. ప్రభాకర్ 'వైవిధ్యమే కవిత్వానికైనా ప్రజాస్వామ్యానికైనా ప్రాణం' అనే పేరుతో ముందుమాట రాస్తూ, ''సహస్రాబ్దాల చరిత్ర వున్న భాతతీయ కవిత్వం అంతటినీ ఒక చోట గుదిగుచ్చి, తెలుగులోకి అనువదించి అదే నేల పేరుతో ముకుంద రామారావు ఒక వుద్గ్రాంథాన్ని అందించారు. అదే నేల కేవలం భారతీయ భాషల్లో వచ్చిన కవిత్వ అనువాద రచన మాత్రమే కాదు. ఇది ఆయా భాషల సాహిత్య చరిత్రని, కవిత్వ నేపథ్యాల్ని నమోదు చేసింది. వాడుకలో లేని భాషలతోపాటు ఆదివాసీ కవిత్వం కూడా పేర్కొన బడింది.'' అని వివరించారు. అనేక భాషల భారతీయ కవిత్వం పేరుతో అనువాదకులు రామారావు భారతీయ భాషల పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించి అనేక విషయాలను పరిశోధనాత్మకంగా వెల్లడించారు. అదే నేలలో 1.ఈశాన్య భారతం (అస్సాం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్ప్రదేశ్) 2.తూర్పు భారతం (బెంగాలీ, నేపాలీ, మైథిలీ, సంతాలీ, ఒడియా) 3.ఉత్తర భారతం (కాశ్మీరీ, డోగ్రీ, పంజాబీ, హిందీ, రాజస్థానీ, ఉర్దూ) 4.పశ్చిమ భారతం (సింధీ, గుజరాతీ, మరాఠీ, కొంకణీ) 5.దక్షిణ భారతం (తమిళం, మలయాళం, కన్నడం, తుళు, కొడగు) 6.భారతీయాంగ్లం 7.వాడుకలో లేని భాషలు (సంస్కృతం, ప్రాకృతం, పాలీ)

8.ఆదివాసీ కవిత్వం పేర్లతో మొత్తం 8 విభాగాలుగా విభజించి, ఆయా భాషల చరిత్ర, ఉప భాషలు, మాండలికాలు, ప్రసిద్ధ కవుల రచనలను వెల్లడించారు ముకుంద రామారావు. అందులో ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో జీవిస్తున్న ఓ సవర తెగ పాడుకునే పాటను రామారావు తెలుగులోకి అనువదించిన విధానం అద్భుతంగా ఉంది. 'కొండలు అందంగా ఉంటాయి చెట్లుంటే/చెట్లు అందంగా ఉంటాయి మృదువైన ఆకులుంటే/ఆకులూ అందంగా ఉంటాయి నీడ వుంటే/ నీడా అందంగా ఉంటుంది జంతవులు తిరగలిగితే/మనిషి అందంగా ఉంటాడు అతనికి భార్య ఉంటే.''

**అదే కాంతి (మధ్యయుగంలో భక్తి కవిత్వం : సామాజిక నేపథ్యం):**

భారతదేశాన్ని చరిత్రకారులు ప్రాచీన యుగం అనీ, మధ్య యుగం అనీ, ఆధునిక యుగం అనీ మూడు యుగాలుగా విభజించిన విషయం అందరికీ తెలిసిందే. మధ్య యుగంలో వచ్చిన ఉద్యమాలలో భక్తి ఉద్యమం ఓ మైలురాయి. ఈ ఉద్యమం భారతదేశంలో ఉన్న అన్నీ భాషలలో వెలువడింది!. అటువంటి భక్తి ఉద్యమాన్ని అనువాదకులు రామారావు 'అదే కాంతి' పేరుతో మధ్య యుగంలో వచ్చిన భక్తి కవిత్వం, సామాజిక నేపథ్యాన్ని తెలుగులో తెనిగించి, 728 పుటలలో ఎన్నో విషయాలను అందించారు. తమిళం, కన్నడం, తెలుగు, మలయాళం ప్రాంతాలలో వచ్చిన భక్తి కవిత్వాన్ని దక్షిణ భారతంగా.., మరాఠీ, గుజరాత్, రాజస్థాన్, సింధ్ ప్రాంతాలను పశ్చిమా భారతంగా.., కాశ్మీర్, హిందీ, పంజాబ్ ప్రాంతాలను ఉత్తర భారతంగా.., అస్సాం, బెంగాల్, ఒడిస్సా ప్రాంతాల్లో వచ్చిన భక్తి కవిత్వాన్ని తూర్పు భారతంగా విభజించి, ఆయా ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన కవులు, వారి కవితలను తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకానికి ప్రముఖ అనువాదకులు వెల్చేరు నారాయణరావు 'మున్నుడి' పేరుతో రాసిన ముందుమాటలో ''భారతదేశంలో మధ్యయుగంలో వచ్చిన అనేక భక్తికవుల గురించిన కథలు ఇందులో ఉన్నాయి. ఈ కథలన్నీ ఎలా చెప్పుకుంటారో అదే పద్ధతిలో ఏ విధమైన వ్యాఖ్యానం లేకుండా రాసారు రామారావు. తెలుగు వాళ్లు ఎప్పుడు ఎరుగని అనేక భాషల్లో వున్న కవుల్ని గురించి ఈ పుస్తకం మనకి చాలా కొత్త విషయాలను చెప్తుంది'' అని పేర్కొన్నారు. ఇక, అనువాదకులు ముకుంద రామారావు 'సామాజిక తలుపులు తెరిచిన భక్తియుగం' అనే పేరుతో రాసిన పరిచయ వాక్యాల్లో భక్తి, కవిత్వం, ఉద్యమం గురించి ఎన్నో విషయాలను వివరించారు. అనువాదకులు 'అదే కాంతి' అనే పుస్తకాన్ని ఆయన సతీమణి సుభాషిణికి అంకితం చేశారు. భక్తికి ఏం సమర్పించాలో చెప్తూ, తన కవిత్వంలో అద్భుతమైన విషయాలను తెలియజేశారు మరాఠీ కవయిత్రి కాన్హొపాత్రా. ''నువ్వు/సంతలో భక్తిని కొనలేవు/అడవుల్లో భక్తిని వెదకలేవు/భక్తికి బదులుగా/నీ హృదయాన్ని సమర్పించాలి''

**బెంగాలీ బౌల్ కవిత్వం, మియా కవిత్వం :**

పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లో ప్రసిద్ధిగాంచిన బౌల్‌ల కవిత్వాలను 'బెంగాలీ బౌల్ కవిత్వం' పేరుతో తెలుగు పాఠకులకు పరిచయం చేశారు అనువాదకులు ముకుంద రామారావు. మొత్తం 80 మంది బౌల్ కవులు రాసిన 170 కవితలను అనువదించారు. 'నాకు ఇష్టమైన బౌల్ కవిత్వం' పేరుతో రాసిన పరిచయ వాక్యాల్లో బౌల్ కవుల, కవిత్వాల గురించి విపులంగా వర్ణించారు. అలాగే, మియా కవిత్వం పేరుతో రామారావు అసోమియా ముస్లిం కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. ''మియా అనేది అస్సాంలోని నదీతీర ప్రాంతంలో నివసించే ముస్లిం ప్రజల సమూహం. అస్సాం వలసదారుల రాష్ట్రం. బెంగాల్ నుంచి అస్సాంకు మియాల వలస 19వ శతాబ్దం చివరి భాగంలో మొదలైంది. వారంతా అస్సామీనీ తమ మాతృభాషగా అంగీకరించారు. తమను తాము అస్సామీలని గర్వంగా చెప్పుకుంటారు. మియా కవులు చాలా మంది అస్సామీ భాషలోనే కవితలు రాస్తారు.'' అని ప్రముఖ మియా ఉద్యమ కవి డా. హఫీజ్ అహ్మద్ 'మియా కవిత్వం-

%కొన్ని మాటలు' అనే శీర్షికలో వెల్లడించారు. 'అస్సాంలో పౌరసత్వ పోరాటం ఆవేదనగా మియా కవిత్వం' అనే పేరుతో ముకుంద రామారావు రాసిన పరిచయ వాక్యాల్లో అస్సామీల వేదన, పౌరసత్వం కోసం వారు పడుతున్న యాతనను కళ్లకు కట్టినట్టు తెలియజేశారు.

**అదే నీరు (వందమంది జాతీయ, అంతర్జాతీయ కవుల అనువాద కవిత్వం):**

ఇదివరకే ముకుంద రామారావు 'అదే ఆకాశం, అదే గాలి, అదే నేల, అదే కాంతి' పేర్లతో దేశ, విదేశాల కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారని తెలుసుకున్నాం కదా. పంచభూతాల్లో చివరిదైన 'అదే నీరు' పేరుతో వందమంది జాతీయ, అంతర్జాతీయ కవుల జీవిత విశేషాలు, వారి కవితలను తెలుగులోకి అనువదించారు. నెల్లూరు నుంచి వెలువడిన విశాలాక్షి పత్రికలో ఆయన దాదాపు ఎనిమిదేళ్లపాటు పరిచయం చేసిన జాతీయ, అంతర్జాతీయ కవుల కవిత్వాలను పుస్తక రూపంలో తీసుకువచ్చారు. 640 పుటల్లో 43మంది జాతీయ, 57మంది అంతర్జాతీయ కవుల పరిచయాలు, 700 కవితలను పేర్కొన్నారు. 'ఏదీ మారలేదు' అనే కవితలో ''ఏది మారలేదు/ఎక్కువవుతున్న జనం తప్ప/వాస్తవం, నమ్మించేవి,క్షణికం, లేనివి/పాతవాటితో బాటు కొత్త నేరాలు/కానీ శరీరం ఏడుస్తూ ఇచ్చే జవాబు మాత్రం/పాత కాలపు గొంతెత్తి అరిచే/అమాయకపు ఏడుపే/అప్పుడూ ఇప్పుడూ''-అని నేటికి మనకు కూడా నిజమనిపించే మారని పరిస్థితుల్ని పోలాండ్ నోబెల్ కవయిత్రి విస్లావా ఎప్పుడో చెప్పగల్గిన విషయాన్ని రామారావు తెలుగులోకి చక్కగా అనువదించారు.

**ముగింపు :**

యల్లపు ముకుంద రామారావు తెలుగులోకి అనువదించిన పుస్తకాలను చదివిన తర్వాత దేశ, విదేశాల సాహిత్యం, కవులతో ప్రయాణం చేసినంత ఆనందం కలిగింది. ప్రపంచంలో తెలియని ఎన్నో అంశాలు, ఎందరో కవుల కవితలను చదివే గొప్ప భాగ్యం లభించింది. ఇంతటి ఉత్కృష్టమైన గ్రంథాలను తెలుగువారికి అందించిన ముకుంద రామారావుకి యావత్ తెలుగు ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచ సాహిత్యాన్ని, కవిత్వాన్ని తెలుసుకోవాలని, చదువుకోవాలని ఆసక్తి ఉన్నవారు రామారావు తెలుగులోకి అనువదించిన అన్నీ పుస్తకాలను చదివితే, ఎన్నో విషయాలు అవగతమవుతాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగులో కవిత్వోద్యమాలు -తెలుగు అకాడమి.
2. అదే ఆకాశం, అదే గాలి, అదే నేల, అదే కాంతి, అదే నీరు-ముకుంద రామారావు.

❖❖❖

# రాయలసీమ కథానికల్లో సాంస్కృతికాంశాలు - స్త్రీల భాగస్వామ్యం

– వేలూరు భారతి, పరిశోధక విద్యార్థిని, తెలుగుశాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. కోస్తాంధ్ర, తెలంగాణతో పోలిస్తే ఇక్కడి ప్రజల జీవన విధానం వేరు. ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, భాష విభిన్నంగా ఉంటాయి. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడంతో ఆ రాష్ట్రాల సంస్కృతి రాయలసీమపై ప్రత్యక్షంగా ప్రభావం చూపు తున్నది. ఈ నేపథ్యంలో ఒక శతాబ్దపు రాయలసీమ స్త్రీల(1926 నుండి) జీవన విధానాన్ని పరిశీలిస్తే ఎన్నో సాంస్కృతికాంశాలలో వారి భాగస్వామ్యం ప్రతిబింబి స్తోంది. వాటిని రాయలసీమ కథకులు తమ కథల్లో అద్భుతంగా చిత్రించారు. ఆ అంశాలను ఇలా పేర్కొన వచ్చు.

1. ఏరువాక పున్నమి.
2. పశువులతో మహిళలకు ఉన్న అనుబంధం.
3. సంతానం కోసం జమ్మిచెట్టుకు పూజ చేయుట.
4. మొలకల పౌర్ణమి పర్వదినం.
5. జాతరలు.
6. బసివిని.
7. బూతు జాతర.

వంటి సాంస్కృతికాంశాలు కథానికల్లో కనిపిస్తున్నాయి. వీటిని రేఖామాత్రంగా ఈ వ్యాసంలో పేర్కొనడం జరిగింది.

## ఏరువాక పున్నమి :

వర్షఋతువులో వచ్చే జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమను రాయల సీమ రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకుంటున్నారు. ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభమని అర్థం. ఆ రోజును రైతులు సాంప్రదాయకంగా పండుగలా జరుపు కుంటారు. ఆ రోజు ఎద్దులను, నాగలిని శుభ్రంగా కడిగి చక్కగా అలంకరిస్తారు. పొంగలి పెడతారు. రైతులందరూ సామూహికంగా ఎద్దులను, నాగలిని ఊరేగింపుగా తీసుకొని పొలానికి వెళ్తారు. ఇందులో స్త్రీలదే ప్రధాన భూమిక. రైతులు ఆ రోజు మడక, ఎద్దులను పూజించి పప్పు బెల్లాలతో వెళ్లి పొలంలో కొంద్రెదున్నుతారు. అక్కడొక రాయి పెట్టి దాన్ని ఇష్టదైవంగా భావించి పూజిస్తారు.

ఈ అంశాన్ని కథకుడు డా॥వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు. " వర్షం బాగా కురిసింది. భూమి చదునైంది. రైతులంతా కాడిమాన్లు, బండ్లు శుభ్రం చేస్తాండారు. ఇంటి ఆడవాళ్లు పసుపు కుంకాలతో ఎద్దులను, బండ్లనూ పూజిస్తున్నారు. దిష్టితీసి టెంకాయలు కొడుతున్నారు. కదిలేబండ్లకు ముత్తైదువులు ఎదురొచ్చి శుభసూచికాన్ని తెలుపుతున్నారు " అని అంటాడు.

ఏరువాకలో మగవారిది శారీరక శ్రమ అయితే స్త్రీలది సాంస్కృతిక విధానం. శ్రమ, సంస్కృతి ఏకమైతే ఆ కార్యక్రమానికి పరిపూర్ణత లభిస్తుంది. శ్రమ భవనమైతే సంస్కృతి దానికి అలంకరణ. ఇల్లు ఎంతగొప్పగా నిర్మించినా అలంకరణ లేకుంటే అది రాణించదుకదా!

## పశువులతో మహిళలకున్న అనుబంధం :

రైతులు ఎద్దులనుపయోగించి వ్యవసాయ పనులు చేస్తారు. ఆ తర్వాత వాటికి మేత వేసి తమ పనులకు వెళతారు. అయితే స్త్రీలు వాటికి కుడితి తాగించడం, పేడ, గంధరం తోయడం, పాలు పిండడం లాంటి పను లన్నీ చేస్తారు. వాటి దూడలను తమ బిడ్డలతో సమానంగా చూస్తారు. వాటిని పూజిస్తారు. అందుకే స్త్రీలు పాలు పితుకుటకు వెళితే అవి కదలకుండా ఉంటాయి. అదే మగవారు వెళితే పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అంటే దీని ద్వారా పశువులతో మహిళలకున్న అనుబంధం ఎలాంటిదో చెప్పవచ్చు. దీనికి నిదర్శనంగా చక్రవేణు రచించిన 'కసాయి కరువు' కథను పేర్కొనవచ్చు.

నాగమ్మ ఇంటి యజమాని. ఆమె ఇంట్లో కర్రావు ఉంటుంది. కరువు కారణంగా ఊర్లోని వారందరూ పశువులను అమ్ముకుంటుంటే తానూ అమ్ముకుంటుంది. కొన్నవారు పట్టుకువెళ్తుంటే నాగమ్మ ఆవేదన చెందుతుంది. ఆ సన్నివేశాన్ని కథకుడు ఇలా తెలిపాడు.

“నాగమ్మ కన్నార్పకుండా కర్రావు దిక్కు చూస్తూ నిల్చుంది. కర్రావు నాగమ్మ దిగులును చూసి చెవులాడించి మోరపైకెత్తి ‘అంబా’ అని అరచింది. నాగమ్మకు అంత వరకు ఆపుకున్న దు:ఖం మరి ఆగిందికాదు. కట్టలు తెగిన నదిలాగా దూకింది. లారీ దగ్గరికి పరిగెత్తేటప్పటికి అది కూడా అప్పుడే కదిలింది. నాగమ్మ ఏడుస్తూ అక్కడే కుప్పలా కూలిపోయింది. తిమ్మయ్యతాత నాగమ్మను పైకి లేపి ఓదారుస్తూ ఇంటికి తీసుకొచ్చాడు” అని అంటాడు.ఈ సన్నివేశం ద్వారా ఆవుకు, మహిళా యజమానికి ఎంతటి అనుబంధం ఉందో అర్థమవుతుంది. ఇది ఒక్క నాగమ్మ అనుభవమే కాదు. ప్రతి రైతు అనుభవం. వారు ఆడవారు కావచ్చు. మగవారు కావచ్చు.

### సంతానం కోసం జమ్మిచెట్టుకు పూజ చేయుట :

సంతానం కలుగని దంపతులు గ్రామదేవతలకు, చెట్లకు పూజలు చేయడం, గోవుకు పూజ చేయడం ఆనవాయితీగా వస్తున్నది. జాతరలు, తిరునాళ్లలో గుడి చుట్టూ పొర్లు దండాలు పెట్టడం, చెట్లకు మీరు గట్టడం వంటివి చేస్తుంటారు. ఇందులో పురుషుల కంటే స్త్రీల పాత్రే ఎక్కువగా ఉంటుంది. ఈ సంస్కృతి రాయలసీమ అంతటా విస్తృతంగా ఉంది. చిత్తూరు జిల్లా వాళ్లందరూ రెడ్డెమ్మ తల్లికి, కడపజిల్లా వాళ్లు నాగారపమ్మకు, అనంత పురం జిల్లా వాళ్లు సుంకులమ్మకు, కర్నూలు జిల్లావాళ్లు మద్దిలేటికి మొక్కుకుంటారు. వీరేగాక ఇంకా చాలామంది గ్రామ దేవతలున్నారు. ఆయా దేవతలకు మొక్కి పూజలు చేసేది స్త్రీలే. పురుషులు కేవలం తోడుగా ఉంటారు. ఈ విషయాన్ని డా॥ వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు.

“తన ఖాళీ కడుపులో ఒక కాయనైనా కాయించాలని వేడుకుంటూ... తనలాగే కొందరు ఆడవాళ్లు తిరుగుతున్న జమ్మిచెట్టు చుట్టూ రెండు చేతులూ జోడించి పరమ పవిత్రంగా జానకమ్మ ప్రదక్షిణలు చేస్తోంది. అట్నుంచి అటే ఇంకొంచెం ముందుకెళ్లి చాలా మంది ఆడవాళ్లలాగే తను కూడా ఎత్తైన పుట్టకు పసుపుదారం చుడుతోంది. పుట్టకు పాలుపోసి నూగులుంటలను ప్రసాదంగా పెట్టి ప్రార్థిస్తోంది. పుట్ట మన్ను తన కడుపుకు కొంత రాసుకొని మనసులో నిండుగా తన గర్భసంచిలో ఓ నలుసుపడాలని వేడుకొంది” అని తెలిపాడు. ఇక్కడ సంతానం కోసం స్త్రీ తపన పడిందేగానీ మగవాడు మాత్రం పట్టించుకోలేదు. పిల్లలు పుట్టకపోతే దానికి కారణంగా ఆడవారినే బాధ్యులను చేస్తున్నది ఈ సమాజం. ఈ ధోరణిలో మార్పు రావాల్సివుంది.

### మొలకల పౌర్ణమి పర్వదినం :

రాయలసీమ ప్రాంతంలో జరుపుకునే జానపద పర్వదినం మొలకల పౌర్ణమి. ఈ పండుగ ఇతర ప్రాంతాల్లో జరుగుతున్నట్లు ఆధారాలు లేవు. ఇది రాయలసీమకే ప్రత్యేకం. ఈ  పండుగ జరుపుకునే తీరుతెన్నులను డా॥వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు.

“వయసులోని కన్నె పిల్లలంతా బహుచక్కగా పున్నమినాడు నవ ధాన్యాలను మొలకలను తెప్పించడంలో పోటిపడినారు. మున్నెప్పుడో పుట్టమన్ను తెచ్చి దాంట్లో అన్ని రకాల ధాన్యాలను పోసి పున్నమినాడు గుడిలోకి తెచ్చారు. నానబెట్టిన బియ్యంలో నల్ల నూగులు బెల్లం కలిపిన ప్రసాదం పంచుతారు” అని తెలిపాడు.

అన్ని పండుగల వలె ఈ పండుగను కూడా రాయల సీమ పల్లె ప్రజలు చాలా నియమ నిష్టలతో జరుపుకుంటారు. నవధాన్యాలను చిన్న కుండీల్లో పదిరోజుల ముందే పోస్తారు. వాటి మొలక ఏపుగా వస్తుంది. ఆ రోజు రాత్రి వెన్నెల్లో ఆడపిల్లలు ఆ కుండీలను ఎత్తుకొని కుటుంబ పెద్దల సమాధుల వద్దకు వెళ్లి సమాధులపై పెడతారు. టెంకాయలు కొట్టి సమాధులకు పూజ చేస్తారు. తమను ఆశీర్వదించాలని దివంగతులను ప్రార్థిస్తారు. రాత్రి 8 గం॥ పైన ఇంటికి చేరి భోజనాలు చేసి

యువతులు, మహిళలు తిరుగుడు జక్కీలు, కోలాటం వంటి ఆటలు ఆడతారు. మగవారు కబడ్డీ ఆడతారు. యువకులు వివిధ చెట్ల వేర్లను బాగా ఎండబెట్టి, బొగ్గులతో కలిపి నూరి పొడిచేస్తారు. దానిలో రాళ్ల ఉప్పు కలుపుతారు. ఆ మిశ్రమాన్ని చిన్న సంచుల్లో పోసి కుడతారు. దాన్ని దారంతో కడతారు. దానికి నిప్పు పెడతారు. తాడుతో ఆ సంచిని తిప్పుతుంటే వివిధ రంగులతో నిప్పులు వెలుగుతాయి. ఆ దృశ్యాన్ని చూడడానికి రెండు కళ్లు చాలవని చెప్పవచ్చు. రాయల సీమ ప్రాంతంలో చనిపోయిన కుటుంబ పెద్దలకు ఎంత గౌరవం ఇస్తున్నారో, వారికి ఎలా కృతజ్ఞతలను చెబుతున్నారో, వారిని ఎలా స్మరిస్తున్నారో పర్వదినం నిర్వహించడం ద్వారా వెల్లడౌతోంది.

**జాతరలు :**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చాలా జాతరలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే రాయలసీమలోనూ జాతరలు జరుగుతున్నాయి. ఇక్కడ జరిగే జాతరలు ఇతర ప్రాంతాల్లో జరిగే జాతరలకు విభిన్నంగా ఉంటున్నాయి. ఇక్కడ ఎక్కువగా గ్రామ దేవతలకు జాతరలు జరుగుతాయి. వాటిలో ప్రధానమైనవి గంగమ్మ జాతర, ద్రౌపదమ్మ జాతర, నాగారపమ్మ, ఉలిగానప్ప జాతర ప్రముఖమైనవి. ఈ జాతర్లలో జంతువధ యథేచ్ఛగా సాగుతుంది.ఈ నేపథ్యంలో చెప్పుకోదగిన జాతర అంకాళమ్మ జాతర ఈ జాతర జరిగే తీరు తెన్నులను డా॥వేంపల్లి గంగాధర్ ఇలా తెలిపాడు.

"అంకాళమ్మ దేవలానికి పెద్ద కథే ఉండాది. రాయల కాలంలో సామంతుడిగా ఉండిన భూమి ఇది. వర్షాలు పడక రాజ్యమంతా కరువు కమ్ముకుంటే ప్రజల కష్టాలు చూడలేక ఆ ప్రభువు దండకారణ్యం నుంచి పెన్నానదికి సొరంగం తవ్వించి నీటి ఊట మళ్లించినాడని చెప్పుకుంటారు.. జాతరప్పుడు ఏ రకంగానూ, ఏ హానీ ఎవ్వరికీ కలగకపోవడం ఆ అంకాళమ్మ తల్లి మహిమే అంటారు. మూడు రోజులు జరిగే జాతర్లో శిలబండి ప్రత్యేకమైనది" అంటాడు కథకుడు. శిలబండినే చాందినీ బండి అంటారు. దాన్ని చూసి తరించాల్సిందే గానీ, వర్ణించడానికి మాటలు చాలవు. ఇలాంటి జాతరలు రాయలసీమలో రెండు వందలకు పైగా జరుగుతాయని చెప్పవచ్చు. ఈ శిలబండికి చేసే పూజాది కార్యక్రమాలు, బండి బయలు దేరేటప్పుడు స్త్రీలు ఎదురు రావడం సంస్కృతిలో ఒక భాగం. ఆ బండిలో ముత్తైదువలను ముందుగా ఎక్కించుకుంటారు. ఊరందరికి భోజనాలు పెట్టడం, ఇలవేల్పుకు పూజలు చేయడం, చాందిని బండి వెన్నంటి ఉండడం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు స్త్రీల ఆధ్వర్యంలోనే జరుగుతాయి.

**బసివిని :**

ఈ బసివిని వ్యవస్థ రాయలసీమతో పాటు ఇతర తెలుగు ప్రాంతాల్లోనూ, కర్నాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఉన్నది. ఇలా బసివినిగా మారిన స్త్రీల జీవితం చాలా దుర్భరంగా ఉంటుంది. వీరిని ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. బసివిని, దేవదాసీ, మాతంగి, మాతమ్మ, జోగిని అంటూ పిలుస్తారు.

దేవదాసీల గురించి ఎం.ఆర్. అరుణ కుమారి తన 'పోస్ట్ చేయని ఉత్తరం' కథలో ఇలా తెలిపారు. "ఒక సారంటు దేవదాసీ శృంఖలాలను తగిలించుకున్నాక మరో పురుషుడి భార్య కావడం అనే విశృంఖలత నాకు లేదని తేల్చి చెప్పారు పంచాయితీలో" అంటూ ఆవేదన చెందుతుందని కథకురాలు తెలిపారు. దేవదాసీగా మారిన స్త్రీని ఊరి పెద్దతో పాటు ఊరి వారందరూ తమ భోగ వస్తువుగా వాడుకుంటారు. దీని వల్ల ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నా పట్టించుకునే నాథుడు ఉండడు. కొందరి లైంగిక స్వార్థం పేదల, దళితుల అమాయకత్వం కలగలిసి రూపుదిద్దుకున్న దుర్మార్గపు ఆచారమే బసివిని.

**బూతు జాతర :**

రాయలసీమలో జరిగే అత్యంత హేయమైన జాతర్లలో బూతు జాతర ఒకటి. అయితే దానికి ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం లేదు. సంతానం లేని స్త్రీలు నగ్నంగా పార్శ్వనాథుని విగ్రహాన్ని కౌగిలించుకుంటారు.

అలా చేస్తే సంతానం కలుగుతుందని ప్రజలు గాఢంగా నమ్ముతున్నారు. ఇది పరిమిత ప్రాంతాల్లోనే ఉన్న ఆచారం. ఈ అంశాన్ని గురించి డా॥ వేంపల్లి గంగాధర్ తన "ఏడు లాంతర్ల సెంటర్" అనే కథలో తెలియజేశాడు.

**ముగింపు :**

ఈ విధంగా రాయలసీమలో వివిధ సాంస్కృతికాంశాలు వందలాది సంవత్సరాల నుంచి పరంపరగా వస్తున్నాయి. వీటిలో స్త్రీలది అద్వితీయమైన స్థానం. అయితే బసివిని ఆచారాన్ని సమర్థించలేము. దాన్ని రూపుమాపుటకు ప్రభుత్వం, ప్రజలు చిత్తశుద్ధితో కృషి చేయవలసి ఉంది. శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకు పోతున్న ఈ రోజుల్లో ఇలాంటి మూఢవిశ్వాసాలకు స్త్రీలను బలిచేయడం అత్యంత హేయమైనదిగా చెప్పవచ్చు. దీనికి స్త్రీ చైతన్యమే పరిష్కార మార్గం.

**ఆధార గ్రంథాలు :**

1. మొలకల పున్నమి, డా॥ వేంపల్లి గంగాధం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2015.
2. మా దూదర గూళ్ళు (సం), వత్సల, ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాద్, 2021.
3. నమ్ముకున్న రాజ్యం కథలు, శాంతినారాయణ, విమలా శాంతి ప్రచురణలు, అనంతపురం, 2004.
4. సింగమనేని నారాయణ కథలు, సింగమనేని నారాయణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2006.
5. తెలుగు కథకులు -కథన రీతులు, సింగమనేని నారాయణ,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2014.
6. తెలుగు కథానిక స్వరూప స్వభావాలు, దక్షిణామూర్తి , విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1999.

❖❖❖

# తెలంగాణ సాహిత్యంలో చేనేత వృత్తి కథలు - సామాజికత

- వై. శివకుమార్, పరిశోధక విద్యార్థి.

బ్రిటీష్ వాళ్ళు భారతదేశంలో అడుగిడిన తరువాత భారత అర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ఫలితంగా వృత్తి కులాలు ఉత్పత్తి కులాలు స్థిరత్వం లేక విధ్వంసం కావడం ప్రారంభమైనాయి. వృత్తిదారులు మరింత దిగువ భాగంలోకి నెట్టబడ్డారు. తెలుగు సాహిత్యంలో జాతియోద్యమం, సంస్కరణోద్యమం, తదనంత కాలంలో మార్క్సిజం ద్వారా అభ్యుదయ సాహిత్యత రైతు కులాలకు అండగా నిలబడింది. శ్రీశ్రీ ప్రవేశంతో శ్రామిక వర్గాలు చైతన్యం పొందాయి.

కమ్మరి కొలిమి కుమ్మరి చక్రం
జాలరి పగ్గం, సాలెల మగ్గం
శరీర కష్టం, స్ఫురింపచేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి

సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు అంటూ వృత్తి పరమైన చైతన్యంతో కవిత్వం కొత్త దారులు పరచుకొంది. శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్యం ద్వారా ఉత్పత్తి కులాలైన కమ్మరి, గొల్ల, కురుమ మొదలైన కులాల వృత్తులు కూడా సృష్టించబడ్డాయి. వర్గ పోరాట మార్గంలో వృత్తి, కులాల సమస్యలు పరిష్కారమవుతాయని భావించారు. కుల వృత్తుల నైపుణ్యాన్ని వర్ణిస్తూ రచయితలు కుమ్మరి, కమ్మరి, మేదర సాలి, కంసాలి ఇలా అన్ని కుల మతాలపై రచనలు ఆవిష్కరించారు. తెలంగాణ కథాసాహిత్యంలో వచ్చిన కొన్ని ముఖ్యమైన చేనేత వృత్తి కథలను సామాజికతను పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యఉద్దేశ్యం.

'చిరునామా' కథలో జాతశ్రీ ఉదయం నుంచి పనిలో నిమగ్నమై బతుకులను నెట్టుకొస్తున్న నేతన్నల గురించి ఈ కథ రాశాడు.. ఈ కథలో ప్రధాన ఇతివృత్తం చేనేత వృత్తిదారుల ఆకలికేకలు. వలసలు పోవటానికి ప్రేరేపించే కారణాలను ఈ కథలో పొందుపరిచాడు.

చేనేత వృత్తిని నమ్ముకొని జీవించేవారు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో, వారి కష్టాలను, కన్నీటి కడగండ్ల వెనక దాగిన కారణాలను 'చిరునామా' కథలో జాతశ్రీ ప్రస్తావించిన తీరు మహాద్భుతం. ఉదయం నుంచి పనిలో నిమగ్నమై బతుకులను నెట్టుకొస్తున్న నేతన్నల గురించి ఈ కథ రాశాడు. ఈ కథలో ప్రధాన ఇతివృత్తం చేనేత వృత్తిదారుల ఆకలికేకలు. వలసలు పోవటానికి ప్రేరేపించే కారణాలను ఈ కథలో పొందుపరిచాడు. యాడికెంది?... బతుకుదెరువు... బతుకుదెరువా !.......యాడుంది ? 'యాడలేదు ఉందనుకుంటూ ఉరుకులాటమే తప్ప, ఒరిగేదేం ఉండదు' అని వలస జీవితాన్ని చిత్రీకరించారు. కష్టానికి తగిన ఫలితం దొరకక పోతే వలసలు పోవాలని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే జనాలు అనుకుంటారని జాతశ్రీ ఈ కథ ద్వారా స్పష్టంగా చెప్పాడు. మగ్గాలే మమ్మల్ని బతికిచ్చినయ్. ఊరోళ్లందరి మానాలు మన శాలోల్లే కాపాడిను. నెంబరు పంచెలూ, కలనేత కోకలూ, దొడ్డుదారం దుప్పట్లు మన మగ్గాల మీదన నేసినం అంతేనా ? అగ్గిపెట్టెలో పట్టే ఆరుమూరల కోక . వేలి ఉంగరంలో దూరే కోక కుట్టులేకుండా రయికా, సొక్కా... అబ్బో. ఆ వయిభోగం ఏమని జెప్ప ? నేత పనోడు బయటకెళితే, పటేల్ దొరకున్నంత గిరాకీ ఉండేది. పత్తి ఈడదే ! ... నేత ఈడదే..... ఏకులు వొదకటం కాన్నుంచి. ఇచ్చుల్ని రంగుల ముంచి. పడుగు, అయినంక గెంజి బెట్టి సరి దువ్వి.... అన్ని పనులూ యింటిల్లాదులం జేసేది. నేతతోనే నీతిగా బతుకెళ్ళి దీసినం గాదూ ! ఆ రోజులూ పోయినయ్ !" అని నేతగాని వృత్తి జీవితాన్ని బలంగా చిత్రీకరించారు. బట్టలను నేసేవాళ్ళని శాల వాళ్ళుగా గుర్తిస్తారు. వీరి పని బట్టలనెయ్యటం, బట్ట కుట్టడం, రకరకాల బట్టలు, రంగురంగుల దుస్తులను తయారుచేస్తూ ఉదయం నుండి పనిలో నిమగ్నమవు

తారు. నేత పనివారు పడే అవస్థలు ఎలా ఉంటాయో జాత శ్రీ ఈ కథలో పేర్కొన్నాడు.

చేనేత వృత్తిదారుల బతుకులు బుగ్గిపాలవటంతో బొంబాయి, చీరాల, భీవండి తదితర ప్రదేశాలకు వలసలు వెళుతున్నారని చెప్పారు. అదేవిధంగా పనిలేని కాడ వస్తులుండే బదులు, నాల్గబ్బులు దొరికే కాడ బతికితేంది? రేపో మాపో .... సెల్లెళ్ల పెళ్ళిళ్ళు సెయ్యాల్నా ..... అని పేదరికం గురించి ప్రస్తావించాడు. మగ్గం మీద ఆధారపడి జీవించే వెలుగు బతుకుల్లోకి చీకటి ప్రవేశించి ఎలా ఛిద్రం చేసిందో రచయిత స్పష్టంగా చెప్పాడు. బట్టలకు గిరాకీ లేని సమయంలో రాట్నానికి పని ఉండదని, ఆ ఖాళీ సమయంలో బీడిలు చుట్టుకుంటూ కాలం వెళ్ళదీస్తారని చెప్పాడు. బీడీలు చుట్టిన వారి పరిస్థితి కూడా చిత్రీకరించారు. నేతగాళ్ళంతా జీతగాళ్ళయి పోతాంగాదూ ... ఆటోలు దోలుకుంటూ, సుతారి పనులు జేసుకుంట... ఓపికున్నోళ్ళు దేశాలు తిరుగుతున్నారు' అని జాతశ్రీ చేనేత కార్మికుల పరిస్థితి మగ్గాల అవస్థని ఈ కథల్లో చిత్రీకరించారు.

## నిరీక్షణ - కాలువ మల్లయ్య :

'నిరీక్షణ' కథలో గ్రామీణ స్త్రీలు వాళ్ళ గుండెల్లో గూడుకట్టు కున్న పవిత్ర ప్రేమ, ఎన్ని కష్టాలు వచ్చిన ఆ ప్రేమను గుండెలో నిలుపుకొని బతకడం, మనసిచ్చిన వ్యక్తికే తనువు అర్పించాలనే భావనను కాలువ మల్లయ్య కథలో చిత్రించారు.

తెలంగాణాలో పద్మశాలీలు కుల వృత్తి వల్ల గిట్టుబాటు లేక బొంబాయి, భీవండి, షోలాపూర్ తదితర ప్రాంతాలకు వలస వెళ్ళారు. అక్కడ మరమగ్గాలపై పనివెతుక్కుని అక్కడే జీవించారు. ఈ కథలో కిష్టయ్య, రుక్కమ్మ బావ మరదళ్ళు, కిష్టయ్య భీవండి వెళ్ళి కొంత సంపాదించుకొని వచ్చాక రుక్కమ్మను పెండ్లి చేసుకుంటానని చెప్పి వెళ్తాడు. అట్లా వెళ్ళిన వాడు యేడాదిన్నర పాటు అక్కడే ఉంటాడు. ఇంటి వద్ద తన బావరాక కోసం రుక్కమ్మ ఎదురు చూస్తూ గడుపుతుంది. ఇంతలో భీమండిలో మతకలహాలు చెలరేగడంతో అమాయకుడైన కిష్టయ్య మరణిస్తాడు. ఈ వార్త తెలిసిన రుక్కమ్మ మతి చలించి పిచ్చిదవుతుంది. ప్రతిరోజూ తలారస్నానం చేసి ఉతికిన చీరకట్టుకొని, మల్లెపూలు సిదనిండా పెట్టుకొని ముస్తాబై రాని బావకోసం ఎదురుచూస్తూనే ఉంటుంది.

## ఎదురుచూపు - కాలువ మల్లయ్య :

కాలువ మల్లయ్య పద్మశాలీల సమస్యలను వివరించిన మరోకథ 'ఎదురుచూపు'.పద్మశాలీల, చేనేత కార్మికుల దీనమైన జీవితం, వలసలు పోవాల్సిన అనివార్యత భీవండికిగాని, గల్ఫ్ దేశాలకు గాని పోయిన క్రమం, పడిన బాధలు, అనుభవించిన వేదన, భీవండిలో జరిగిన మతకలహాల్లో మృత్యువాత పడ్డ యువకులు మొదలైన అనేక చారిత్రక అంశాలు ఈ కథల్లో కనబడతాయి.

## గోస - పెద్దింటి అశోక్‌కుమార్ :

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'గోస' కథ పద్మశాలీల ఆశ్రిత కులం వారైన సాధన శూరుల గురించి తెలియ జేస్తుంది. "ఒకవైపు కులవృత్తులే నాశనమైపోతుంటే ఇక ఆశ్రిత జాతులను పట్టించుకునేవారెవరు ? పద్మశాలీలకే పనులు లేక, పస్తులుంటుంటే వారినాశ్రయించుకొని బతికే సాధన శూరులు దిక్కులేక గారడీ చేసుకు బతికే వీలు కూడా లేక చివరకు బిచ్చగాళ్ళుగా మారిపోతున్న దయనీయ కథనమే ' గోస". వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ప్రజానీకానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న చేనేత రంగం అభివృద్ధి ద్వారా భారతీయ చేనేత కారుల నైపుణ్యాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవచ్చు.

ప్రత్యక్షంగా పరోక్షంగా నేటికీ కోటి మందికి పైగా చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ రంగాన్ని మరింతగా ప్రోత్సహించి అభివృద్ధిపరిస్తే అదనంగా మరో కోటి మందికి ఉపాధి లభిస్తుంది. పద్మశాలీయుల సునిశిత కౌశల్యానికీ, సూక్ష్మ కులవృత్తి చేనేత పరిశ్రమ, తరతరాలుగా భారతీయ సామాజిక - ఆర్థిక - రాజకీయ వ్యవస్థకు పట్టుగొమ్మగా నిలిచి ఎన్నో ఇతర కులాలకు తాను తింటూ పట్టెడన్నం పెట్టింది.

**తెగిన బంధాలు - పెద్దింటి అశోక్‌కుమార్ :**

'తెగిన బంధాలు' ''కులవృత్తులు ఈనాడు కాదు ఏనాడో పోయినయి కనీసం పెండ్లితో ముడిపడ్డ ఒకటి రెండు పనులైనా పట్టణాల్లో ఎప్పుడో పోయినాయి అవి ఇపుడు పల్లెలో కూడ''. అన్న వాక్యాలు గ్రామాలలో వస్తున్న మార్పును సూచిస్తున్నాయి. యాంత్రికత పెరిగిపోవడం, అదీ చౌకగా పని ముగిసిపోవడంతో మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారి పోయాయి. మానవీయ సంబంధాలకు పెట్టనికోటగా ఉండే పల్లేటూర్లలోకి కూడ ఈ ఆర్థిక సంబంధాలు చొరబడి, మానవ సంబంధాలను దెబ్బతీశాయి. దీనితో చేనేత కులవృత్తులకు ఆదరణే లేకుండా పోయింది.

**అమ్మపోరాటం - పెద్దింటి అశోక్‌కుమార్ :**

ఈ కులవృత్తుల వారు యంత్రాలతో పోటీపడలేక పోయారు. అవి ఎంతో వేగంగా, ఎంతో సమర్థవంతంగా, ఒకే రోజులో ఎక్కువ పని చేసేవి కులవృత్తులనే ఆశ్రయించుకున్న వారు వాటితో పోటీ పడలేకపోయారు. పైగా యంత్రాలసాయంతో పనులు చేయించుకుంటే ఖర్చులు కలిసివస్తాయనే భావన మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వారిలో పెరిగిపోవడం వల్ల చేనేత కుల వృత్తులకు ఆదరణ తగ్గిపోయింది. ఇది నేటి పరిస్థితి. ఇలానే కాలం ముందుకు సాగితే ఈ వ్యవస్థలో ఇంకా ఎలాంటి మార్పు వస్తుందో ఊహించడం సాధ్యమే అని 'అమ్మపోరాటం' కథ ద్వారా తెలియజేశారు.

**పరాధీన - కాలువ మల్లయ్య :**

తెలుగు సాహిత్యంలో బి.సి.ల జీవితాలను చిత్రించిన వాటిలో ఎక్కువగా చేనేత వారిని గురించి కనిపిస్తుంది. కారణం వారు బిసిలలో ముందు నుంచి కొంత అక్షరజ్ఞానం కలిగిన వారు కాబట్టి. అలాగే ప్రపంచీకరణ ద్వారా అతి కష్టాలు ఎదుర్కొంటున్న వారిగా కూడా వారినే ముందుగా చెప్పవచ్చు. ఈ చేనేత వారిని గురించి వచ్చిన కొన్ని కథలను పరిశీలించినపుడు చాలా విషయాలు కని పిస్తున్నాయి. అందులో కాలువ మల్లయ్య 'పరాధీన' (1991) చేనేత వారి కులంలో ఉన్న స్త్రీల బ్రతుకులను వివరించిన కథ.

పరాధీన జీవితాలు, ఆర్థిక సమస్యలు నేపథ్యంగా రాసిన 'ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు' సంపుటిలో 'పరాధీన' గొప్ప కథ. అందులో మల్లప్ప పట్టుపీతాంబరం కోరిక మూడు తరాల్లోనూ తీరదు. తల్లిదండ్రులైనా, భర్త అయినా, కొడు కెనా, మనషలైనా ఎవరూ తీర్చ లేదు. కారణం ఒక్కంటె.... దరిద్రం !! అరవై ఏళ్ళ పరాధీనత. స్త్రీకి ఆర్థిక స్వాలంబన లేకపోవడంతో కన్న తండ్రి మీద కట్టుకున్న వాడి మీదా,కన్న కొడుకు మీద, మనుమల మీదా ఆధారపడాల్సి వస్తున్న వైనాన్ని పరాధీన' కథ చిత్రించింది. నేత కార్మిక కుటుంబంలో జన్మించిన మల్లవ్వకు పట్టు పీతాంబరం కట్టుకోవాలన్న కోరిక యవ్వనంలోకి అడుగు పెట్టాక కల్గుతుంది. అయితే ఆ కోరిక మూడు తరాలలో కూడ తీర్చుకోలేక పోతుంది. తల్లిదండ్రులు, భర్త, కొడుకు ఆమె కోరిక తీర్చలేకపోవడం వెనుక ఆర్థిక సమస్య దాగి ఉన్నప్పటికీ మూడు తరాలలో అరవై ఏళ్ళ పరాధీన బ్రతుకును మల్లవ్వ బతుకాల్సి వచ్చింది. రచయితకు రచయితకు సమకాలీన సామాజిక చైతన్యం ఉండాలి. అప్పుడే సమకాలీన సమాజం ఆ రచనల్లో ప్రతిఫలిస్తుంది. కాలువ మల్లయ్యకు ఈ చైతన్యం ఉంది. అందుకే ప్రతి సామాజిక మార్పుకు స్పందించాడు. ఆ స్పందనకు అక్షర రూపమిచ్చి దాన్ని కథగా మలిచాడు.

**కొత్తపాట - అనిశెట్టి రజిత :**

'కొత్తపాట' కథలో అనిశెట్టిరజిత పద్మశాలి కులంలో చైతన్యవంతమైన ఒక మహిళ కష్టపడి చదువుకొని సామాజిక న్యాయం కోసం ప్రజల జీవితాలలో వెలుగు కోసం నిత్య చైతన్యంతో అనేక ప్రాంతాలు పర్యటిస్తుంది. ప్రజలను అధ్యయనం చేస్తుంది. వారికి అనేక విధాలుగా సహకరిస్తుంది... ప్రజల జీవితాలు బాగుపడడానికి ఏదైనా చేయాలని నిరంతర తపనను రచయిత్రి అక్షరీకరించారు. రచయిత్రి అనిశెట్టి రజిత స్వయంగా జీవితాన్ని ఇలా ప్రజలకు అంకితం చేస్తూ జీవిస్తున్న కార్యశీలి. తెలుగు

సాహిత్యంలో ఇలా సాహిత్యంతో పాటు మరో మాటలో చెప్పాలంటే సాహిత్యం కన్నా మిన్నగా సమాజం కోసం కృషి చేసే రచయితలు సాహిత్యాన్ని సామాజిక కర్తవ్యంలో భాగంగా భావిస్తూ రచనలు చేస్తుంటారు. అందువల్ల ఇలాంటి వారి రచనలు కేవలం సాహిత్యంగా పరిగణించలేం. అవి సామాజిక చరిత్ర పరిణామాల చరిత్రలో అంతర్భాగం. అనిశెట్టి రజిత 'కొత్తపాట' కథ ద్వారా పద్మశాలి కులంలో చైతన్యవంతమైన ఒక మహిళ కష్టపడి చదువుకొని సామాజిక న్యాయం కోసం ప్రజల జీవితాలలో వెలుగు నింపడానికి చేసిన ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. ఈ కథా నాయకురాలు చదువుకుని జీవితాన్ని గెలిచిన తీరు కనిపిస్తుంది.

## బాధ్యత - సబ్బని లక్ష్మీనారాయణ :

కరీంనగర్ జిల్లాకు చెందిన సబ్బని లక్ష్మీనారాయణ 'బాధ్యత' కథలో చేనేత కార్మికుల ఆర్థిక, సాంఘిక జీవితం చిక్కిపోయిన క్రమంలో బాధ్యతలను, సాంప్రదాయాలను పాటించలేని దుస్థితిని చిత్రించారు. చేనేత కుటుంబాల్లోని దుస్థితిని సబ్బని లక్ష్మీనారాయణ బాధ్యత' (2005) కథలో చిత్రించారు. నారాయణ చేనేత కార్మికుడు. నలుగురు ఆడపిల్లలతోడుగా పుట్టిన నారాయణ చిన్నప్పుడే తండ్రి మరణించడంతో ఎన్నో కష్టాల్ని అనుభవిస్తాడు.సాంచెల మీద పని చేయాల్సి రావడం, కరెంట్ సరిగ్గా ఉండక పోవడంతో కుటుంబం భారంగా తోచేది. అతని భార్య శాంత బీడీలు చేయడంతో అతికష్టం మీద పిల్లల్ని పోషిస్తూ వస్తాడు. బతకడమే కష్టమైన దశలో ఆడబిడ్డలకు పెట్టే లాంఛనాలకు ఇబ్బంది పడుతాడు. కుటుంబావసరాలకు భార్య, చిల్లర ఖర్చు నిమిత్తం తల్లి, కొత్త బట్టలు, బడి ఫీజులు, బొమ్మలకోసం పిల్లలు తనను అడిగేవారని, ఇవన్నీ తలచుకుంటే అందరి ఖర్చుల కోసం తానున్నానని, తన కోసం ఎవరూ లేకున్న బాధ్యతలు మాత్రం మిగిలున్నాయని అనుకుంటాడు. ఇట్లా చేనేత కార్మికుడు తనలో తాను పడే సంఘర్షణ ఈ కథలో కనిపిస్తుంది.

## త్రిభుజపు నాల్గోకోణం - ఆడెపు లక్ష్మీపతి :

ఆడెపు లక్ష్మీపతి 'త్రిభుజపు నాల్గోకోణం' కథలో పద్మశాలి జీవితాల్లో కులవృత్తులు కోల్పోయి. అనేక ఇతర వృత్తులు, వ్యాపారాలు చేపట్టి, నష్టాలు సంభవించి జీవితాలు, కుటుంబాలు ఎలా శిథిలమవుతూ వస్తున్నాయో చిత్రించారు. బీసీ కులాల నుండి మధ్య తరగతిగా ఎదుగుతున్న జీవితాలలోని సంఘర్షణను, సంక్లిష్టతను శిల్ప వైవిధ్యంతో చిత్రిస్తున్నారు. పద్మశాలీలకు నష్టాలు వచ్చి జీవితాలు ఎలా శిథిలమయ్యాయో తెలిపే కథ 'త్రిభుజపు నాల్గో కోణం'. రచయిత ఆడెపు లక్ష్మీపతి. ఈ రచయితదే మరోటి 'ముసల్దానిముషా' అనే కథ కూడా పద్మశాలీల జీవితాన్ని చిత్రిస్తుంది.

## ముసల్దాని ముల్లె - ఆడెపు లక్ష్మీపతి :

ఈ రచయిత మరోటి 'ముసల్దానిముషా' అనే కథ కూడా పద్మశాలీల జీవితాన్ని చిత్రిస్తుంది. ఆడెపు లక్ష్మీపతి రాసిన 'ముసల్దాని ముల్లె' కథలో ప్రజల్లో కనిపించకుండా పోతున్న ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను కాపాడే ప్రయత్నం చేశాడు కథకుడు. ముసల్దాని ముల్లెలో ఉన్నవి మాగిన అరటి పండ్లే కాని ఆ పండ్లను ఆరాటంగా తన మనవలకు ఇవ్వాలని దాచుకుంటుంది. మనుషుల మధ్య 'ప్రేమ' అనే బంధం శాశ్వతంగా కొనసాగాలని కోరుతూ అర్థాలు చెప్పలేని, మనసుకు సంబంధించిన భావాలకు ఉనికి లేకుండా చెయ్యొద్దని ఈ కథ ద్వారా కథకుడు కోరుతున్నాడు. ఈ కథల ద్వారా పద్మశాలీల జీవితాలను ఆవిష్కరిస్తూ, వాస్తవ పరిస్థితులను వివరిస్తూ సమాజంలోని మనుషుల ఆలోచనల్లో మార్పు రావాలని కోరుతున్నారు.

## లాకౌట్ - వల్లూరిపల్లి రంగారావు :

గ్రామీణ చేనేత కార్మికుల వలసలను చిత్రించిన కథ వల్లూరిపల్లి రంగారావు రచించిన 'లాకౌటు'. పల్లెసీమలలోను నాగరికతా పరిణామాలు తరతరాలుగా సాగివస్తున్న చేనేత వృత్తులను వదులుకునేలా చేశాయి. తెలంగాణా జిల్లాలోని ఓ మారుమూల కుగ్రామంలో చేనేత వృత్తిచే

జీవించే వ్యక్తి యాదయ్య. పల్లె సీమలలో చేనేత వృత్తులు మూలపడడంతో బ్రతుకుదెరువునన్వేషిస్తూ యాదయ్య పట్టణం చేరి అక్కడొక నూలు మిల్లులో కూలీ అయ్యాడు- కానీ - అచిర కాలంలోనే యజమానుల స్వార్థ దృష్టి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నూలు మిల్లును 'లాకౌటు' దశకు చేర్చాయి. ఆ మిల్లులో పని చేస్తున్న కూలీల బాధలు యాజమాన్యం ప్రకటించిన చట్టవిరుద్ధమైన లాకౌటుతో రెట్టింపయ్యాయి. పల్లెలలో కులవృత్తులకు ఆదరణ లేక కడుపు చేతపట్టుకొని, భార్యాబిడ్డలను వెంటబెట్టుకొని బ్రతుకు తెరువు కోసం నగరాలకు వలస వచ్చిన వృత్తి పనివాళ్ళ పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టయ్యింది - మిల్లు లాకౌట్‌తో. ఈ కథలో ప్రధానంగా కనబడేది యాదయ్య, చంద్రమ్మల కుటుంబం. భర్త యాదయ్య ఇరవై రోజుల క్రిందట సొంత ఊరు వెళ్లాడు. అక్కడున్న తమ పూరిపాక తాలూకు కాళీస్థలం అమ్ముకు రావడానికని. కానీ భర్త ఎంతకూ తిరిగి రాకపోవడంతో చంద్రమ్మ మనసులో అనుమానం బయలుదేరింది. బహుశా ఇక యాదయ్య తిరిగి రాడేమోనని. ఎందుకంటే ఎందరో భర్తలు తమ తమ కుటుంబాలను పోషించలేక అలా నిర్దయగా వదిలేసి తమ దారి తాము చూసు కున్నారు. కాబట్టి. చంద్రమ్మ కుటుంబ స్థితి దయ నీయంగా ఉంది. చిన్నపిల్లలు ఆకలితో నకనకలాడి పోతున్నారు. యాదయ్య తిరిగి వచ్చేటప్పటికి ఆకలి కోరలకు చిక్కిన చంద్రమ్మ కుటుంబం దారుణంగా బలైంది. చంద్రమ్మ చిన్నపిల్ల గొంతు పిసికి చంపి, తను ఉరిపోసుకొని మరణించింది. యాదయ్య భార్యా పిల్లలను పోగొట్టుకొని పిచ్చివానిలా రోదించాడు. ఆ మరునాడు మిగిలిన ఈ వలసలలో బలౌతున్న బడుగు జీవితాలకు దర్పణం. ఇలా గ్రామీణ రైతులు, వృత్తిపనివారు, శ్రామికులు తమ జీవితాలలో అనివార్యంగా ఎదుర్కొం టున్న చేనేత కార్మికుల వలసలను ఇతివృత్తంగా తీసుకొని ఈ కథల్లో రచయితలు వలస సమస్యను వివిధ దృక్కోణాల నుం డీ విశ్లేషించారు వలస అనేది కేవలం వ్యక్తిగత సమస్యగా గాక ఒక సామాజిక సమస్యగా భావించి, ఆ సమస్య వెనుకనున్న సాంఘిక, ఆర్థిక శక్తుల్ని రచయితలు తమ కథల్లో చర్చించారు. ఈ కథలు పాఠకులలో అవగాహనను, రస స్పందనను కలిగిం చడంతో బాటూ-పాలక వర్గాలలో తగిన ఆలోచనకు కలిగించడానికి కూడా సముద్రం -కొట్ల వనజాత: పారిశ్రామీకరణ వల్ల నేత కార్మిక కుటుంబాలు వీధి పాలు కావడాన్ని కోట్ల వనజాత 'సముద్రం' (2008) కథ సూచిస్తుంది. ఈ కథలో మహేష్ నేత కార్మికుడు. మర మగ్గాలు పడి చేనేతకు ఆదరణ తగ్గడంతో పాలమూరు నుండి బొంబాయికి వలస వెళ్లాడు. అక్కడికి వెళ్ళిన కొన్నాళ్ళకే అనారోగ్యంతో ఉన్న భార్యకు వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో ఆమె చనిపోతుంది. అంత్య క్రియలు జరిపంచలేని దుస్థితిలో భార్య మృతదేహాన్ని రహస్యంగా సముద్రంలో వదిలేస్తాడు. పాలమూరుకు తిరిగి వచ్చేటప్పుడు చిన్నకూతుర్ని పోగొట్టుకుంటాడు.

### పొద్దుపొడుపు - వెల్దండి శ్రీధర్ :

తెలంగాణ నేపథ్యంలో చేనేత కార్మికుల దుఃతిని చిత్రిస్తూ పేదరికం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం 'పొద్దు పొడుపు' (2009) కథలో వెల్దండి శ్రీధర్ చిత్రించారు. బాల్రాజు చేనేత కార్మికుడు. తొమ్మిదో తరగతిలో చదువాపి భీవండి వెళ్ళి మరుమగ్గాలపై పని చేస్తాడు. ఈ లోగా భీవండిలో అల్లర్లు జరుగగా తిరిగి ఊరు చేరుతాడు. సిరిసిల్లలో సాంచెలు పడటంతో కుటుంబంతో వెళ్ళి స్థిరపడతాడు. భార్య బీడీలు చుట్టినా, తాను సాంచెలు నడిపినా పస్తుల బతుకే గడుపాల్సి వస్తుంది. కూళ్ళరేట్లు తగ్గడం, కరెంట్ పోవడం వల్ల కూలీ గిట్టుబాటులేక ఇబ్బందులు పడుతాడు. సేటు పగారా ఇవ్వకపోవడంతో మార్కెటంతా తిరిగి ఇంట్లోకి నూకలు కొనడానికి చిల్లిగవ్వలేక, అప్పుపుట్టక వట్టి చేతులతో రావడానికి ముఖం చెల్లక వాగొడ్డుకు వెళ్ళి గౌడును బతిమాలి ఒక సీసా కల్లుతాగి వచ్చి గండంచెలో పడు కుంటాడు. 'అయ్యవ్వకు, పెండ్లాం బిడ్డలకు బుక్కెడు

కూడు కూడా పెట్టక చాతగానోన్ని అయిపోయిన. నాకంటే బిచ్చగాళ్ళు నయం. అడుక్కుతిన్నా యాళ్ళకైన తింటారు..' అని చింతిస్తాడు. భార్య తన అసమర్థతను గురించి తిడుతుంటే మంచంలోంచి లేచి బయటపడి నాంపెల్లి గుట్ట వరకు నడుస్తాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని కాగితంపై రాసి ఒక చెట్టుకు తాడుకట్టి ఉరిపెట్టుకోబోతున్నంతలో తెలంగాణ తల్లి సాక్షాత్కరించి కర్తవ్యం ఉపదేశించినట్లు తోచి నిర్ణయాన్ని మార్చుకొని తెలంగాణ ఉద్యమంలో చావో రేవో తేల్చుకోవాలన్న ఆలోచనలో పడుతాడు.

## న్యూ బాంబే టైలర్స్ - ఖాదీర్‌బాబు :

స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రపంచీకరణ విధానంలో తొలిదెబ్బ దేశీయమైన చేతివృత్తుల పైన, పడింది. చిన్న చిన్న వృత్తులతో బ్రతుకుబండిని నడి పిస్తున్న ప్రజల నడ్డి విరగొట్టిన ప్రపంచీకరణ ప్రయత్నా లను తెలుగు కథా రచయితలు దుయ్యబట్టారు. తెలంగాణ ప్రతి ప్రాంతం నుండి కథలొచ్చాయి. ఒకనాడు పల్లె ప్రజలకు ముఖ్యమైన వ్యక్తి పాత్ర పోషించిన 'టైలర్' వృత్తి రెడీమేడ్ దుస్తుల రాకతో ఎలా, అయోమయంలో పడిందో మహమ్మద్ ఖదీర్ బాబు న్యూ బాంబే టైలర్స్' కథ వివరించింది.

## వైపని - జూకంటి జగన్నాథం :

అందమైన వస్త్రాలు తయారు చేసే సమర్థత గల చేనేత పరిశ్రమ వారు పవర్‌లూమ్స్ వచ్చాక తాము నేస్తున్న బట్టలకు ప్రతిఫలం దొరక్క ఆత్మహత్యలకు పాల్పడు తున్న నిజాన్ని 'వైపని' కథలో జూకంటి జగన్నాథం వివరిం చాడు. రచయిత 'వైపని'లో ఒక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుని చనిపోయిన తీరును తెలియ పరుస్తాడు. భర్త బంబాయిలో చనిపోగా ఇద్దరు పిల్లలతో సక్కుబాయి పడ్డ కష్టాల్ని చూపిస్తాడు. కూతురు పెళ్ళిచేసిన తర్వాత ఏ పనిచేసుకున్నా పొట్టనిండక ఆత్మహత్య చేసుకుని కుటుంబం పూర్తిగా మరణించిన తీరు పాఠకులందరిని ఆలోచింప చేస్తుంది. కులవృత్తిని కోల్పోయిన పద్మశాలీలు వ్యాపారం చేయడం ప్రారంభిస్తారు.

జి.రాములు - ఆత్మఘోష, బి.యస్.రాములు - బతుకుపయనం, నానమ్మ ప్రేమధార, ప్రేమధార - అసందిగ్ధ కర్తవ్యం, ప్రశాంతం, రాత్రిపూలు, వరుసలు. జూకంటి జగన్నాథం, వలస, యాతన బి.వి.ఎన్.స్వామి - వలస, పరిగడపు, మూడువలసలు, రాత్రిపగలు, కొక్కుల భాస్కం - తెగినపోగు, బొంబాయి ప్రయణం, సాలోళ్ల పని సన్యాసులల్ల గల్సింది ,వుప్పల నరసింహ, బిర్లామందిర్, పి.చంద్, పాతచీర, నూలుపోగు, బంధం -ఎన్నార్ భోలా, దిలావర్ - ఉరితాళ్ళు, సాహు-నాడి, ఐతా చంద్రయ్య-చిలకపచ్చ చీర మొదలైన కథకుల కథల్లో చేనేత జీవన చిత్రణలో అనేక సామాజిక అంశాలు కన్పిస్తున్నాయి. వీటినై ఇంకా పరిశోధనలు జరగాలి.

## ఆధార గ్రంథాలు :

1. నూలుపోగు- ఎన్నార్ ఒనోలా-సృజన, 1982
2. భగ్నప్రేమ- దామోర్ల రమాకాంతరావు, శ్రీపద్మశాలి పత్రిక, 1932
3. ఆత్మఘోష-జి.రాములు, పెరటిచెట్టు కథాసంపుటి, 2005
4. కుంతనం- బి.వి.ఎన్.స్వామి-సాహిత్య ప్రస్థానం, 2005
5. చేనేత చిత్రం- మునిపల్లెరాజు- కొత్తకథ కథాసంకలనం- వేదగిరి రాంబాబు, 1994
6. చిరునామా- జాతశ్రీ-ఆర్తారావం కథాసంపుటి, 2008
7. తెలంగాణ కథా- తెలుగు కథ, డా॥కాలువ మల్లయ్య, జగన్నాథ పబ్లికేషన్స్, 2018

❖❖❖

# చింతపల్లి యమున కథల్లో విద్యావిషయక చైతన్యం

- **పాలురు త్రినాథ,** యు.జి.సి. జె.ఆర్.ఎఫ్. పరిశోధకుడు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

## వ్యాస సంగ్రహం :

"పూర్వజన్మ సుకృతం వలనే కొందరు కళాకారులుగా, రచయితలుగా రాణిస్తారు. సంస్కారవంతులే రచనా సాధనలో సఫలీకృతులౌతారు. మన మంచి ఆలోచనలను ఇతరులతో పంచుకోవటం మానవ ధర్మాలలో శ్రేష్ఠ మైందని" అంటారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారు. ఈ ధర్మాన్ని త్రికరణశుద్ధిగా పాటించే అవకాశం అందరికంటే కళాకారులకు, రచయితలకే లభిస్తుంది. ఇలాంటి వారికి సమాజంలో మిక్కిలి గౌరవం ఉంటుంది. ఈ కోవలో రచనలు చేస్తూ, సమాజహితాన్ని కోరే సాహిత్యాన్ని వెలువరిస్తూ తనకంటూ ఒక స్థానాన్ని సాహితీ లోకంలో ఏర్పాటు చేసుకున్న రచయిత్రులలో సి.యమునగా పేరుగాంచిన చింతపల్లి యమున గురించి చెప్పుకోవచ్చు. అంతే కాకుండా ఆధునిక కాలంలో స్త్రీవాద సాహిత్యాన్ని నూతన కోణంలో ఆవిష్కరిస్తూ, స్త్రీచైతన్యాన్ని కాంక్షిస్తున్న రచయిత్రుల వరుసలో కూడా ఈమె ఉంటారు. ఆవిడ సాహిత్యమంతా స్త్రీ అనే ఇతివృత్తం, కుటుంబ విలువలు అనే అంశాల చుట్టూ తిరుగుతాయి. అలాగే స్త్రీల అభివృద్ధి, అభ్యుదయకాంక్ష ఈమె సాహిత్యంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈమె రాసిన కథలు సమాజానికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో ముఖ్యంగా ప్రత్యేకంగా కనిపించే విద్యా విషయక అంశాలపై చేసిన చైతన్యం ఏవిధంగా ఉందో అనే కోణంలో కథలను పరిశీలించే ఉద్దేశ్యమే ఈ పరిశోధన వ్యాస సారాంశం.

## రచయిత్రి పరిచయం :

రచయిత్రి శ్రీమతి చింతపల్లి యమున 1966, మార్చ్ 10న కృష్ణ జిల్లా, ఉయ్యూరు మండలం, పెనమకూరు గ్రామంలో శ్రీ మైలవరపు నారాయణరావు గారు, శ్రీమతి భారతి దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య 'ఓరియంటల్' స్కూల్లోనూ తరువాత 'ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు హై స్కూల్లో ఉన్నత పాఠశాల విద్య సాగింది. పదవ తరగతి, కాంపొజిట్ మాత్స్‌తో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యారు. గాంధీనగర్‌లో శారదా జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. రచయిత్రికి పద్దెనిమిదో ఏటనే, ఇరవై నాలుగేళ్ల రాఘవ రావుగారితో వివాహమయ్యింది. యునైటెడ్ ఇండియా జెనరల్ ఇన్సూరెన్స్ లో ఎడ్మినిస్ట్రేటివ్ (స్కేల్ 2) ఆఫీసరుగా పనిచేస్తున్నారు. వీరికి ఒక కొడుకు, ఒక కూతురు. భర్త ప్రోత్సాహంతో, ఉస్మానియా ఎక్స్‌టర్నల్ యూనివర్సిటీ లో ప్రైవేట్‌గా బి.కామ్ పూర్తి చేశారు. ఆమె తన బాల్యంలోనే శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారి సీరియల్ 'రాధాకృష్ణ' చదివారు. శరత్ సాహిత్యం చదివారు. బ్రాహ్మణ పిల్ల, పరిణీత ఆమెను ఆకట్టుకున్న శరత్ రచనలు. ఈ ప్రభావంతో 2011లో 'రెక్కలొచ్చాయి' అనే కథతో రచనా వ్యాసంగం ప్రారంభించి 80కి పైగా కథలు రాశారు.

## కథలు - విద్యా విషయక చైతన్యం :

ఈనాటి సమాజంలో చదువుల సంబంధిత సమస్యలు ప్రధానమై కూర్చున్నాయి. పోటీ ప్రపంచంలో విద్యా లయాల వ్యాపార ప్రవృత్తులు, తల్లిదండ్రుల దృక్పథాలు విద్యార్థులపై ఒత్తిడిని పెంచుతున్నాయి. దీన్ని అర్థం చేసుకోలేని కన్నవారు తమ ఆశలను పిల్లలపై రుద్దడం, వారి అభిరుచులకు విలువివ్వక తమ మాటనే నెగ్గించు కొనే క్రమంలో సమస్యలకు తావిస్తున్నారు. వీటిని భరించ లేక మానసికంగా నలిగి పోతూ ఆత్మహత్యలవైపు వెళ్తోన్న పసి హృదయాలను చూసి రచయిత్రి కలత చెందారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలు దెబ్బతింటాయని తలిచారు. అందుకే తనవంతు బాధ్యతగా తల్లిదండ్రు లకు చదువుల పట్ల అవగాహనని అందిస్తూ చైతన్య

పరచాలని కంకణం కట్టుకొన్నారు. తదనుగుణంగా కథా రూపంలో పాత్రల దృక్పథాలను వివరిస్తూ సరైన చైతన్యాన్ని పెద్దలకు అందించే ప్రయత్నాన్ని చేసారు. పిల్లల్ని అర్థం చేసుకోవడంతో పాటు నేటి విద్యా వ్యాపారాల్లో పడి కొట్టుకొని పోకూడదనే కనువిప్పునిచ్చారు. ఈ రకమైన దృక్పథంతో రాసిన కథలను పరిశీలిస్తే నాలుగు కథలు దర్శనమిచ్చాయి. వాటిని విశ్లేషిస్తున్నాను.

**మనోహరం కథ :**

మార్చి, 2013 సంచికలో నవ్య వీక్లీ ప్రచురించిన ఈ కథ సి.యమున రాసిన 'రెక్కలొచ్చాయి' కథా సంపుటి లోనిది. మాధవి దంపతులు ఉన్నతోద్యోగులు. వారి ఏకైక సంతానం శ్రీరామ్ తొమ్మిదవ తరగతి చదువుతుండేవాడు. కొడుకుని ఐ.ఐ.టియన్‌ని చెయ్యాలన్నది వారి కల. ఆరవ తరగతి వరకూ తొంభై శాంతం మార్కులు తెచ్చుకొనే శ్రీరామ్ తొమ్మిదవ తరగతిలో ఎనభై శాతానికి పడిపోవడం మాధవిని కలవరపెడుతుంది. స్కూలు యాజమాన్యం ఈ విషయాన్ని ఆమె దృష్టికి తెస్తారు. శ్రీరామ్ చదువుతో పాటు సంగీతంలో శిక్షణను పొందుతుండేవాడు. అతనెంతో ఇష్టపడే సంగీతంలోనూ మొదటి స్థానంలో లేడని మాధవి బాధపడుతుంది. కానీ శ్రీరామ్ తాను సంగీతం లెక్చరర్‌ని అవుతానని ఆనందంగా చెప్పేవాడు. చదువుకు సంగీతం అడ్డుగా ఉందని ఆమె భావిస్తుంది. దాన్ని నిలుపుదల చేయాలని అనుకొంటుంది. మాధవి అనవసరంగా ఆందోళన చెందుతోందని ఆమె తండ్రి గ్రహిస్తాడు. ఐ.ఐ.టి ఒకటే చదువుకాదని, ఎనభై శాతం మార్కులు తక్కువ కాదని చెప్పినా ఆమె, తండ్రి మాటను పట్టించుకోదు. మాధవి తన పూర్వ స్నేహితురాలైన మైత్రేయిని కలుస్తుంది. ఆమె పెద్దకొడుకు ఐ.ఐ.టి.యన్ కాగా, చిన్న కొడుకు మనోహర్ తొమ్మిదవ తరగతి చదువు కుంటున్నాడంటుంది. మనోహర్‌లో మానసిక ఎదుగుదల సరిగా లేకున్నా అతనికి ఇష్టమైన పనుల్లో వేగవంతంగా ఉంటూ మెప్పుని పొందేవాడు. చదువు అనేది ఎవరి స్థాయికి తగిన విధంగా వారికి అబ్బుతుందని మైత్రేయి అంటుంది.పైగా ఎవరి పరిధిలో వారు జీవితాన్ని ఆనందంగా జీవించే హక్కు ఉందని ఆమె చెప్పిన మాట మాధవిలో మార్పు తెస్తుంది. శ్రీరామ్ విషయంలో తన వైఖరిని మార్చుకుంటుంది.

**విశ్లేషణ :**

ఈ కథనం విద్యావిషయకాలలో పిల్లల మనసుని అర్థం చేసుకోక ఒత్తిడులను పెంచే తల్లిదండ్రుల్లో మార్పు రావాలని కోరింది. అదే విధంగా ప్రైవేటు బడులు, కళాశాలల్లో విద్య పట్ల దృక్పథాలెలా ఉన్నాయో తెలిపి ఆలోచింపజేసారు. పిల్లలపై చదువుని రుద్దకుండా వారి అభిరుచులకు తగిన విద్యలో శిక్షణను ఇప్పిస్తే గొప్ప స్థాయికి ఎదగగలరని చెబుతూ పెద్దల కళ్లను తెరిపించే ప్రయత్నం చేసారు. ఇవన్నీ నేటి విద్యా విధానాలు, దృక్పథాలను కూలంకషంగా వివరిస్తూ చైతన్యాన్ని అందించే దిశలో ఉన్నాయి. పిల్లల మనసుల్ని అర్థం చేసుకోకుండా చదువుపట్ల పెద్దల ఒత్తిడి, పాఠశాలల వ్యాపార నైజాలు కూడదని వివరించడం నేటి పరిస్థితు లకు చాలా అవసరం. రచయిత్రి ఈ విశేషాలను విశద పరచడం చూస్తుంటే నేటి విద్యారంగాన్ని, దృక్పథాలను కాచి వడపోసిన తీరు కనిపిస్తుంది. నిశిత పరిశీలనతో పాటు సమస్యల్ని వివరిస్తూనే చైతన్య పరచడం అభినంద నీయం. ముందుగా తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో గమనించాలి. ఎందుకంటే వీరి ఆలోచనా తీరులో మార్పు రాకుంటే, ఒత్తిడులను పిల్లలపై పెంచుతూపోతే వీరికి అనర్థాలు తప్పవు. శ్రీరామ్ చదువుపట్ల మాధవి చేస్తున్న పొరపాట్లను గమనించిన ఆమె తండ్రి ఆమె ఆలోచనా విధానం తప్పని చెప్పాడు. ఆ సంభాషణలో చదువుల్లో పిల్లల పట్ల ఎలా ఉండాలో చెప్తూ -

"ఎల్.కె.జీలో క్లాసుల్లో నైంటీ పర్సెంట్ పిల్లలకి హండ్రెడ్ పర్సెంట్ వస్తుంది. కాని హయ్యర్ క్లాసుల్లో టాప్ ర్యాంకులు నాలుగైదే ఉంటాయి. అంటే వాళ్ళందరూ చదవటం మానేసారనా లేక చదువులు వాళ్ళ స్థాయికి

మించినాయనా? నైంత్ కొచ్చేసరికి సబ్జెక్ట్స్ వాడి స్థాయిని మించి ఉన్నాయేమో! బహుశా శ్రీరామ్ మ్యూజిక్ వలన రిలాక్స్ అయ్యి అంత పెర్సెంటేజ్ తెచ్చుకోగలుగుతున్నాడేమో ఆలోచించు. వాడి కెపాసిటీని దాటి ప్రెషర్ పెట్టొద్దు. ఆ కెపాసిటీని తెలుసుకోవటం తల్లిదండ్రుల బాధ్యత" ర్యాంకులే ముఖ్యమని చదువు తప్ప ఇతరత్రా వ్యాపకాలు వద్దని తరగతులు పెరిగేకొద్దీ పిల్లలు విద్యపై దృష్టిని నిలపడం లేదని భావించే కన్నవారికి ఈ మాటలు చెంపపెట్టు. ఓ అనుభవశాలి నుండి వెలువడిన ఈ వాక్యాలు పిల్లల మనసెరగక వారిపై ఒత్తిడినిస్తూ, తామూ ఆందోళనచెందే మాధవి వంటి వారికి కనివిప్పు నిస్తున్నాయి. ఉన్నత ఉద్యోగాలలో ఉండే భార్యాభర్తలు 'నా విచారం వాడి చదువే. ఈ మధ్య వాడికి ఎయిటీ పర్సెంట్ దాటడం లేదు. మేము ఇంత మంచి పొజిషన్‌లో ఉండి వాడు అలా చదివితే ఎలా? మా అబ్బాయి ఐ.ఐ.టియన్ కావాలనేదే మా కల కాని వీడి పెర్ఫామెన్స్ చూస్తే ఇలా' అంటూ మాధవి దంపతుల్లాగే దాదాపు అందరూ అనుకుంటున్నారు. పిల్లల్ని మంచి స్థాయిలో చూడాలన్న కన్నవారి కల సమంజసమే కానీ వందకు వంద, వందకు తొంభై తొమ్మిది మార్కులే ఉత్తమమైనవి అనే తమ పిల్లలకు రావాలని భావించే వారి భావజాలాలు సరికాదు. తొమ్మిదవ తరగతిలో ఎనభై మార్కులు తక్కువకాదు. చిన్న తరగతుల్లో ర్యాంకుల గోల ఉండదు కనుక తొంభైలలో వచ్చి తరగతిలో మొదటి శ్రేణి ఉత్తీర్ణులు అనిపించుకొంటారు. అలాగే పై తరగతిలోనూ రావాలంటే కుదరదు. పెరిగిన సబ్జెక్ట్స్‌లో ఒకటి రెండు కష్టం అనిపించవచ్చు. వాటి పట్ల ఆసక్తి కనబరచక పోవచ్చు. అలా వాటిలో తగ్గిన మార్కులు ర్యాంక్‌పై ప్రభావం చూపించవచ్చు. అలాగని వారు మొద్దులని నిర్ణయించకూడదు. మార్కులు అనేవి విద్యార్థుల తెలివికి కొలమానాలు కావు. అవి వారి మేధస్సుని నిర్ణయించలేవు. సంగీతంలో మొదటి శ్రేణిలో ఉండే శ్రీరామ్ చదువులో రెండవ శ్రేణిలో ఉన్నాడంటే సంగీతం పట్ల అతనికున్న అభిరుచి ఆసక్తి. అలాగని అతను విద్యను నిర్లక్ష్యంచేసి స,ప,సాలు నేరుస్తున్నాడని కాదు. మానసికొత్తిడికన్నా మానసిక వికాసాన్ని ఆస్వాదించనివారుండరు. పైగా పెద్దలు తమ కలలను పిల్లలపై తీర్చుకొనే ఉద్దేశ్యంలో మా అబ్బాయి ఇంజనీర్, మా అమ్మాయి డాక్టర్ అంటూ పిల్లల గమ్యాలను వీరు నిర్దేశిస్తున్నారు. ఆ స్థాయి అందుకొనే పిల్లలకు అది సులువే. కానీ స్థాయి లేకున్నా, ఇష్టం లేకున్నా, వారి లక్ష్యం వేరొకటి ఉన్నా తల్లిదండ్రులు నిర్దేశించిన దారిలోకి నడవడం కష్టం. దీంతో పెద్దలు పిల్లలపై స్థాయికి మించిన ఒత్తిడిని కలిగిస్తున్నారు. పుస్తకాల పరుగుల్లా మారాలని పుస్తకాలు, ట్యూషష్లు అని బాల్యాన్ని బలిపెడతున్నారు. స్థాయిని మించి అందుకో లేని పిల్లలు మానసికంగా నలిగిపోతూ చదువుపై విరక్తిని పెంచుకొని ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. అలాంటి వారికి మాధవి నాన్న మాటలు అసలైన విద్యా చైతన్యం ఏంటో తెలిపేలా మలిచారు.

నేడు విద్యా వ్యవస్థలోని చదువుల నిలయాలు, తల్లిదండ్రులు ర్యాంకులే ముఖ్యమనే భావనలతో చదువుని వ్యాపారమయం చేసేసారు. ఎల్‌కేజీ చేర్చగానే మా అబ్బాయి ఐఐటియన్ కావాలని లక్ష్యాన్ని నిర్దేశం చేసన్తున్నారు. ఫీజులు, శిక్షణలు అంటూ బస్తాల మూటల్లాంటి పుస్తకాల సంచులను వీపులపైకి చేర్చి బాల్యాన్ని చదువులకు బలవంతంగా కట్టేస్తున్నారు. దీంతో పిల్లలు దిక్కుతోచనివారయి అర్థం చేసుకొనేవారు లేరని మానసికంగా దెబ్బతింటున్నారు. ఎంతో చదువు చదివి ఒక ఉన్నత స్థాయి ఉద్యోగులైన మాధవి దంపతులు కొడుకు ఐఐటియన్ కావాలని అనుకొన్నారు. పది మార్కులు తగ్గాయని దీనికి సంగీతం తరగతులే కారణ మంటూ మాన్పించాలనుకొంది. తమ ఇష్టా ఇష్టాలతో పిల్లల బాగు మాకే తెలుసునని అనుకొంటూ పిల్లల ఆసక్తులను కూడా గమనించడం లేదు. ఇక పాఠశాలలు, కళాశాలలు 'మీ వాడికి ఎయిటీ పర్సెంట్ మించి రాలేదు. ఇలా అయితే నెక్ట్స్ఇయర్ ఎలా?' అంటూ విద్యార్థుల కన్నవారిని భయపెడుతూ నిలదీస్తున్నారు. ఎనభై శాంతం

తక్కువని ముందున్న తొంభై ఎనభైకి చేరి అనంతరం డెబ్భై, అరవై, యాభై అలా పడిపోతాయని నిర్ణయిం చడంలో సబబు లేదు. చదువుని వ్యాపారం చేస్తే ఫీజులు, ర్యాంకులు, మాకు ముఖ్యమని ఒత్తిడులనుపెంచేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారు. ఇలాంటి మాటలు, నిర్ణయాలు విద్యార్థుల ఆత్మస్థైర్యాలను దెబ్బతీసి నిస్తేజంగా మారుస్తాయి. పాఠశాలల్లో చదువులు చాలవని ట్యూషన్లు, తిరిగి ఇంట్లో శిక్షణతో పిల్లల్ని నిమిషం తీరిక లేని యంత్రాలుగా మారుస్తున్నారు. ఆటపాటలకు తావీయని ఇళ్ళు, అపార్ట్‌మెంట్ పాఠశాలలు ఖైదులను తలపిస్తున్నాయి. ఏ నేరం చేయని పిల్లలు అమాయకంగా బందీలై దీనంగా కన్నవారివైపు చూస్తున్నాయంటే తప్పు తల్లిదండ్రులదే. వీరి ఆశ, పోటీతత్వాల దృక్పథాలను ప్రైవేటు యాజమాన్యాలు తమ ఆదాయాలుగా మార్చుకొనే కార్పొరేట్ వ్యాపారాలు సాగిస్తున్నాయి. ఫలితంగా 'నువ్వు మ్యాథ్స్ లెక్చరర్ అయినట్లు నేను మ్యూజిక్ లెక్చరర్‌ని అవుతాను' అంటూ సంతోషంగా చెప్పిన శ్రీరామ్ లక్ష్యాన్ని దారిమళ్ళించాలని చూసే మాధవి వంటివారే ఉంటున్నారు. వీరికి సమా ధానంగా 'మన కలలు కాదు ముఖ్యం పిల్లల ఇంట్రస్ట్ ముఖ్యం' అని ఆమె తండ్రి పాత్రచే చెప్పించారు.

'ఈనాటి చదువులు ఎకడమిక్ ట్రెనింగ్ ఇస్తున్నాయి కాని ఎమోషనల్ ట్రైనింగ్ ఇవ్వడం లేదు. ఒక సామాన్య విద్యార్థికి కూడా ఆనందంగా జీవించే హక్కు ఉందని చెప్పి ప్రోత్సహించే తల్లిదండ్రులు ఎంతమంది? అంటూ ప్రశ్నించారు. జవాబుగా ఈ పోటీ ప్రపంచపు మాయా జాలంలో పడి పిల్లల్ని, భవిష్యత్ తరాలను నాశనం చేయని చదువులనే చెప్పించమన్నారు. అభిరుచులకు తగిన విద్యలో రాణిస్తే కన్నవారు అనుకొన్న స్థాయికన్నా దాటి ఎదగగలరు. అలాంటి వాతావరణం విద్యార్థులకు అవసరం అనే చైతన్యాన్ని సంపూర్ణంగా అందించి మార్పుని ఆశించారు.

## మలుపు కథ :

RGB infotain వెబ్ మ్యాగజైన్ నిర్వహించిన పోటీల్లో ఈ కథ బహుమతిని పొందింది. జూన్, 2017 సంచికలో ప్రచురితమైన ఈ కథనం 'కరిగిపోని కలలు' సంపుటి లోనిది. అర్జున్ తెలివైన విద్యార్థిగా పదవతరగతి, ఇంటర్మీడియెట్‌లలో మొదటి స్థాన ఉత్తీర్ణతని పొందుతాడు. ఐ.ఐ.టీ ప్రిలిమినరీలో పాసై తుది పరీక్షల్లో సరిగా రాయలేకపోతాడు. తనపై ఇంట్లోని కన్నవారు, బయట తెలిసినవారు పెట్టుకున్న నమ్మకం వమ్ము చేస్తానేమోనని బాధ పడతాడు. అలాంటి క్షణాలను భరించడం కన్నా ముందే సముద్రంలోనికి దూకి ఆత్మహత్య చేసుకోడానికి వెళ్తాడు. అయినా అలా చావలేక ఇంటికి తిరిగొస్తాడు. ఇంట్లో తన తల్లి కులూమనాలి ప్రయాణానికి సిద్ధంచేస్తుండటం, తమ్ముడు సంబరపడి పోతుండటం చూస్తాడు. ఎలాగైనా ఆ రాత్రికి బొమ్మ నిద్రమాత్రలు మింగి చనిపోవాలని అనుకొంటాడు. అర్ధరాత్రి లేచి నీళ్ళ కోసం వెళ్ళగా తల్లిదండ్రులు తన గురించి మాట్లాడుకోవడం వింటాడు. రేపటిరోజు ఉత్తీర్ణత సవ్యంగా రాకుంటే అందరి విచారింపులకూ అర్జున్ కృంగిపోకుండా అలా యాత్రని ఏర్పాటు చేసానని తల్లి చెప్పడం వింటాడు. వారికి తనపై ఉన్న ప్రేమను చూసి ఆత్మహత్యను విరమించుకొంటాడు.

## విశ్లేషణ :

నేటి కాలంలో చదువుల ఒత్తిడులెలాంటివో తెలిపి విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను చైతన్యపరిచే బాధ్యతను ఈ కథనం ద్వారా చేపట్టారు. విద్యా విషయ కాల పోటీల సమాజంలో హద్దు దాటటంతో పాటు, విద్య ఒక వ్యాపారమైన వేళ ఆ పరుగుపందెంలో పిల్లలు బలవుతున్నారు. దానికి గల కారణాలను కూడా రచయిత్రి చర్చిస్తూ, విద్యార్థుల కన్నవారెలాంటి ఆలోచనలతో పిల్లలకు అండగా నిలవాలో తెలిపి స్ఫూర్తిని రగిలించారు. ఈ స్ఫూర్తి గురించి మాట్లాడేముందు సమస్య గురించి కొంత చర్చ అవసరం. అందుకే కథాకర్త నేటి చదువుల గురించి అవి కలగజేస్తోన్న మానసిక ఒత్తిడులెలాంటివో అవి ఎక్కడకు దారితీస్తాయో సోదాహరణంగా వివరించి

ఆలోచింపజేసారు. బాగా చదివే అర్జున్ వంటి కుర్రాడు అపజయం కలిగితే తట్టుకోలేడు. తనవారి ఆశలను కూల్చి వారిని చూడలేనని ఆత్మహత్య చేసుకోవాలనుకోవడాన్ని గమనిస్తే పోటీ పరీక్షలు విద్యార్థుల్ని, వారి తల్లిదండ్రులను ఎంతటి ఆందోళనకు గురి చేస్తున్నాయో అర్థంచేసుకోవచ్చు. వాటిని అధిగమించాలంటే ముందు విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం అవసరం.అలాంటి పాత్ర అయిన అర్జున్ తల్లి. ఆమె భర్తతో సాగించిన సంభాషణలో కొన్ని సూచనలు ఆలోచనాత్మకంగా ఉన్నాయి.

''రిజల్ట్స్‌గురించి మనం ఎక్కువ మాట్లాడవద్దని చెప్పింది వాడికి ఎక్కువ టెన్షన్ పెట్టకూడదనే. అసలు ఈ ట్రిప్ పెట్టింది రిజల్ట్స్‌వచ్చే రోజు వాడిని దూరంగా తీసుకెళ్ళాలనే. రేపు రిజల్ట్స్‌వాడు కోరుకున్నట్లు వస్తే ఈ ట్రిప్ 'సెల్‌బ్రేషన్స్' అవుతుంది. లేకపోతే ఈ ట్రిప్ పది మంది సానుభూతి పలకరింపుల నుండి వాడికి 'ప్రొటెక్షన్' అవుతుంది. ఏ మలుపుకైనా సిద్ధపడి ఉండాలి. తప్పదు.''

ఓ తల్లి, కొడుకుపై చూపుతోన్న శ్రద్ధలో ఉత్తీర్ణతా ఫలితం వలన చేదు అనుభవాలను తప్పించాలన్న తపన ఉంది. అలాగే చదువుపై విరక్తి కలిగేలా కొడుకుపై బయటివారి మాటల ప్రభావం ఉండకూడదనే జాగ్రత్త ఉంది. నేటి పోటీ స్థాయిల లోతు, పిల్లలపై ఉండే ఒత్తిడి, వారి అంతరంగ భయాలు, మానసిక పరిస్థితులు, లోకం తీరు వంటివి ఎరిగినతనాన్ని అర్జున్ తల్లిలో చూడగలం. విజయం లభిస్తే ఆనందమే అయినా, అపజయం పాలైతే ఓటమి తనం బాధిస్తుంది. బయటివారి పరామర్శల సూదిపోట్లు కొడుక్కి బతుకుపై విరక్తిని కలిగించకూడదనే తల్లి హృదయమిది. నేటి విద్యారంగాన్ని సమాజ దృక్పథాన్ని గమనిస్తే కొన్ని సమస్యలే కళ్ళ ముందు కనిపిస్తాయి. పాఠశాలలు, కళాశాలలు తమ విద్యార్థుల ర్యాంకుల వ్యాపారాలతో లాభాలనార్జించాలనే దోరణితో ఉంటున్నాయి. తల్లిదండ్రులు తాము పిల్లలపై పెట్టిన పెట్టుబడులకు డబ్బులు పూలు త్వరగా పూయాలన్నట్లు తొందర పెడుతున్నారు. ర్యాంకులు తెచ్చుకోగలిగిన విద్యార్థుల నుండీ పాస్ అవుతామో లేదోనన్నవారి వరకూ ఒకటే ఆందోళన. ర్యాంక్ వచ్చినా ఇంకో మార్క్ పెరిగి వుంటే బాగుండునని కళాశాలల అసంతృప్తి. అందరికన్నా మావాడే ముందుండాలనే కన్నవారి అత్యాశలు. ఎన్ని మార్కులు వచ్చినా చాలదనే వెలితులు. వెరసి పిల్లలపై ఒత్తిడి. ఎంత కష్టపడినా గుర్తించలేదనే ఆవేదనలు, పోటీల గోలలు, పరుగులు. బాల్యం, యవ్వనం చదువుల వ్యాపారంలో కకావికలం. అక్షరజ్ఞానం తప్ప లోకజ్ఞానం, విలువలు ఎరగని భవిష్యత్ పిల్లతరం. అసంతృప్తులు, అవమానాలు తట్టుకోలేని విద్యార్థుల వేదన ఆత్మహత్యలకై పరుగులు. విగత జీవుల కళ్ళలో కూలిన భవిత ప్రాణాలు, తడి ఆరని కన్నీటి చారికలు. ఇదీ నేటి చదువుల వ్యవస్థలోని సంక్షోభాలు. ఇవన్నీ తెలిసిన తల్లిగా అర్జున్‌ని ఆత్మవిశ్వాసం కోల్పోనీయకుండా, మానసిక సంఘర్షణలకు తావివ్వకుండా చూసుకోవాలనుకొంది. ఒక తల్లిగా బిడ్డ మనసెరగడం, వెన్నుతట్టడం, కృంగుబాట్లు వద్దనడం, మరో సారి ప్రయత్నించవచ్చుననే ఓదార్పుని అందించడం ఆమెకు తెలుసు. ప్రతీ తల్లి ఇలా విద్యార్థుల చదువుల విషయంలో చైతన్యాన్నే కలిగి ఉండాలి. అర్థంలేని దృక్పథాలతో వ్యవహరించవద్దని సూచించారు.

చదువుల విషయంలో నేడు పెద్దల, పిల్లల ఆలోచనలు ప్రమాదకరమైనవిగా ఉంటున్నాయి. ఇలాంటి ఒత్తిడుల మధ్య ఆందోళనలు సమాజానికి మంచిది కాదు. దేన్నైనా తట్టుకోవడం, తేలికగా తీసుకోవడం, ఆత్మ స్థైర్యంతో కదలడాలనే నూరిపోయాలి. అపజయం కలిగినా కృంగిపోకూడదని వివరించాలి. ఆ తీరు లేకపోవడం వలన నేడు సమాజంలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. ఈ విషయం కథా నిర్మాతను కలచివేసింది. చదువుల విషయంలో తల్లిదండ్రులు విజ్ఞతతో ప్రవర్తించి పిల్లలకు అండగా నిలిచి వెన్నుతట్టి నిలబడాలి. అప్పుడే భవిష్యత్‌తరం ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తుంది. అర్జున్ తల్లి ఒత్తిడి అనేది పరీక్షా ఫలితాల సమయంలో అధికమని గుర్తించింది. దాన్ని అధిగమించేలా కొడుకు వైపు నిలిచింది. అర్జున్‌వాళ్ళ

బైక్ మెకానిక్ కొడుకుని ఇంజనీర్ చేయాలని కలలుగన్నా కొడుకుకూడా తనలాగే మెకానిక్ అవడాన్ని జీర్ణించుకొన్నాడు. 'కనీసం నా కొడుకన్నా ఇంజనీర్ అవ్వాలనుకున్నాను. వాడేమో ఇలాంటి షెడ్స్‌ను బాగా డెవలప్ చెయ్యాలనే అలోచనలో ఉన్నాడు. నా తీరని కల వాడి ద్వారా తీర్చుకోవాలనుకున్నాను. కాని వాడికి ఇంట్రెస్ట్ లేనపుడు నేను ఏం చెయ్యలేనుకదా! ఏదో ఒక దానిలో వాడికి ఎదగాలనే కోరిక ఉంది. అది చాల్లే అని తృప్తి పడుతున్నాను' అనడంలో కొడుకుని అర్థం చేసుకొన్నాడు. తన ఆశల్ని పిల్లలమీద రుద్ది ఫలితాన్ని ఆశించడం మూర్ఖత్వమవుతుంది. అదే వారి ఇష్టానుసారం ఎంచుకొన్న రంగంలో వారెంతో ముందుకు వెళ్ళగలరు. ఇది ఎరగని కన్నవారు పిల్లల చదువుల విషయంలో రాచిరంపాన పెట్టడాలను చూస్తుంటే మతిపోతుంది. చదువుల విషయంలో విద్యార్థులకు ఆందోళనివ్వని విద్యా ప్రమాణాలు అవసరం. లేదంటే పోటీ ప్రపంచంలో ఎక్కడ తేలుతామో తెలియదు. విద్యాగందరగోళాలు అప్రశాంత వాతావరణాలను పెంచుతున్నపుడు ప్రభుత్వాలు వీటిగురించి ఆలోచించాలి. తల్లిదండ్రులు పిల్లలవైపు నిలబడాలి. ఒత్తిడులనీయని విద్యావ్యవస్థని కోరుకోవాలి. అలాంటి మార్పులు, చైతన్యాలను కథాకర్త కోరుకొన్నారు. అందుకే ప్రక్షాళనా ఆవశ్యకతను, ఆలోచనా విధానాల మార్పులను కోరారు.

## ముగింపు :

చైతన్యం అనేది వ్యక్తులకు, కుటుంబాలకు, వ్యవస్థలకు ముఖ్యమంటూ సమాజ హితాన్ని కోరడం రచయిత్రి లక్ష్యంగా కనబడింది.. స్వీయ చైతన్యంతో నడవాలని, సామాజిక బాధ్యతల్ని తెలుసుకోవాలని కాంక్షించిన చింతపల్లి యమున కథలను ఆద్యంతం పరిశీలిస్తే అన్నీ సమాజ జీవన చిత్రాలకే ప్రాధాన్యతను ఇచ్చారనిపించింది. అలాగే విద్యావిషయకంగా చేసిన చైతన్యం ఆలోచనను కలిగించేలా ఉంది. తల్లిదండ్రులు పిల్లల విషయంలో ఖచ్చితమైన అవగాహనతో ఉండాలి. వారి మనోభావాలకు విలువ ఇచ్చేలా నిర్ణయాలుండాలి. ర్యాంకుల పేరుతో పరోక్షంగా హింసకు గురిచేసే విధానాలకు స్వస్తి చెప్పాలి. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ కథల ద్వారా అటు విద్యార్థుల్లోను, తల్లిదండ్రుల్లోను చైతన్యం నింపే ప్రయత్నం చేశారు రచయిత్రి.

## ఉపయుక్త గ్రంథసూచిక :

1. కాత్యాయని విద్మహే-ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీవాద భూమిక, స్త్రీజనాభ్యుదయ సంస్థ ప్రచురణ 2006.
2. నరసింహం, కె.వి.ఆర్. - ఆధునికాంధ్ర కవితా సమీక్ష, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ, 1982.
3. యమున, చింతపల్లి -రెక్కలొచ్చాయి కథా సంపుటి,2014
4. యమున, చింతపల్లి-కరిగిపోని కలలు కథాసంపుటి,2017
5. సిమ్మన్న, వెలమల - తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, దళితసాహిత్య పీఠం, విశాఖపట్నం, 2005.

❖❖❖

# ప్రజాకవి కాళోజీపై వల్లంపట్ల రచనలు - ఒక పరిశీలన

- బుర్క ప్రియాంక, పరిశోధన విద్యార్థిని, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ప్రజాకళాకారుడు, కవి, రచయిత ఉత్తమ ఉపాధ్యాయుడు, నిరంతర చైతన్యశీలి సమాజంలో నెలకొన్న రుగతలను రూపుమాపి నూతన సమాజ నిర్మాణం కొరకు తన కలాన్ని, గళాన్ని అందించిన గొప్ప సామాజిక తత్వవేత్త వల్లంపట్ల నాగేశ్వరరావు గారు. అంతేకాదు మహనీయుల జీవిత చరిత్రలను బుర్రకథ, పల్లెసుద్దులు వంటి ప్రక్రియలలో రచించి సామాన్య జనులకు సైతం మహనీయుల స్ఫూర్తినందించచిన బహుముఖ ప్రజ్ఞాశాలి వల్లంపట్ల గారు. ఆ క్రమంలోనే తెలంగాణ తొలిదశ ఉద్యమానికి ఊపిరిలూదడమే కాదు జిల్లాలో, రాష్ట్రంలో దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా ప్రజల ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగిన ఓరుగల్లు గడ్డ మీద నిలబడి ప్రశ్నించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు రచనలు, జీవితం ఎంత చదివినా ఇంకా తెలుసుకోవాల్సింది ఏదో ఉందనే అనిపిస్తుందది. వారి రచనల నుండే కాకుండా వారి జీవితం, జీవనం నుండి కూడా తెలుసుకోవాల్సింది ఏదో ఉందనే అనిపిస్తుంది. వారి రచనల నుండే కాకుండా వారి జీవితం, జీవనం నుండి కూడా తెలుసుకోవాల్సిన, నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి అలాంటి మహనీయుని జీవితాన్ని, జీవనాన్ని పరిచయం చేస్తూ వారి వ్యక్తిత్వాన్ని జీవితాన్ని, జీవనాన్ని పరిచయం చేస్తూ వారి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే విధంగా ప్రముఖకవి, రచయిత వల్లంపట్ల గారు కాళోజీ తాతతో నా జ్ఞాపకాలు, ప్రజాకవి పల్లె సుద్దులు, కాళోజీ చరితం (బుర్రకథ) వంటి గ్రంథాలను వెలువరించారు. కాళోజీ జీవితం సాహిత్యం మీద చాలా పుస్తకాలు వచ్చిన బుర్రకథ, పల్లెసుద్దుల ప్రక్రియల్లో కాళోజీ జీవితాన్ని రచించి ప్రజాహృదయాలను రంజింపచేసి, ప్రజల్లో దేశభక్తిని ఉద్యమస్ఫూర్తిని రగిలించి ఏకైక వ్యక్తి వల్లంపట్ల నాగేశ్వర్‌రావు.

మొదటగా కాళోజీ చరితం బుర్రకథ - పరిశీలించి నట్లయితే తెలుగు వారికి బాగా సుపరిచితమైన కళారూపం బుర్రకథ. దీనికి ప్రదర్శనలో ముగ్గురు సభ్యులుంటారు. మధ్యలో వ్యక్తి తంబూర భుజానికెత్తుకొని మీటుతూ కథ చెబుతుంటే మిగతా ఇద్దరూ గమ్మెటలు వాయిస్తూ తానా తందానా అంటూ వంత పాడుతూ, ప్రశ్నలు సంధిస్తూ కథా గమనానికి తోడ్పడతారు. పిట్టకథలతో రక్తి కట్టిస్తారు. హాస్యంతో చూసేవారికి ఉత్సాహాన్ని కలిగిస్తారు. మధ్యలో వ్యక్తి వాడే తంబూర బుర్ర ఆకారంలో ఉండటం వల్ల దీనికి బుర్రకథని పేరు వచ్చింది.

రాగ తాళ గీత నృత్య అభినయములతో సందర్భోచిత సంభాషణా చాతుర్యంతో, నవరస పోషణ కూడియుండి పౌరాణిక, చారిత్రక, జానపద, సామాజిక ఇతివృత్తంతో కూడిన వస్తువుతో కథకుడు, ఇద్దరు వంతలతో సమన్వయ ప్రదర్శనతో జానపద ఆహార్యంతో అలరింపజేసే జన హృదయ విజేత బుర్రకథ కళారూపం. ఈ కళారూపంలో కాళోజీ చరితను వినిపించాడు.

దేశమాతను కొలచి వందనాలర్పించి బుర్రకథకుడు మరియు వంతలు రామలింగం, శంభులింగం కాళోజీ చరితం చెప్పడానికి ఉపక్రమిస్తారు.

విజ్ఞులైనా ఓ శ్రోతల్లారా వినిపించెద మహానీయుని గాథను / ముచ్చటగొలిపే మూడక్షరమ్ముల కాళోజీ అను నామము కనుడి / పీడిత తాడిత ప్రజల బాగుకై పరితపించిన కరుణామయుడు / కాళోజీ మహనీయుని కథను గానం చేస్తాము. అనగానే రామలింగం గురువు గారు ! ఇది చాలా విచిత్రంగా ఆశ్చర్యకరంగా ఉందే అనగా శంభులింగం ఇందులో ఆశ్చర్యపడేది ఏముంది? మహోన్నత వ్యక్తి చరితము గానం చేయటం తప్పంటావా? అని శంభులింగ ప్రశ్నిస్తాడు.

అప్పుడు రామలిగం ఏడిశావులే ఇలా ఒక కవి జీవితాన్ని బుర్రకథగా అందునా జానపద కళారూపానికి

ఎక్కించి ప్రదర్శించడం ఎక్కడైనా చూశామా! అది నాకు చాలా అరుదైన విషయంగా తోచింది. అందుకే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశానురా అంటూ జవాబు ఇస్తాడు. ఇలా మధ్య మధ్యలో హాస్యం వ్యంగ్యంతో కథను రక్తి కట్టిస్తాడు.

వినండి సోదరులారా, వినరా సోదరా వీనుల విందుగా కాళోజీ కథను పందొమ్మిదివందల పద్నాలుగు సెప్టెంబర్ / రమాబాయి / రంగారావు గార్లకు జన్మించిన కాళోజీ / అమ్మానాన్నల అనురాగంతో అల్లారు ముద్దుగను / దిన దిన ప్రవర్ధమానమై ఎదిగినాడు బాబూ కాళోజీ. అమ్మా నాన్నలది ఏ ఊరు ఏ ప్రాంతం సెలవిస్తారా గురువుగారు అని అడుగుతాడు శంభులింగం, అతని ప్రశ్నలకు సమాధానం చెబుతూ చివరికి ఆ మహనీయుడు కాళోజీ ఆశయం దోపిడి పీడన లేని సమాజం. ఆయన ఆశయ సిద్ధికి అందరం పాటు పడదాం అంటూ ప్రేక్షక లోకానికి వందనాలర్పించి కథను ముగిస్తారు. ఇలా కాళోజీ చరిత్రను నిరక్షరాస్యులై పామర జనానికి సైతం అర్థమయ్యేలా బుర్రకథలో ప్రచారం చేసి కాళోజీ పోరాట పటిమను సామాన్య ప్రజల రక్తనాళాల్లోకి ఎక్కించి ప్రజలను ఉద్యోన్ముఖులుగా తీర్చిదిద్దిన ప్రజా వాగ్గేయకారుడు వల్లంపట్ల నాగేశ్వరరావు గారు.

## మరోకటి ప్రజాకవి కాళోజీ పల్లెసుద్దులు (2019):

వల్లంపట్ల గారు జన సామాన్యానికి సమాజంలోని అనేక విషయాల పట్ల అవగామన చైతన్యం కలిగించ డానికి పల్లెసుద్దులు రచించి ప్రదర్శించి ప్రచురించారు.

పల్లెసుద్దులు వంటి జానపద కళారూపాలు రాయడంలో గల ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే! భారత దేశం పల్లెవాసుల దేశం. పల్లె ప్రజలను పలు అంశాలలో చైతన్య పరచడానికి ఈ కళారూపాలను ఎంచుకోవడం జరిగింది.

రానురాను గొలసుద్దులే పల్లె సుద్దులుగా పరిణామం చెందినదని మనం గమనించవచ్చు. వస్తుపరంగా చూసే పౌరాణిక జానపద చారిత్రక ఇతివృత్తాల ఉండి నేడు రాజకీయ సామాజిక అంశాలతో కూడిన కథలతో పల్లెసుద్దులు విస్తరిస్తున్నాయి.

ఇలా పరిశీలించినట్లయితే ప్రాచీన కళారూపాలెన్నో కాలానుగుణంగా మార్పులు చెందాయన్న సంగతి మనకు విదితమవుతుంది. అయితే వల్లంపట్ల గారికి విద్యార్థి దశ నుండే ప్రజాకవి కాళోజీ గారితో పరియం ఏర్పడి కాళోజీ గారు తుదిశ్వాస విడిచే వరకు కొనసాగింది. అలా కాళోజీ గారి రచనలతో ఉద్యమంతో, వ్యక్తిత్వంతో వల్లంపట్ల గారు ఎంతగానో ప్రభావితులు అయ్యారు. అందుకే కాళోజీ గారితో తనకున్న అనుబంధాన్ని పురస్కరించుకొని ప్రజాకవి కాళోజీ పల్లెసుద్దులు అనే వచన గ్రంథం రచించి ముద్రించినారు. 2009లో కాళోజీ గారి వర్ధంతి సందర్భంగా ఈ పల్లెసుద్దులు రాసి స్వరపరచి ఆల్ ఇండియా రేడియో వరంగల్ కేంద్రం ద్వారా తన బృందంతో గానం చేశారు. ఇందులో కథాంశం ఇంతకు ముందు వెలువరించిన కాళోజీ చరితం బుర్రకథలోని కథాంశం దాదాపు ఒకటిగానే ఉంటుంది. ప్రక్రియ మాత్రం వేరు. పునరుక్తి కాబట్టి ఇందులోని కథాంశాన్ని ఇక్కడ ప్రస్తావించడం లేదు.

మరొక గ్రంథం కాళోజీ తాతతో నా జ్ఞాపకాలు, ఇందులో కాళోజీతో వల్లంపట్ల గారు రెండు జ్ఞాపకాలు చెప్తాను.

కాళోజీ షష్ఠిపూర్తిని పురస్కరించుకొని కవితల్ని ఆహ్వానించారు. ఆ సందర్భంగా వల్లంపట్ల గారు కాళోజీపై రాసిన కవితను ఒకసారి చూద్దాం!

"తాతా నీకు అన్ని నేర్పింది నేనే
నీకు కవితలు రాయటం నేర్పింది నేనే
నీకు పదునైన మాటలు నేర్పింది నేనే
ఇంతకు నేనెవరో ఎరికేనా?
నేను ఉద్యమాన్ని
ఉద్యమాలకు ఊపిరిలూది
అసలు ఉదయం కోసం ఆరాటపడే తాతకు
అరవయేళ్ళ పండగ అభినందనలు" అని ముగిస్తాడు.

ఈ కవితను కాళోజీ జీవితాంతం గుర్తుచేసుకున్నాడట, సందర్భం వచ్చినప్పుడు అందరికీ నాకు అన్నీ నేర్పింది

వీడేనట. కవిత్వం రాయటం, ఉపన్యాసం, ఎగురుడు దునుకుడు అన్నీ వీడే నేర్పిండట ఆఖరికీ ఎట్ల తిప్పిండంటే ఇంతకు నేనెవరో తెలుసా! నేను ఉద్యమాన్ని అని ముగిస్తాడు. ఇగో వీడే వల్లంపట్ల అంటూ అందరికీ పరిచయం చేసేటోడు అంటూ వల్లంపట్ల గారు ఈ గ్రంథంలో కాళోజీతో ఉన్న జ్ఞాపకాన్ని చెప్పుకున్నారు. ఇలా కాళోజీపై అభిమానంతో రాసిన ఈ గ్రంథాల్లో కాళోజీ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరింపచేసి పాఠకులకు గురించి కొత్త విషయాలు తెలుసుకునేలా చేసిన వల్లంపట్ల గారు ధన్యుడు అని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కాళోజీ సాహిత్య సమాలోచన - గంటా జలంధర్‌రెడ్డి, 2012.
2. వల్లంపట్ల సమగ్ర సాహిత్యం - ఒక పరిశీలన - డాక్టర్ పొన్నాల ఉపేందర 2022.
3. కాళోజీ సమగ్ర సాహిత్యం - రాజకీయ సాంస్కృతిక విశ్లేషణ - డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, 2021.
4. తెలంగాణ ఉద్యమ పాట - ఒక పరిశీలన - బండి రజినీ కుమార్, 2004.

❖❖❖

# శ్రీశ్రీ సినీ గీతాలు - అభ్యుదయ దృక్పథం

- **అంబటి సరిత,** పరిశోధక విద్యార్థిని.

జనచైతన్యానికి కవితాబావుటాలెత్తిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. సామాన్య మానవుణ్ణి కవితా వస్తువు చేసుకొని, పీడితుల పక్షం వహించి ఐదు దశాబ్దా లకు పై కవితా జైత్రయాత్ర సాగించిన శ్రామిక పక్షపాతి అయిన కవి శ్రీశ్రీ. "మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది. పదండి ముందుకు, పదండి తోసుకు పోదాం, పోదాం పైపైకి ! పదండి ముందుకు పదండి" అని ఉవ్వెత్తున లేచి బెబ్బులిలా గర్జించాడు. శ్రీశ్రీ మహా ప్రస్థానంలోని కవితలు చదివి కవిలోకం నివ్వెరపోయింది. నిభిడాశ్చర్యం ఆయన వంకే చూసింది. ప్రపంచ బాధని తన బాధని తన బాధగా చేసుకొని కదిలాడాయన.

శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాస్తూ "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ - ప్రపంచానికి బాధ శ్రీశ్రీ బాధ"అంటాడు చలం. ఇది అక్షర సత్యం. "మహాప్రస్థానం ఈ శతాబ్దంలో వచ్చిన ఏకైక మహాకావ్యం"అంటాడు పురిపండ అప్పలస్వామి. ఇక ఆయన రాసిన "కవితా ! ఓ కవితా"అనే కవిత ఆయన కీర్తిని శిఖరాయమానం చేసిందనే చెప్పాలి. "కనీసం వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో కవితను ఇలా నిర్వచించి, ఇంత కవితాత్మకంగా వర్ణించి, ఇంత అద్భుత సృష్టి చేసిన మరో కవి లేనే లేడు. యోగ్యతాపత్రం పేరుతో మహా ప్రస్థానం పుస్తకానికి 1940లో చలం రాసిన పీఠిక. తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప పీఠికల్లో ఇది ఒకటి. 18ఏట 1928లో 'ప్రభవ' అనే కావ్యాన్ని సంప్రదాయ పద్ధతిలో రాసి ప్రచురించారు శ్రీశ్రీ. "1950లో మహాప్రస్థానం మొదటిసారిగా ప్రచురితమైంది. ఇది ఆయన్ని మహాకవిని చేసింది. తరువాత మరో ప్రపంచం, ఖడ్గసృష్టి అనే కవితా సంకలనాలను వెలువరించారాయన. చరమరాత్రి పేరుతో కథల సంపుటి, రేడియో నాటకాలనూ రచించారు శ్రీశ్రీ. వరం వరం, అమ్మ, మేమే, త్రీఛీర్స్ ఫర్ వన్‌మెన్, మానవుడి పాట్లు, సౌధామిని (పురిపండా గేయాలకు ఆంగ్లానువాదం) గురజాడ, మూడు యాభైలు, వ్యూలు, రివ్యూలు, లెనిన్ రెక్క విప్పిన రివల్యూషన్, వ్యాసక్రీడలు, మరో మూడు యాభైలు, చీనాయానం, సిప్రాలి, శ్రీశ్రీవ్యాసాలు, అనంతం (ఆత్మకథ) వంటివి గ్రంథాలను వెలువరించి సాహిత్యంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకొని, ఎవరూ చేరలేనంత ఎత్తులకు ఆయన ఎదిగారు. ఇక ఆయన రాసిన సినిమా పాటలు కూడా ఎంతో జనాదరణ పొందాయి." విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయిత సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా, హేతువాది మరియు నాస్తికుడిగా పేరు పొందిన మహాకవి శ్రీశ్రీ జూన్ 15, 1983న కన్నుమూశారు.

తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన మహాకవి. అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ. ఆధునిక కవిత్వా నికి వేదం లాంటి మహాప్రస్థానం రచించి మానవాభ్యు దయాన్ని ఆకాంక్షించిన మహాకవి. ఆకాశమార్గంలో పయనిస్తున్న జగన్నాథ రథచక్రాలను భూమికి దింపిన దార్శనిక కవి. పద్యాన్ని విడిచి వచన పద్యాన్ని గేయ కవితను అందుకొని ఎన్నో కొత్త భావాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆలోచింపజేస్తున్న క్రాంతిమూర్తి. మార్క్సియ సిద్ధాంతాలతో ప్రభావితుడై అదే భావధారతో ఉత్తేజమైన రచనలు వెలిగించిన విప్లవమూర్తి.

తెలుగు సినిమాపాటల చరిత్రలో అభ్యుదయ విప్లవ కవితోద్యమాలు ప్రేరణగా వచ్చినవి ప్రగతిగీతాలు పాట లకు సంబంధించినంత వరకు తెలుగు సినిమాల్లో ఉప యోగించిన మొదటి విప్లవాత్మకగీతం 'కాలచక్రం'లోని శ్రీశ్రీ మహాప్రస్థానగేయమే. 50ల దశకంలో సామ్యవాద సిద్ధాంతాల ఛాయలుగల కొన్ని పాటలు వచ్చాయి.

విప్లవాత్మక చిత్రాలలో అన్నీ ఆ బాణీకి తగిన పాటల్ని రాయించడం ఎనభయ్యవ దశకంలో నవతరం పిక్చర్స్‌తోనే ప్రారంభమైనది. ఆ ధోరణికి దోహదం చేసిన చారిత్రక నేపథ్యాన్ని సినిమా పాటలుగా వచ్చిన శ్రీశ్రీ 'మహా ప్రస్థానం', 'ఖడ్గసృష్టి' కవితా సంకలనాల్లోని కవితల్ని ముందుగా పరిశీలించాలి. తెలుగు సినిమాపాటల్లో చైతన్యగీతాలు రావడానికి మొదట అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి దోహదం చేశాయి.

50ల దశకంలో మద్రాసు వచ్చిన వామపక్ష సభ్యుల ప్రయత్నాలకంటె శ్రీశ్రీ అభ్యుదయ గీతాలే 80వ దశకంలో వచ్చిన ఎర్రపాటలకు ఎక్కువ స్ఫూర్తినిచ్చాయి. 'కాల చక్రం'తో సినిమా పాటలుగా రావడం రపారంభమైన శ్రీశ్రీ కవితలు ఆ తర్వాత 'పల్లెటూరు', 'రణభేరి', 'పదండి ముందుకు', 'నేటి భారతం', 'భారతనారి', 'మహా ప్రస్థానం', 'విప్లవశంఖం', 'సత్యాగ్రహం', 'స్వరాజ్యం' మొదలైన చిత్రాల్లో సినిమా పాటలుగా వచ్చాయి. వీటిలో కొన్నిటిని యథాతథంగా సినిమాల్లో తీసుకొంటే- కొన్నిటికి శ్రీశ్రీయే మార్పులు చేర్పులూ చేసి యిచ్చారు. ఇలా ముందుగా అచ్చయిన కవితల్ని మార్చి సినిమా పాటలుగా చేసిన కవులలో శ్రీశ్రీదే అగ్రస్థానం. 'పల్లెటూరు'లో 'పొలాలనన్నీ హలాలదున్నీ' (ప్రతిజ్ఞ-మహాప్రస్థానం) అనే గీతాన్ని, 'నేటి భారతం', 'భారతనారి' చిత్రాలలో- 'యముని మహిషపు లోహఘంటలు', (అవతారం- మహా ప్రస్థానం); 'స్వరాజ్యం' చిత్రంలో 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' (జయభేరి-మహాప్రస్థానం), 'సత్యాగ్రహం'లో- 'పాపంపుణ్యం ప్రపంచమార్గం (శైశవ గీతి- మహాప్రస్థానం మొదటి రెండు చరణాలు మాత్రం) గేయాలను యథాతథంగా ఉపయోగించారు.

సాహిత్యంలో శ్రీశ్రీ చెయ్యని ప్రక్రియలేదు. పద్యం రాయడంలోనూ, గద్యం రాయడంలోనూ సవ్యసాచి. గేయాలనీ, లిమరిక్కులనీ, శతకాలనీ - ఇలా భాషలో ఉన్న అన్నిరకాల ప్రక్రియల్నీ ఔపోసన పట్టినవారు. చమత్కారాలూ, 'పన్'లూ రిటార్ట్‌లూ సరేసరి. మాటలతో గారడీలు, పారడీలూ చెప్పనే అక్కర్లేదు ఇలాంటి రచయితని 'డబ్బింగ్' కోసం తెచ్చుకుంది సినిమా. ఒక భాషలో ఉన్న మాటల్ని, ఆ పెదవుల కదలికల్నిబట్టి, అదే అర్థం తెస్తూ తెలుగుమాటలు రాయగల సమర్థుడెవరు? అని ఆలోచించి, మొదటి డబ్బింగ్ చిత్రం తీసిన నిర్మాతలు శ్రీశ్రీని పట్టుకున్నారు. డబ్బింగ్ రాయడం ఒక ఫీటు. ఆ ఫీటు చెయ్యగలవాడు, థాటుగలవాడూ శ్రీశ్రీయే అని 'నీరా అవుర్ నందా' అనే ఆ హిందీ సినిమాకు, ఆయన చేత రాయించారు ఆ నిర్మాతలు. అదే తెలుగులో 'ఆహుతి' పేరిట 1950లో విడుదలైంది. ఐతే, పరోక్షంగా ఆయన 1940లోనే సినిమా ప్రవేశం చేశారు. అమంచర్ల గోపాలరావు తీసిన 'కాలచక్రం' చిత్రంలో శ్రీశ్రీ రాసిన 'మరో ప్రపంచంలో పిలిచింది' గేయాన్ని ఉపయోగించు కున్నారు.

ఆంధ్రప్రభ, ఆనందవాణి పత్రికల్లో పదేళ్లపాటు ఉద్యోగం చేశాక, 1950లో సినిమాల్లో పెట్టిన కాలు అక్కడే నిలదొక్కుకుంది. 'ఆహుతి' డబ్బింగ్ సినిమాయే అయినా, అందులో ఆయన రాసిన పాటలు అందర్నీ ఆకర్షించి, హెచ్.ఎమ్.రెడ్డి సంస్థ రోహిణిలో 'ఆస్థానకవి'ని చేశాయి. 'నిర్దోషి' (51)లో ఆయన కొన్ని దృశ్యాలూ, పాటలూ రాశారు. మూనాస్ 'ప్రపంచం' (53) ఆరంభిస్తూ శ్రీశ్రీని కూడా ఒక రచయితగా తీసుకున్నారు. విఠలాచార్య 'కన్యా దానం' (55) చిత్రానికి శ్రీశ్రీ పాటలూ, మాటలూ రాశారు.

కథ విని, సందర్భాలు వినీ శ్రీశ్రీగారు ఒక్కరోజులోనే పన్నెండు పాటలు రాశారు! గ్రేట్!'' అని విఠలాచార్య చెప్పేవారు. డబ్బింగ్ చిత్రాలకు రచయితగా మాటలూ, పాటలూ, అసలు చిత్రాలకు పాటలూ ఎన్నెన్నో రాశారు శ్రీశ్రీ. ఎన్నదగ్గ పాటలు ఎన్ని? అని అడిగితే, లెక్క తేలదు. ''ఉద్రేకం. ఉత్తేజం కలిగించే పాటలు రాయాలంటే శ్రీశ్రీయే రాయాలి!'' అన్నారు సినిమావారు. పాట లమీదనే ఎక్కువగా దృష్టి పెట్టుకోవడంతో మాటలు రాసిన చిత్రాలు తక్కువే. 'కన్యాదానం' కాక, 'మరదలుపెళ్లి

(52), అక్కా చెల్లెళ్లు' (57) చిత్రాలకు ఆయన మాటలూ, కొన్ని పాటలూ రాశారు. ఆయన రాసిన అన్నిరకాల పాటల్లోనూ ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. అవి 'కాకి నలుపు నిమ్మకాయపులుపు' (మనోహర:54), 'తూరుపు సిందూరపు మందారపు' (మనుషులు మారాలి:69), 'కలకానిది విలువైనది' (వెలుగనీడలు:61) అయినా సరే, భక్తి, రక్తి, శక్తి, హాస్యం, లాస్యం, ఆనందం, విషాదం అన్నీ రాశారు శ్రీశ్రీ.

ఎర్రటిఛాయలో ఉండే శ్రీనివాసరావు, వేళ్లమధ్య సిగరెట్టు బిగించి, పెదవులతో లాగినప్పుడు సిగరెట్టు నిప్పు మరింత మండి, ఆయన ముఖాన్ని ఇంకా ఎర్రగా చూపించేది. చాలా సౌమ్యమైన కంఠం, మధ్యమధ్యలో చిన్ననవ్వు - చిరులక్షణాలు. పైజమా, షర్టు వేసుకుని కార్లలో తిరిగారు; బస్సుల్లో తిరిగారు; నడిచారు. భేషజం ఉండేది కాదు. సిగరెట్టు కాలుస్తూ బస్సు స్టాపుల్లో నిలబడి దిక్కులుచూస్తున్నా, ఏదో ఆలోచన కనిపించేది. కనిపించిన ప్రతి పుస్తకం, కాగితం చదవడం ఓ ఆలవాటు. చాలాకాలం క్రితం ఒక సినిమా ఆఫీసులో పాట రాయ డానికి వచ్చిచ, సంగీతదర్శకుడు ఇంకా రాలేదని శ్రీశ్రీ ఇడ్లీ తెమ్మన్నారు. ఇడ్లీ - పొట్లం లోపల ఉన్నా, పైన పాత న్యూస్‌పేపరు చుట్టివుంటే, ఆ కాయితం విప్పి, అటూ ఇటూ తిప్పి, చదివిన తర్వాతగానీ ఇడ్లీ తినలేదు. ''పారేడానికి లేదు, ఏదో నో పాయింటుంటుంది!'' అన్నారు శ్రీశ్రీ -గొప్పచదువు చదువుకున్నవాడైనా, పాత వార్తాపత్రిక ముక్కలో ఏముందో చూడాలన్న ఆసక్తి ! మాటికి మాట వెంటవెంటనే చెప్పడం, చమత్కారం చెయ్యడం శ్రీశ్రీ ఆభరణం. చాలా వరకు ప్రచారంలో ఉన్నా, వాటిని మళ్లీ చెప్పుకుని ఆనందించడంలో తప్పులేదు. శ్రీశ్రీ, ఒక పత్రికమిత్రుడి ఆఫీసుకు వెళ్లి, ''ఏమిటాలోచిస్తున్నారు? పదండి అలా వెళ్దాం!'' అంటే, ''ఫోటో వెయ్యాలి. కొచ్చిన్ సిస్టర్స్ వేద్దామా అని ఆలోచన!'' అని మిత్రుడంటే, తడీమని శ్రీశ్రీ ''ఎందుకొచ్చిన సిస్టర్స్ - పదండి!'' అన్నారు.

శ్రీశ్రీ వివిధ తరగతులకు చెందిన గీతాలతో పాటు ప్రణయ యుగళగీతాలను, హాస్య గీతాలను, తత్త్వ గీతాలను, భక్తి గీతాలను, హరికథలను, యక్షగానాలను.. -ఇలా అన్ని రకాల పాటలను రాసి కేవలం వాడి వేడి గల పాటలేకాదు - గుండెను తడిచేసే పాటలను కూడా రాయగలనని నిరూపించుకొన్నారు. అయితే తెలుగు సినీగేయ చరిత్రలో శ్రీశ్రీ ప్రత్యేకత మాత్రం ఎరుపు ముద్రనే అంశాన్ని ఎవరూ కాదన లేదు. ఆపైన- తన భావాలెంత పదునైనవో అంత పదునుగానూ సూటిగానూ వాటిని వ్యక్తీకరించే ప్రజ్ఞగల శబ్దవిరించి శ్రీశ్రీ అనడంలో సందేహం లేదు.

'ఈ గుర్రపు పందెంలో ఫలానా గుర్రం గెలుస్తుందని నిశ్చయంగా ఎలా చెప్పలేమో అలాగే ఫలానా చిత్రంలో ఈ పాట 'హిట్' అవుతుందని నిక్కచ్చిగా చెప్పలేం.

చాల కాలం కిందట ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'పెంపుడు కొడుకు' చిత్రానికి నేను పాటలు రాస్తున్నాను. యస్.రాజేశ్వరరావు సంగీత దర్శకుడు.

'ఉన్నవారికే అన్ని సుఖాలోరయ్యో! అయ్యో!
లేని వారికి ఈ లోకంలో నుయ్యో గొయ్యో!'

అనే పాటను ట్యూన్ చేస్తూ రాజేశ్వరరావు పాడు తున్నాడు. అప్పుడు కిటికీ బయట బోలెడు మంది జనం ఆ పాటకు ఆకర్షింపబడి పోగయ్యారు. తప్పకుండా ఈ పాట హిట్ అయి తీరుతుందని మేమందరమూ అనుకొన్నాం. కాని 'పెంపుడు కొడుకు' బాక్సాఫీసు వద్ద ఫెయిల్ కావడంతో ఆ పాటకు రావలసినంత గుర్తింపు రాలేదు' అంటూ ఓ పాట విజయవంతం కావడానికి అనేక కారణాలుంటాయని విశ్లేషించిన శ్రీశ్రీ తను రాసిన సుమారు వెయ్యిపాటలలో (అనువాద గీతాలు కలుపు కొని) ఒక వందయినా నాలుగు కాలాలపాటు నిలుస్తా యనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. 'పంతాలు- పట్టింపులు' చిత్రంలోని-

'ఇనుకోరా ఇనుకోరా
ఈ మల్లన్న మాటే ఇనుకోరా!'

తన పాటల్లో తనకు నచ్చిన పాటని చెప్పారు. ఆయన దృష్టికోణం అది. మరి శ్రీశ్రీ పాటల్లో జనం మెచ్చిన వాటిని కొన్నిటిని చూద్దాం-

1. ఆకాశవీధిలో అందాల జాబిలి (మాంగల్య బలం-1959)
2. నందుని చరితము వినుమా (జయభేరి-1959)
3. కలకానిదీ విలువైనదీ (వెలుగునీడలు - 1960)
4. పాడవోయి భారతీయుడా (వెలుగునీడలు-1960)
5. పయనించే మన వలపుల బంగరునావ (బావా మరదళ్లు -1961)
6. పాడవేల రాధికా ప్రణయసుధా గీతిక (ఇద్దరు మిత్రులు-1961)
7. ఏమని పాడెదనో ఈ వేళ (భార్యాభర్తలు-1961)
8. జోరుగా హుషారుగా షికారు పోదమా (భార్యా భర్తలు-1961)
9. నా హృదయంలో నిదురించే చెలీ (ఆరాధన-1962)
10. ఎవ్వరి కోసం ఈ మందహాసం (నర్తనశాల-1963)
11. ఓ సజీవ శిల్ప సుందరీ (పునర్జన్మ-1963)
12. ఉందిలే మంచికాలం ముందు ముందన (రాముడు-భీముడు-1964)
13. నినుజేర మనసాయెరా (బొబ్బిలి యుద్ధం-1964)
14. మనసున మనసై బ్రతుకున బ్రతుకై (డా॥చక్రవర్తి-1964)
15. నీవు నా పూహలందే నిలిచావు (ఇల్లాలు-1965)
16. బొమ్మను చేసి ప్రాణము పోసి (దేవత-1965)
17. నారాణి కనుల లోనె.. (చిలకా-గోరింక-1966)
18. ఓహో! మోహన రూపా (శ్రీకృష్ణ తులాభారం-1966)
19. తూలీ సోలెను తూరుపు గాలి (అడుగు జాడలు-1966)
20. తూరుపు సిందూరపు మందారపు వన్నెలలో (మనుషులు మారాలి-1969)
21. కళ్లలో పెళ్లిపందిరి కనపడసాగె (ఆత్మీయులు -1969)
22. మహోతుమడే కలలు గన్న మరో ప్రపంచం (మరోప్రపంచం-1970)
23. దేవుడు చేసిన మనుషుల్లారా (దేవుడు చేసిన మనుషులు-1973)
24. తెలుగువీర లేవరా, దీక్షబూని సాగరా (అల్లూరి సీతారామరాజు-1974)
25. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని (భూమికోసం-1974)
26. కలసిపాడుదాం తెలుగుపాట (బలిపీఠం-1975)
27. సమరానికి నేడే ప్రారంభం (యమగోల-1977)
28. ఇలాగ వచ్చి అలాగ తెచ్చి (గోరింటాకు-1979)
29. నేడే ఈనాడే ప్రజాయుద్ధ సంరంభం (ఈనాడు - 1982)
30. అర్ధరాత్రి స్వతంత్రం, అంధకార బంధురం (నేటి భారతం - 1983)

శ్రీశ్రీ చెప్పినట్టు ఇవి మాత్రమే ఉత్తమ గీతాలు కాకపోవచ్చు- కాని ఇవి జనంలో ప్రచారం పొందిన పాటలు. ఈ జనరంకమైన జాటల జాబితా నుంచి ముచ్చటించుకో దగిన విశేషాంశాలు గల కొన్ని పాటల పూర్తి పాఠాలను చూద్దాం-

కలకానిది, విలువైనది-బ్రతుకు
కన్నీటి ధారలలోనే బలిచేయకు
ఏదీ తనంతతానై నీ దరికిరాదు
శోధించి సాధించాలి, అదియే ధీరగుణం ॥కల॥
(వెలుగునీడలు)

అవకాశం దొరికినపుడల్లా శ్రీశ్రీ తన సినీగేయాల్లో సామాన్యుడి మనసుకు హత్తుకొనేలా సూక్తులను, హితోక్తులను సందేశాలను సంధించారు. అలాంటి సందేశాత్మకమైన ఈ పాట ఆత్మహత్యకు పూనుకున్న ఓ వ్యక్తిని ఆలోచింపజేసి ఆ ప్రయత్నాన్ని విరమింపజేసి పూర్ణాయువును పోసిందట!

ఈ పాట ముక్తాయింపులో మనిషికి ప్రయత్నం, పట్టుదల ముఖ్యమనీ, ఏదీ తనంతతానై దరికిరాదనీ, శోధనతోనే సాధన సాధ్యమౌతుందనీ అమూల్యమైన సందేశాన్నిచ్చారు కవి.

'సుడిలో దూరి ఎదురీదకా
మునకే సుఖమనుకోవోయ్' (దేవదాసు)

అన్న భావనకు భిన్నమైన ఆశావహమైన సందేశం ఈ పాటలోని విశేషం.

ఈ పాట ప్రభావం గురించి సుద్దాల అశోక్‌తేజ ఇలా రాశారు.

'సినీగీతాలలో పాజిటివ్ థింకింగ్ గురించి, సర్వనాలిటీ డెవలప్‌మెంట్ గురించి ఇటీవల మేం- అంటే సీతా రామశాస్త్రి గారు 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' చంద్రబోస్ 'రేపన్నది మాపన్నది పనికిరాదులే... ఓ మారియా' నేను 'ఒకటే జననం ఒకటే మరణం..' రాసినా- ఆనాడే 'కలకానిది విలువైనది..' అంటూ ఒక విజయపథ గమనాన్ని చూపించే గీతా సంజీవినీ పర్వతాన్ని నిలిపి 'ఏదీ వదల లేదు శ్రీశ్రీ 'అని పించుకున్నాడు..'

తెలుగు సినిమా చరిత్రలో అభ్యుదయ, విప్లవ భావాలతో సినీ గేయాలు రాసిన కవులలో శ్రీశ్రీ మొదటి వరుసలో నిలబడతారు. ఆయన రాసిన ప్రతిపాట ఆణిముత్యమే, ప్రతిపాటలో ఆలోచించే గుణంతో పాటు చైతన్యం ఉంటుంది. ఇది శ్రీశ్రీ పాటల ప్రత్యేకత.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీశ్రీ మహాప్రస్థానం - ప్రజాశక్తి పబ్లికేషన్స్, హైదరాబాద్.
2. ద్వా.నా. శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. డా॥. జి. నాగయ్య, తెలుగు సాహిత్య సమగ్ర నవ్య పరిశోధన ప్రచురణలు, తిరుపతి.
4. అంపశయ్య నవీన్, తెలుగు సాహిత్య వ్యాసాలు, ప్రత్యూష ప్రచురణలు, వరంగల్.

❖❖❖

# స్త్రీ వాద కవిత్వంలో వివాహ వ్యవస్థ

- కుమ్మరి ఆదిలక్ష్మి, పరిశోధక విద్యార్థి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

ప్రాచీన సాహిత్యాన్ని పద్యం నడిపిస్తే ఆధునిక సాహిత్యాన్ని కవిత్వం నడిపిస్తుంది. కవిత్వం సృజనాత్మక ప్రక్రియ. ఆ సృజనాత్మకకు జీవిత అనుభవాలు గాయాలు, నొప్పులు అణచివేత, ధిక్కారం వంటివి కలగలిసి కవిత్వం పాయలు పాయలుగా ప్రవహిస్తుంది. ఆ క్రమంలోనే భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, బిసి కవిత్వం ఇలా పలు రకాలుగా వివిధ భావజాలలలోకి కాలానుగుణంగా కవిత్వం నిలబడింది. అనేక అస్థిత్వాల మూలాలలోకి కవిత్వం వచ్చి చేరింది. దేని ప్రత్యేకత దానిది. దేని వ్యక్తీకరణ దానిది. దేని నడక దానిదే. ఆప్రత్యేక సృజ నాత్మక వ్యక్తికరణలో స్త్రీవాదం పుట్టింది.పురిటి నొప్పులను కవిత్వంలోకి తీసుకొచ్చింది. స్త్రీ వ్యవస్థ, వివాహ జీవితం, స్త్రీ లోపలి మనోవేదన, బాధ, కట్టుబాట్లు, కన్నీళ్ళు పలు విధాలుగా కవిత్వ అంశాలుగా రూపుదిద్దుకున్నాయు.

స్త్రీ వాద దృక్పథం మూలాలనుపరిశీలన, పరిశోధనతో అధ్యయనం చేసినప్పుడు తెలుగు సాహిత్యంలో స్త్రీ వాదంలో త్రిపురనేని శ్రీనివాస్ సంపాదకత్వంలో వచ్చిన "గురి చూసి పాడే పాట" పుస్తకం మొదటిదిగా చెప్పవచ్చు. ఈ పుస్తకంలో స్త్రీ బాధలను స్త్రీ కవిత్వాన్ని పురుషులు మాత్రమే కాదు స్త్రీలు రాయాలనే ఆలోచనను కదిలిం చారు. స్త్రీలు కవిత్వంవైపు కదలడానికి కారణమైనవాటిలో ఇది ఒకటి కావడం చెప్పుకోదగిన విషయం. దీని కేంద్రంగానే స్వయంగా స్త్రీలు రాసిన కవితలను ఓల్గా, వసంత కన్నభిరామన్ సంపాదకత్వంలో బృహత్ స్త్రీల కవితా సంకలనం " నీలిమేఘాలు 1993 లో భూమిక ట్రస్ట్ ప్రచురించింది.

తెలుగు సాహిత్యంలో స్త్రీల బాధలను, సమస్యలను స్త్రీలు స్వయంగా రాసిన కవితా సంకలనం ఇది. "కవిత్వం చేయవలసినపని మనసు ఖచ్చితంగా ఆలోచింప చేయడం కాదు సత్యంగా అనుభూతి చెందించడం" అని ఆంగ్లకవి ఎఫ్.ఎం. రాబర్ట్ సన్ అంటాడు.(ఆధునిక తెలుగు కవిత్వం తీరుతెన్నులు 2007:11). దీనిని ఆధారంగా కవులైన కవయిత్రులైన వారి జీవితాలలో జరిగిన అను భూతులకు అక్షరాలను జోడించి రాస్తారు.అది నిజ జీవితాన్ని వాస్తవ దృశ్యాలను చదివే పాఠకులను చలించేలా చేస్తాయి.

సమాజంలో స్త్రీ కేంద్రంగా అనేక విషయాలపై కవిత్వం వచ్చింది. చిన్నప్పటి నుండి స్త్రీలను మాట్లాడ నివ్వకపోవడం బాల్య వివాహాలు, మానసిక హింస వంటి అనేక విషయాలను మాట్లాడినప్పుటికీ సామాజిక జీవితంలో వివాహం ముఖ్యమైన వ్యవస్థ. సమాజ ఆరోగ్యాన్ని నిలబెట్టేవి స్త్రీ పురుష సంబంధాలలో వివాహ వ్యవస్థ ప్రముఖ పాత్ర వహిస్తాయి. మొదట ఈ వివాహ పద్దతి లేదు. మానవుడు మొదటి దశలో గుంపులు గుంపులుగా ఉండేవారు, ఆ గుంపు కుటుంబంగా మారే కొద్ది జన సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇలా ఆడ మగ వివాహం చేసుకోవటం, పిల్లల్ని కనటం, వారికి వారు నియమాలు నియమించుకోవటం ఈ విధంగా ఏర్పడి ఉండవచ్చు. ఈ వ్యవస్థలో తరాలు మారుతున్న కొద్ది పద్దతుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఎక్కువగా వివాహాలు కుల పెళ్ళిళ్ళు, మత పెళ్ళిళ్ళుగా కనిపిస్తాయి. వివాహం గురించిన, వివాహ వ్యవస్థలో స్త్రీలు ఎదుర్కొన్న వివక్షను కవితలలో ఎవరికి నచ్చిన కోణంలో వారు సమాజాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు.

సావిత్రి రాసిన బందిపోట్లు(1984) అనే కవిత పెళ్ళితోనే స్త్రీ తన స్వేచ్ఛను భర్త ఎలా హరిస్తాడో తేల్చి చెప్పిన కవిత. " పెళ్ళంటే పెద్ద శిక్షని! మొగుడంటే స్వేచ్ఛ భక్షకుడని!!(కవితా ఓ కవితా 1994:37).

భార్య యొక్క స్వేచ్ఛని పెళ్ళి అయినప్పటి నుంచి భర్త తినేస్తాడు అని వ్యంగ్యంగా వ్యక్తికరించారు.

ఘంటసాల నిర్మల ఎ కాల్ గర్ల్స్ మోనొలాగ్(1988) లో కాల్ గర్ల్స్ పడుతున్న ఇబ్బందులను కళ్ళకు కట్టినట్లుగా దృశ్యాలు దృశ్యాలుగా కవిత్వీకరించారు. వివాహ వ్యవస్థలో స్త్రీల పరిస్థితి అంతే దయనీయంగా ఉంది. వాళ్ళు ఎక్కువ మందితో శృంగారంలో పాల్గొంటే, భార్య తన జీవనం కోసం ఒక్కరితో/ భర్తతో వ్యభిచారం చేస్తూ రాజి పడుతుందనే విషయాలను చర్చలోకి తీసుకొచ్చారు.

"పావలానించీ పదివేలకైన వరకైనా
కరకు కాసుల్ని కామంతో తుంచగలదాన్ని
కాలాన్ని మౌనంగా తుంచగలదాన్ని"

(ఘంటసాల నిర్మల).

లైంగికంగానే కాదు. స్త్రీ శరీరం వారసత్వం పేరుతో మాంస ముద్దలుగా చూస్తున్నారు. ఆమె శరీరం పిల్లల కోసం ప్రయోగింపబడే ప్రయోగశాల. వీటిని నిరసిస్తూ కొండేపూడి నిర్మల లేబర్ రూమ్ (1989) ఒక గర్భం నుండి బిడ్డ బయటికి రావడానికి, చూట్టు ఉన్న పరిస్థితులను చెబుతూ, ఆ తల్లి పడే నరకయాతనను చెప్పారు. ప్రాణాలు పోయేంత నొప్పిని అనుభవిస్తారని పాటిబండ్ల రజని అబార్షన్ స్టేట్ మెంట్ (1990) చెప్తారు. బిడ్డలు ఒకరి తరువాత ఒకరు కలుగుతారు. ఒక బిడ్డ పెరగక ముందే మరొ బిడ్డని పెంచటానికి సంసిద్దులై ఉండరు. అందుకే ఆ బిడ్డను చంపుకోలేక వ్యవస్థను తిడుతున్నారు అంటూ పిల్లల్ని చంపుకునే మార్గాలను కనిపెట్టిన వాళ్ళపై ఉమ్మ నీళ్ళతో ఉమ్మేయాలని తన ఆవేశాన్ని కవితలో తెలిపారు. పెట్టుబడి దారి వ్యవస్థలో స్త్రీ శరీరం వ్యాపారంగా ఎలా మారింది. ముఖ్యంగా అద్దె గర్భం వ్యవస్థ ఎవరికి లాభం. "నేటి మన వ్యాపార సంస్కృతిలో కొత్త వ్యాపారం, గర్భం ధరిస్తాం- మీ కోసం గర్భం ధరిస్తాం అంటూ శిలాలోలిత అద్దెకొక గర్భం అనే కవిత రాశారు. (పంజరాన్ని నేనే పక్షిని నేనే 1999:7).

స్త్రీ చూట్టు ఉన్న మత మౌఢ్యం వల్ల పురుషుడి చేత అసమానతలకు గురి అవుతూనే ఉంది. ప్రతీ మతంలోను స్త్రీ హింసకు గురవుతూనే ఉంది. ఆ కోణంలో కవిత్వం రాసిన రచయిత్రులు ఉన్నారు. ఈ క్రమంలో తొలి ముస్లిం స్త్రీవాద రచయిత్రి షాజహానా ముస్లిం మతంలో, కుటుంబంలో కట్టుబాట్లను తన కవితల ద్వారా వ్యక్త పరిచారు.

వాడు - ముసలాడయినా
ముగ్గురు పెళ్లాల్తో ముచ్చట తీర్చుకోవచ్చు
మనం నఖాబ్ ఎత్తితే - 'భూకంపం'!!

(అనార్కలి- షాజహానా).

షాజహానా 1998 లో రాసిన కవిత. ముస్లింలలో బహు భార్యత్వం కనిపిస్తుంది. పురుషుడు ఎన్ని వివాహాలు అయినా చేసుకోవచ్చు. అదే స్త్రీకి కనీస స్వేచ్ఛ లేకపోవడం బాధాకరం. బురఖాలో భాగంగా ముఖానికి కట్టుకునే దాన్ని నఖాబ్ అంటారు. నఖాబ్ ఎత్తి చూస్తే ఏదో భూకంపం వచ్చినట్టు అదిరి పడతారు అని రచయిత్రి తనలోపలి ఆవేదనను కవిత్వరికరించారు. ముస్లిం స్త్రీల చూట్టు ఉన్న బానిసత్వాన్ని, దుఃఖాన్ని ఎత్తి చూపారు.

నిజంగా నికాహ్ కుర్రే...
షాదీ ఐన్నాటి నుండీ
నేను అతని హవాలా అయిన్నాటినుండీ
ఆకాశమంత నవ్వుని కత్తిరించి
చిరునవ్వుగా మార్చాడు!

వివాహం పేరిట స్త్రీ పట్ల జరుగుతున్న కుట్ర ప్రశ్నించారు. ఆమె నవ్వును కూడ జీర్ణించుకోలేని పితృస్వామ్యం, పురుషుడు చేసిన హింసాత్మక నిషేధాలను కవిత్వంలో చెప్పారు. ఆకాశమంత నవ్వును ఎలా చిరునవ్వుగా మార్చరో చెబుతూ పెళ్ళి అయిన దగ్గర నుంచి స్త్రీకి కాంక్షలు విధిస్తారు. వారు పడుతున్న బాధలు తెలియక జీవితాంతం భరిస్తునే ఉంటారు. ముస్లింలలో తలాఖ్ అనే అనే పద్ధతి వాళ్ళ స్త్రీలు కోర్టు చుట్టు తిరిగేవాళ్ళు. ఆ తరువాత ఆ పద్దతిని నిషేధించినప్పటికి ఇప్పటికి మారు మూల ప్రాంతాలలో జరుగుతుంది. వివాహ వ్యవస్థ స్త్రీ స్థితి ఏమి మారలేదు. అదే మానసిక హింస. పితృస్వామ్య

భావజాలం వల్ల భార్యలపై అన్ని రకాల హింస కొన సాగుతూనే ఉంది. కొందరు అలాంటి భర్తలను భరించలేక విడాకులు తీసుకొని ఒంటరిగా మిగిలిపోతున్నారు. అయితే నిజానికి ఆ కాలం నుండి ఇప్పటి దాకా హింస కోణం కొంత మారుతూ వస్తుంది కానీ స్త్రీలపై పురుష అహంకారం కొనసాగుతూనే వుంది. దీనినినేటి కవులు, కవయిత్రులు వివాహ వ్యవస్థ కేంద్రంగా,స్త్రీ కేంద్రంగా అనేక విషయాలను కవిత్వంలోకి తీసుకొచ్చారు. జీవితం తాలూకు అనుభవాలను, బాధలను, హింసలను రికార్డు చేస్తూనే ఉన్నారు.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. శిలాలోలిత,2006. నారి సారించి. హైదరాబాద్: మాధ్యమం ప్రచురణ.
2. బాపురెడ్డి జె,2007. ఆధునిక తెలుగు కవిత్వం తీరుతెన్నులు. హైదరాబాద్: జూబ్లీ పబ్లికేషన్స్.
3. షాజహానా,2005. నఖబ్ ముస్లిం స్త్రీ కవిత్వం. ఖమ్మం: ప్రజాశక్తి బుక్ హౌస్.
4. శివ శంకర్ పాపినేని ( సంపా).1994. కవితా ఓ కవితా. విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్.
5. శిలాలోలిత,1999. పంజరాన్ని నేనే పక్షిని నేనే. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

❖❖❖

BHAVAVEENA
Vol. 21, Issue. 05, May 2024
భావవీణ
ISSN No. : 2456-4702 -
RNI No. APTEL/2003/12253

# తెలుగు కవిత్వంలో పోటెత్తిన ప్రవాహం విప్లవ స్త్రీవాదం

- కత్తెరపాక నవీన్, తెలుగు అధ్యాపకులు, కమ్మర్ పల్లి, నిజామాబాద్.

నేటి కృత్రిమమేధ సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో ముందు వరుసలో రాణిస్తున్నారు. స్త్రీవాద కవయిత్రులు చెప్పినట్లుగా మేము ఆకాశంలోనే సగం కాదు అన్నిటిలో సమం అని నిరూపిస్తున్నారు. కాని తరతరాల తెలుగు సాహిత్య చరిత్రలో ఎక్కడ చూసినా స్త్రీల పాత్ర అంతగా కనిపించదు. అయితే కాగితం మీద అక్కడక్కడా కొంత కనిపించినా ఆ కవయిత్రుల సంఖ్య ఎక్కువగా లేకపోవడం విచారించ దగినది. వేదకాలంలో, గాథా సప్తశతి గ్రంథంలో,రాధా కృష్ణుల ప్రణయ తత్త్వగీతాలలో ఎందరో కవయిత్రులు ఉన్నప్పటికీ చాలా మంది వరకూ చరిత్ర అజ్ఞాతంగా ఉండిపోవడం అత్యంత బాధాకరమైన విషయం. అయితే 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోకి రచయిత్రులు సునాయాసంగా ప్రవేశించారు. తమ గుర్తింపునీ సొంత ముద్రనీ సాధించుకున్నారు. ముఖ్యంగా ఇది స్త్రీలు సాధించుకున్న గొప్ప సాహిత్య విజయంగా అర్థం చేసుకోవాలి.

అయితే 1975-2000 నాటి కాలం స్త్రీల కవిత్వానికి సంబంధించి ఎంతో విలువైన కాలంగా పరిగణిస్తారు. ఎందుకంటే స్త్రీల చైతన్యం నుండి విప్లవ, దళిత, మైనారిటీ స్త్రీల కవిత్వం అనే నూతన ధోరణి పుట్టుకొచ్చి స్త్రీల సమస్యలపై పోరాటం చేసి విజయం సాధించి పెట్టింది. విప్లవ కవిత్వంలో స్త్రీల విషయానికొస్తే పోరాట రంగంలో పంచాది నిర్మల ముందు వరుసలో కనబడుతుంది కానీ విరసం నిర్మాణంలో కానీ దాని ఆవిర్భావంలో కానీ స్త్రీలు తొలి దశకంలో కనిపించక పోవడం జరిగింది. ఇక 1980 తర్వాతే విమల వంటి చురు కైన కవయిత్రులు విరసం ఆధారంగా ముందు కొచ్చారు. ఈమె స్త్రీల సమస్యల్ని మార్క్సిస్టు కోణం నుంచి శక్తిమంతంగా చిత్రించింది. ఆ తరువాత రత్నమాలను ప్రముఖంగా పేర్కొనవచ్చు. ఈ కాలంలోనే విప్లవోద్యమాల ప్రేరణతో జయప్రభ 'సూర్యుడు కూడా ఉదయిస్తాడు.' 'యుద్ధోన్ముఖంగా' 'వామనుడి మూడోపాదం' మొదలైన కవితా సంపుటాలతో చాల బలమైన వామపక్షపు భావ జాలాన్ని ఆవిష్కరించింది. అలాగే ఓల్గా కొన్ని కవితల్లో విప్లవ స్వరాన్ని వినిపించింది. తర్వాత విప్లవ కవయిత్రుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. పద్మ, నల్లూరి రుక్మిణి, నవత, సుధా కిరణ్,ఆర్. శశికళ, వసంత, ఈశ్వరి లాంటి కవయిత్రులు కనబడతారు.

ప్రధానంగా విప్లవ కవయిత్రులు రాజ్యానికీ స్త్రీలకీ ఉన్న సంబంధాల్ని బలంగా గుర్తించారు. పితృస్వామ్యం ఆర్థిక శక్తులతోనూ ఉత్పత్తి సంబంధాలతోనూ ముడిపడి ఉంటుందనే వాస్తవాన్ని బహిరంగం చేశారు. స్త్రీల అణచివేతకు శ్రమ దోపిడికి ఆర్థిక పరిస్థితులూ వర్గ వైరుధ్యమే ప్రధానమని భావించారు. ఆర్థిక సమానత్వం సమ సమాజం ఏర్పడినప్పుడే అన్ని వివక్షతలూ సమసిపోతాయనీ, అప్పుడే స్త్రీ పురుషుల మధ్య సమానత్వం సాధ్యమవుతుందని విప్లవ కవయిత్రులు విశ్వసిస్తారు. కులపీడనను వర్ణ సమస్యగా కాకుండా వర్గ సమస్యగానే భావిస్తారు. విప్లవ స్త్రీవాదం సామ్రాజ్యవాద వ్యాపార ధోరణినీ వస్తువుల ఆకర్షణనీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. స్త్రీవాదులు లేవనెత్తిన కారణాలకూ దళిత మైనారిటీ స్త్రీవాద సమస్యలకూ వర్గపోరాటమే అంతిమ ధ్యేయమని విప్లవ స్త్రీవాదం బలంగా భావించింది. రాజ్యహింసతో పాటు సాంఘిక, ఆర్థిక పీడనలో భాగంగానే స్త్రీలు లైంగిక వివక్షలకూ హింసలకు గురి అవుతున్నారని విప్లవ వాదం బలంగా కొట్లాడింది. 'నీలిమేఘాలు' తొలి స్త్రీవాద కవితా సంకలనానికి దృఢమైన పునాదులుగా నిలబడ్డ కవితల్లో విమల కవితలు కూడా వున్నాయి. ఆమె రాసిన 'సౌందర్యాత్మక హింస' 'వంటిల్లు' 'తెగబడిన మా కలల

ప్రపంచం' 'దిగంబరుల ఊరేగింపు' 'వేశ్యా 'శిశువు' కవితలు విమల కవిత్వంలోని ప్రత్యేకతని చాటి చెబుతాయి. ఆమె 'వంటిల్లు' కవిత వస్తురూపాల రీత్యా శిల్ప పరాకాష్ఠ నందుకుంది.

"ఈ వంటిల్లొక వదలని మోహమై
నా బాల్యాన్నంతా చుట్టేసుకుంది.
నాకు మా వంటిల్లొక అద్భుత మాయాజాలం
మా అమ్మ ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
'అసలు మా అమ్మే నడుస్తున్న వంట గదిలా
వుంటుంది"

అంటూ స్త్రీవాదులు తెలుగు సాహిత్యంలోకి తీసుకొచ్చిన కవితా విప్లవం, ధిక్కారం, మాతృత్వపు శైలి, తమకు మాత్రమే పరిచితమైన అనుభవాలూ ప్రత్యేక అనుభూతులూ అభివ్యక్తులూ ఎన్నో ఉన్నాయి.

"పాపా!
నిన్ను తలుచుకున్నప్పుడల్లా
దుఃఖంతో నేను పగిలిపోతాను.
చిట్టి తల్లీ
నీ పాల బుగ్గలపై గడ్డకట్టిన
కన్నీటి చారికల్ని శాశ్వతంగా
తుడిచేసేందుకు మేము
ఎన్నెన్ని నిప్పుల సముద్రాలైనా
ఎదురీదుతాము.
ఈ శిశు హంతకుల అంతం కై
ఈ నేలన ఎంత రక్తాన్నయినా
ధారపోస్తాము కన్నా!
నీ పెదవులపై నవ్వుల్ని పూయించేందుకు
ప్రాణమిస్తాం రా!" అంటూ ఆద్యంతం అత్యంత అర్థంగా సాగే ఈ కవిత ఒక్కొక్క వాక్యం హృదయంలో దడ పుట్టిస్తుంది. వేశ్యా శిశువుల్ని ఆదుకోవాలనే దయా దృష్టి కలిగిస్తుంది. విమల కవిత్వం సహజంగానూ స్పష్టంగానూ ఉంటుంది. గాఢమైన భావుకత, అదే స్థాయిలో తీవ్రత, అభివ్యక్తిలో సరళత ఆమె కవితా యొక్క శైలి.కవయిత్రి రత్నమాల ఉద్విగ్నభరితురాలు ఆమెది ఉద్యమ జీవితం. సంఘటనాత్మకంగా అప్పటికప్పుడూ కవిత్వం రాయగలదు. రాసిన కవిత్వం నిర్భయంగ నిక్కచ్చిగా ఉంటుంది. ఆమె రాసిన 'శ్మశాన సౌందర్యం' కవితను మంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

"పీడిత ప్రజా పోరులో సగాన్ని
కదనంలో నిలిచిన కామ్రేడ్ని
ఆదిమ గణాలకు నాయకత్వం
వహించిన ఆదిమానవిని"

మేము ఆకాశంలో సగం అంటారు స్త్రీవాదులు. కానీ రత్నమాల మాత్రం విముక్తి బాటలో నడుస్తూ 'పీడిత ప్రజా పోరులో సగాన్ని' అని సగర్వంగా చాటిచెప్పింది. ఆర్. శశికళ అనే కవయిత్రి విప్లవ నాదాల్లోంచి వినిపించిన వినూత్న స్వరం. 'పహారా' అనే కవితలో పురుషాధిపత్యం కింద స్త్రీ జీవితం ఎన్ని విధాలుగా అణచివేతకు గురవుతుందో కవిత్వీకరించింది. పురుష హింసను రాజ్యహింసగా భావించడం ఈ కవితలోని శిల్ప నైపుణ్యం,

"పురుషత్వం పహారా
అహంకారం
దిద్దుకొంటున్న క్షణం నుంచి
గర్భం జైలయి
శక్తులూ హక్కులూ పొందకుండా
లాకప్ మరణాల పహారా
స్త్రీత్వం వున్నంతవరకూ
శతకోటి రూపాల పహారా
అదిగమించిన చోట
ఇంకక్కడ సహారా!"

అంటుంది. విప్లవ స్త్రీవాద కవయిత్రుల్లో పద్మది గట్టి గొంతు. ఒకానొక విషాద సన్నివేశంలో నెల్లూరు నడిగడ్డ మీద ఎన్కౌంటర్కు బలి అయ్యింది. కవయిత్రి పద్మ పదును పెట్టిన కత్తుల్లాంటి కవితలు ఎన్నో రాసింది.

"పదునెక్కిన ప్రవాహం!
నెత్తిన మూటలతో

సంకన పిల్లలతో వంగిన నడుములతో
నాట్లేసిన పిడికిళ్లతో ఎరుపెక్కిన జీరలతో
కొడవళ్లయిన ఆ ప్రవాహం
అక్షరీకరించిన భావంలా
కలాల కవాతుల చెలరేగిన తుఫానులా
పోటెత్తిన సముద్రంలా
వేల కంఠాలు నినదించాయి.
మనుస్మృతులు ఉలిక్కిపడ్డాయి
తలరాతలనే పితృస్వామ్యాన్ని తలదన్ని
ఆ ప్రవాహం స్వేచ్ఛా పతాక ఛాయలో
పదునెక్కిన ఆయుధమై కదిలింది" అంటూ పద్మ రాసిన కవిత్వం మార్చ్ ఫాస్ట్ లా ఉంటుంది. ఎత్తుగడ లోనూ ముగింపులోనూ ఉద్వేగం తగ్గదు. ఎఱ్ఱ ఎఱ్ఱని మందారం స్త్రీ విముక్తికి సింధూరం అనే ఒక్క పంక్తిలోనే ఆమె చెప్పదలుచుకున్న విషయాన్ని, వివరించాలనుకున్న మార్గాన్ని స్పష్టం చేసింది. కేవలం అక్షరాల్లోనే కాదు, మహిళా విముక్తి మార్గంలో అచంచల కార్యకర్తగా పని చేసింది. ఉద్యమాలను ఆర్గనైజ్ చేసింది.ఆమె జ్ఞాపకాల్ని ఇలా వివరించుకుంది." స్త్రీ జీవించడమంటే ఇపుడున్న ఆంక్షలను ఉల్లంఘించడమే. మూగతనాన్ని శబ్దంపై సానబట్టి మాటలను పదునెక్కించడమే" పద్మ అలాగే జీవించింది. ఇప్పుడు ప్రజల్లో పాటల్లో జీవిస్తున్నది. పద్మ జీవితాన్నీ కవిత్వాన్ని అలోకిస్తే ఉద్యమం కోసం తన కలాన్నీ కంఠాన్నీ బలిదానం చేసిన అమర కవయిత్రిగా అక్షర లోకాల్లో నినదిస్తూ వుంటుంది అంటూ స్మరించు కున్నారు.

కవిత్వం విషయంలో విప్లవ కవయిత్రుల పాత్ర ఎంతో గణనీయమైనది.సంఘటనలకు స్పందించి గొప్ప కవిత్వాన్ని అందించారు. అన్యాయాన్ని ఖండించారు. 1984లో ఇందిరా గాంధి హత్య తరువాత సిక్కుల మీద హత్యాకాండ జరిగింది. విమల ఎంతో ఉద్వేగపు శైలితో 'కన్నతల్లి' అనే అద్భుతమైన కవిత రాసింది. అలాగే 1991 ఆగస్టు 6న జరిగిన చుండూరు దళితుల దమనకాండకు నల్లూరి రుక్మిణి ఎంతో స్పందించింది. ఆగస్టు 6 శీర్షికతో కవిత రాసింది. ఇతర స్త్రీవాదులెవరూ చుండూరు మీద కానీ, దళితులపై దాడుల మీద గానీ, దళిత స్త్రీల మానభంగాల మీద గానీ కవితలు రాసిన జాడలు లేవు. విప్లవ స్త్రీవాద కవయిత్రి నల్లూరి రుక్మిణి మాత్రం 'చుండూరు నెత్తుటి నీళ్లను చూసి కొయ్యబారి పోయింది కనీసం ఒక కవితైనా రాసి తన సానుభూతి ప్రకటించడం గమనించాల్సిన ముఖ్యాంశం. ఇదే విషయంలో కొందరు అగ్రవర్ణ కవులు దళితులు మమ్మల్ని రాయొద్దన్నారనే సాకు చూపించి మౌన ముఖాలు వేలాడేశారు.1990 నుంచి విరసంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పుకు ప్రపంచ పరిణామాలు ప్రధాన కారణాలు, రష్యాలో కమ్యూనిజానికి విఘాతం. యూరప్పరిణామాలు, గ్లోబలైజేషన్, వస్తు నాగరికత. సుఖ సంస్కృతి మీద వ్యామోహం సిద్ధాంతాల మీద నిబద్ధత సడలిపోవడం, నక్సలైట్ల లొంగుబాట్లు, చేస్తున్న పొరపాట్లు ఒకవైపు గని రాజ్యహింస, ప్రాణభీతి. ఎందుకొచ్చిన ఉద్యమం! ఇలాంటి భావాలతో విరసం కవుల్లో కొందరిలో అరాచక వాదం బయటపడిన సంగతి తెలిసిందే. కొందరు కవులు తిరుగుబాటు చేసి విరసం విడిచిపెట్టిన విషయం కూడా తెలిసిందే.

విప్లవ స్త్రీవాద కవిత్వం సాహిత్యానికీ సమాజానికి కొత్త నిర్వచనం చెప్పింది. లైంగిక, ఆర్థిక దోపిడి సభ్య ప్రపంచంలోనే కాదు అడవుల మధ్య అన్నల మధ్య కూడా ఉంటుందనీ, విప్లవ పురుషాధిపత్యమే దీని ప్రధాన హేతువనీ విప్లవ స్త్రీవాదం నిర్భయంగా ప్రకటించగల్గింది. అలాగే విముక్తి పోరాటాల వల్లనే మహిళా విమోచనం జరుగుతుందని ఖచ్చితంగా చాటి చెప్పింది. విప్లవ సాహిత్యంలోకి స్త్రీలు పాదం మోపిన తరువాతే అది మరింత శక్తివంతమూ కొత్త రూపము దాల్చిందనే వాస్తవాన్ని చరిత్ర కక్కించాలి. విచిత్రమూ విషాదమూ ఏమిటంటే సాయుధ పోరాటంలో అక్కలుగా తుపాకులు పట్టిన వాళ్లు అసంఖ్యాకంగా ఉన్నారు. కలాలు పట్టిన వాళ్లు బహు తక్కువ కావడం శోచనీయం. పోరాట స్త్రీల

రకరకాల అనుభవాలు, అడవుల్లో సుదీర్ఘ బీభత్స భయానక ప్రయాణాలు, శారీరక మానసిక సంఘర్షణలూ, ప్రేమలూ పెళ్లిళ్లూ లైంగిక దాడులూ, టార్చర్లూ ప్రకృతి అందాలు, పచ్చని జ్ఞాపకాలు, ఎన్ కౌంటర్లో సాహసాలూ తప్పించుకోవడాలూ ఇలా ఎన్నెన్నో అనుభవాలు అక్షరబద్ధం అయ్యింది.

**ఆధార గ్రంథాలు :**

1. విమల- వంటిల్లు
2. జయప్రభ - సూర్యుడు కూడా ఉదయిస్తాడు
3. నీలి మేఘాలు - వోల్గా, వసంత కన్నాభిరాన్

❖❖❖

# జానపద వ్రత గేయాలు - కౌటుంబిక సంస్కృతి

- చేరాల సుధాకర్, పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

“సాంఘిక సంక్షేమం కోసం, విశేష సందర్భాలలో జానపద విశేషాలు, సంప్రదాయాలు కలబోతగా ఆచరించే సంక్లిష్టమైన అంశమే పండుగ” అని బాగ్స్ పండుగను నిర్వచించాడు. కుటుంబం కోసం, వ్యక్తిగత సంక్షేమం కోసం చేసేవే వ్రతాలు. ఆ విధమైన వ్రతాలలో ప్రతి బింబించే కౌటుంబిక సంస్కృతిని పరిశీలించే ప్రయత్నమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

## పరిచయం :

వ్రతము అంటే ధృఢ సంకల్పంతో ఆచరించాల్సిన పని, ప్రవృత్తి, నివృత్తి రూపాలుగా అది రెండు విధాలు. భోజనం, పూజ మొదలైనవి ప్రవృత్తి రూపమైన విధాలు. ఉపవాసం వుండటం లాంటివి నివృత్తి రూపమైన వ్రతాలు. ప్రవృత్తి రూపమంటే కొన్ని పనులను చేయటానికి ప్రయత్నించటం, నివృత్తి రూపమంటే కొన్ని పనులను మానివేయటం. ఈ వ్రతాలు నిత్య నైమిత్తిక కామ్యములు అని మూడు రకాలు.

తప్పనిసరిగా చేయాల్సిన ఏకాదశి లాంటి వ్రతాలు నిత్య వ్రతాలు, చాంద్రాయణము (అనగా తెలుగు కారణాలను బట్టి అపుడపుడు చేసేవి) మొదలైనవి నైమిత్తికాలు. ఏవో కోరికలతో ఆయా తిథులలో చేసేవి కామ్యములుగా వాచస్పత్యములో తెలిపినట్లుగా డా॥. చింతపల్లి వసుంధరారెడ్డి తమ ‘తెలుగు జానపద సాహిత్యము’ అనే గ్రంథములో తెలిపినారు. వివిధ వర్గాల ప్రజలు తమ తమ కోరికల సాధనకు, తమ ఆత్మ సంతృప్తికి, లోక కళ్యాణానికి ఈ వ్రతాలను ఆచరిస్తారు.

తెలుగు వారి నోములు, వ్రతాలు మన ప్రాచీన విశ్వాసాలను, నాగరికతా దశకు వచ్చన వైనం ఈ వ్రతాలలో కన్పిస్తుంది. వీటిని చారిత్రక దృష్టితో చూస్తే సంప్రదాయ రక్షణ ధ్యేయం వీనిలో దర్శనమిస్తుంది. ముఖ్యంగా జానపద సాహిత్యంలోని స్త్రీల పాటలు మనకు తరాలుగా సంప్రదాయ విజ్ఞానాన్ని అందిస్తున్న స్పష్టమవుతుంది.

ఈ వ్రతాలలో బాల్య, యౌవన, కైమార, వార్ధక్యాలనే నాలుగు దశలలో ఆచరించే వ్రతాలున్నాయి. బాల్యదశలో స్త్రీలు కోరవలసిన సామాన్య సుఖ సంతోషాలు మొదలుకొని వార్ధక్యంలో కోరే కైవల్య ప్రాప్తి వరకు ఉండే అంశాలను ఈ వ్రత గేయాలు తెలియజేస్తాయి అని తెలుపుతూ మన తెలుగు నాట దాదాపు రెండు వందల వ్రత గేయాలు ప్రచారంలో వున్నట్లుగా శ్రీమతి వరలక్ష్మి గారు తెలిపినారు.

## ములగ గౌరీ వ్రతము :

‘ములగ నోము నోఇన వనితకు ముచ్చటలనే తీరతాయి’ అని సామెత. ఈ వ్రతాన్ని మాఘ పూర్ణిమ నాడైనా, రథ సప్తమి నాడైనా ప్రారంభించి ఏడాడిపాటు చేస్తారు. వ్రతం ముగింపు దశలో పన్నెండు మంది మెత్తైదువలకు చెరి పన్నెండేసి జతల ములగ కాడలు, లక్కజోడులు, నల్లపూసల దండ జతను దక్షిణ తాంబూలాలలో వాయసం ఇస్తారు. పూజలో

‘ములగ పేరెత్తరాదు, ములగను చూపించరాదు
ములగ నీడ నిలువరాదు, ములగను అంటరాదు
ములగను నోట పెట్టరాదు’

ఇది ఈ వ్రతంలో ఆంక్ష. ములగ చెట్టు త్వరగా ఎదిగి అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. ములగాకుతో చాలా వంటలు చేస్తారు. ములగకాయ ఉపయోగాన్ని గురించి చెప్పనవసరం లేదు. ములగబంక ఔషధాలకు ఉపయోగపడుతుంది. ఈ విధంగా ములగ ప్రాశస్త్యం గృహ వాతావరణంలో ఇమిడి వుంటుంది. అంటే కౌటుంబిక ఆరోగ్య పరిరక్షణకు గాను ఈ వ్రతాన్ని చేస్తారని అర్థం చేసుకోవాలి.

నేను నా వ్రత సమర్పణ పరిధి మేరకు ఒక ఐదు ఆరు వ్రత గేయాలను పరిచయం చేస్తున్నాను.

### శ్రావణ మంగళవారం మంగళ గౌరీ వ్రతము :

మన సంప్రదాయంలో వర్షఋతువుకు చాలా ప్రాధాన్యం ఉంది. ఈ ఋతువులో వానలు కురవడం, వానలు ఆగిన వెంటే మబ్బు విడిచిన ఎండలు రావడం వల్ల శరీర ఆరోగ్యం చెడకుండా ఆహార పానీయాలతో మార్పులను వైద్య శాస్త్రజ్ఞులు చెప్పారు. ఏ ఏ కూరగాయ లను తినాలో, ఏ ఏ పండ్లను భుజించాలో అనే నియమాలను ధర్మశాస్త్రజ్ఞులు వైదిక మతానుసారంగా తెలిపారు. శ్రావణ మాసాన్ని లక్ష్మీదేవి గాను, గౌరీదేవిగాను, సరస్వతి గాను మన పూర్వీకులు భావించారు. ఈ శ్రావణమాసం మొదలుకొని నాలుగైదు నెలలు పేరంటాళ్లు సంతోషంతో వచ్చినప్పుడు ఆ ఇల్లు కళకళ లాడుతాయి. పసుపు కుంకుమలతో వెలిగిపోతూ ఆ తెలుగు మహిళలు పేరంటానికి వెళ్ళడానికి ఎంత దూరమైనా వెళ్ళడానికి వెనుకాడరు.

శ్రావణ మంగళవారం నోము వివాహితలు, కన్యలు, పెళ్లయిన మొదటి సంవత్సరం నుండి వరుసగా ఐదు సంవత్సరాలు శ్రావణ మాసంలోని ప్రతి మంగళవారంలో ఈ నోమును ఆచరిస్తారు.

దీనికి సంబంధించిన పౌరాణిక, చారిత్రక గాథలు ఉన్నప్పటికీ శాస్త్రీయ విశ్లేషణలో భాగంగా కొన్ని వ్రతగేయాలను మాత్రమే పరిచయం చేస్తున్నారు. శ్రావణ మంగళ గౌరి వ్రత గేయాలలో సుప్రసిద్ధమైన ఒక గేయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

'ఈశ్వర పుత్రునకు గజావతారునకు
పార్వతీ తనయునకు భక్తితోను
వాక్యశుద్ధినిచ్చు వైభోగరాయునకు
శారదాంబును నేను సన్నుతించు"

'జయ మంగళం నిత్య శుభ మంగళం
మంగళ గౌరీకథ మహిమీద వెలిసిన
పాట గావించెతా భక్తితోను
మహిమీద ఒక రాజు సంతానము లేక
సౌభాగ్యవతి పదవి తానేలుచుండె ॥ జయ ॥

- అంతట పరమేశ్వరుని అనుగ్రహము వలన ఆ రాజునకు పుత్రుడు కలుగును.

సూర్యతేజంబుతో నొప్పేటి సుతునికి
పుత్రోత్సవము పుట్టె పుణ్యశాలి (కి)
సంతోషమున రాజు నామకరణము వ్రాసె
నారాయణయని నామమిడిరి

- అని కథ సాగును. విషయము తెలియని అత్తగారు

'ఏమి నోమి ఓచితివి, ఏ వ్రతము చేసితివి
పుత్రిభిక్షం బెట్టె పుణ్యశాలి'

- అని కోడలును ప్రశ్నించగా కోడలు

భగీరథిని చాలా భక్తితో పూజిస్తే
మీ వంటి అత్తమామలు కలుగుటకు
ఎక్కువ రాజ్యము మిక్కిలి సంపదా

- కలుగుటకు మంగళగౌరిని పూజించితినని సమాధానము చెప్పును. ఈ పాటలో ఫలశ్రుతి కూడ చెప్పబడింది.

'ఈ కథను పాడిన వారికి విన్నవారికి
ఆవును విభవంబులు
ఇష్టసంపదలిచ్చు రాజపదవినిచ్చు
సత్ఫలంబులిచ్చు సర్వేశురాణి ॥ జయ ॥

శ్రావణ మంగళగౌరి వ్రతమును వివాహమైన సంవత్సరం నుండి ప్రారంభించి ఐదు సంవత్సరాల వరకు చేయటం మనకు తెలిసిందే.

నియమ నిష్టలతో ఆచరించు వారి ఆచరణలో ఉండు నియమాలు క్రింద తెల్పబడింది. ఐదవ సంవత్సరం శ్రావణ మంగళవారం నందు పగలు యధావిధిగా మంగళగౌరీ పూజను ఆచరించే దంపతులు రాత్రి మంటపంను నిర్మించి అందు పదహారు కలశము లను స్థాపిస్తారు. ఆ కలశములందు ఉమామహేశ్వరు లను, బ్రహ్మను, గణపతిని, స్కందుని, శచీపురందరు

లను, సప్తమాతృకలను, లక్ష్మీనారాయణులను, సావిత్రిని, సమస్త దేవతలను నవగ్రహములను పూజించాలి. సాధ్యంకాని వారు ఐదింటిని చేయాలి. కనీసం రెండింటి నైనా చేయాలి. ప్రతి యామములో శ్రద్ధతో పూజించాలి. మరుసటిరోజు స్నానం చేసి బెల్లం, జీలకర్ర, పరమాన్నం, నెయ్యి, రావిపుల్లలు మొదలైన వాటితో హోమం చెయ్యాలి. "సర్వమంగళ మాంగళ్యే" అనే మంత్రం ఈ వ్రతంలో ప్రధానమైనది. పదహారు వెదురుపాత్రలలో మంగళ ద్రవ్యాలు ఉంచి గృహిణులకు వాయనాలు ఇవ్వాలి.

## శ్రావణ శుక్రవారం నోము : వరలక్ష్మీ వ్రతము

శ్రావణ మాసమున నోములు నోచుటకు మంగళ, శుక్రవారములు విశిష్టమైనవి. శుక్రవారం లక్ష్మీదేవిని, మంగళవారం గౌరీదేవిని గొప్పగా పూజిస్తారు. శ్రావణ శుక్రవారంలో శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చు శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం ఆచారం కలదు. వరలక్ష్మీ వ్రతము ప్రతి తెలుగు మహిళ గొప్పగా చేయు నోము. ఇది ఆయురారోగ్య ఐశ్వర్య సంతాన, సౌభాగ్యాది సమస్త సుఖముల కొరకు చేయు నోము. లక్ష్మీదేవి సకల సౌభాగ్యదాయని కనుక తమ కోరికలన్నియు తీరుతాయని వారి నమ్మకం. తక్కిన వ్రతములవలె దీనికి కఠిన నియమాలుండవు. పెళ్లయిన అన్ని కులాల స్త్రీలు (దీనిని) ఈ వ్రతాన్ని చేస్తారు.

వరలక్ష్మీ వ్రత పూజా విధానములో ఒక విశేషము కలదు. శుభ్రముగా అలికి ముగ్గులు వేసి మంటపము కట్టి వర్షఋతువులో లభించు పుష్పఫలములను ఐదు రకాల తీపి పదార్థాలు, ఐదు రకాల తక్కిన పిండి వంటలను మంటపానికి వ్రేలాడగడుతారు. మంటప మధ్య భాగంలో కొలత ప్రకారం బియ్యం పోసి దానిపై కలశాన్ని ఉంచి, కలశములో కొబ్బరినూనె పెట్టి దానికి కనులు, ముక్కు తీర్చి సకల ఆభరణములతో అలంకరిస్తారు. వానకాలంలో దొరుకు అన్ని పూలతో పూజిస్తారు. నైవేద్యానికి ఆవిరి పట్టిన కుడుముల వంటి పిండి వంటలను సమర్పించటం చేస్తారు. ఈ వ్రతమును శివుడే పార్వతీ దేవికి చెప్పినట్లుగా వ్రత గ్రంథాలలో పేర్కొనబడింది. ఈ వరలక్ష్మి నోమునకు సంబంధించిన గేయాలు (పాటలు) చాలా ఉన్నాయి. ఉదాహరణకు..

**వరలక్ష్మి పాట :**

కైలాస గిరిలోను
కల్పవృక్షము క్రింద
ప్రమథాది గణములు కొలువగాను

- పార్వతీ పరమేశ్వరులు కొలువై ఉంటారు. అప్పుడు పార్వతి పరమేశ్వరుని

'ఏ వ్రతము సంపదలు ఎలిమితోడుత నిచ్చు
ఏ వ్రతము కామితార్థము నొసగు
ఏ వ్రతము పుత్రపౌత్ర అభివృద్ధి నొసంగు"

అని ప్రశ్నించగా శంకరుడు ఈ వ్రత కథను చెప్పుట.

"కుందిన అనియేటి పట్టణములోపల
చారుమతి అని యేటి చేడియ గలదు
అత్తమామల సేవ అతిభక్తితో చేసి
పతి భక్తి కలిగియుండు భాగ్యశాలి"

ఆ భాగ్యశాలికి వరలక్ష్మీదేవి కనులలో కన్పించి ఈ వ్రతము చేయమని చెప్పుట. చారుమతి మరునాడు తన పరివారము వారందరికి చెప్పి పద్ధతిగా పూజ చేసి నైవేద్యములు పెట్టుట మొదలగునవి.

పుండరీకాక్షులకు వారు పోసి
తొమ్మిది పోగులా తోరమెప్పగ పోసి
తల్లికి కట్టిరి సంభ్రమమున

మూడు లేదా ఐదు లేదా తొమ్మిది పోగులతో కూర్చ బడిన తోరము (కంకణం)నకు పసుపు రాసి, పసుపు కొమ్మును లేదా తమలపాకును చుట్టగా చుటిట తోరముతో బంధించి వ్రతము చేయువారు చేతి మణికట్టుకు కట్టుకొనుట ఆచారము.

వరలక్ష్మీ పూజానంతరం వేదాలు తెల్పిన (బ్రాహ్మణున్ని పూజించి ఈ వ్రతమును చారుమతి స్త్రీలు) పూర్తి చేస్తారు. వరలక్ష్మీ ఈ పూజకు సంతసించి

'వరలక్ష్మీ తానపుడు పరుపతోడుతనిచ్చె
సౌభాగ్య సంతాన సంపదలను'

- ఈ వ్రతము చేసిన వారికి సకల సౌభాగ్యములు కలుగునని ఫలశ్రుతిలో చెప్పబడింది. లక్ష్మీ ధనానికి దేవత. ఆమెను పూజించిన దారిద్ర్యము పోయి సౌభాగ్యము వచ్చును. విశ్వాసముపై ఆధారపడి చేయు వ్రతము.

'ఈ వ్రతము చేసినా యింతులందరికి తా
వరలక్ష్మి చేకూర్చు ఫలములన్నియును'

పాండిత్య ప్రకర్షలేని క్రింది పాటల జానపదుల సహజ ధోరణిలోని మనకు కన్పించును.

"మ్రొక్కేను నాపాలి శుక్రవారపు లక్ష్మి
ఒక చిత్తమందున హృదయమందు
చక్కగా కూర్చొని సౌభాగ్యముల నొసగు
అక్కరకు రావమ్మ ఆదిలక్ష్మి" - అని పాట ప్రారంభం.

ఈ పాట మల్లెలు, మొల్లలు మంచి సంపెగలు మొదలైన పుష్పాలతో లక్ష్మిని అలంకరించి పూజిస్తారు. శ్రావణమాసం తెలుగు స్త్రీలకు అతివేడుకైన మాసం. శ్రావణ మంగళ, శుక్రవారం పూజలతో, పేరంటములతో తెలుగువారి ఇండ్లు కనువిందు చేస్తాయి.

## చల్లవిత్త నోము :

జానపదులకు పాడిపంటలు ముఖ్యము. పాడిలేకున్న మనుగడే లేదు. అట్టి పాడిని అభివృద్ధి చేసుకొను ఆకాంక్షతో చేయు నోము చల్ల చిత్తనోము. దీనిలో పాడి అభవృద్ధి మాత్రమే కాక సకల సౌభాగ్య అభివృద్ధి కూడ జానపదులకు ముఖ్యము. నిజానికి పాడియే సకల సంపదలకు మూలము. చల్లచిత్తనోము పాటను ఈ క్రింది విధముగా పాడుతారు.

చల్లచిత్తనోము నోచవే తల్లీ - వెలయావుల పాడి చేయ వేతల్లో ఇల్లుపాటసేత అలుకవే తల్లీ - ఎల్లిసొమ్ములు నీవు తాల్చవే తల్లీ కొల్లలుగ సౌభాగ్యమేలవే తల్లీ - చల్లని సంపదలను చేపట్టు తల్లీ, చల్లగను సుతలతో సాగవే తల్లీ - ఎల్ల బీదల నాదరింపవే తల్లీ.

- ఇందు యెల్లయావుల పాడి చేయుట. ఇంటిని పాలతోను అలుకుట అనగా పాడి సమృద్ధిగా ఉండుట కదా! ఈ పాడి వలన కలిగిన ఐశ్వర్యము వలన ఎల్ల నోములను ధరింపమని చల్లగా పిల్లలతో ఉండమని ఎడతెగని సంపదలతో వర్ధిల్లమని చెప్పుచు చివర "ఎల్ల బీదల నాదరింపవే తల్లీ" అని ఇంతటి ఐశ్వర్యమునకు ఫలమైన దరిద్ర నారాయణసేవను చెప్పుట ఈ నోము ఫలము గొప్పదనం తెలుపుచున్నవి.

చల్లవెన్నులతో ఈ వ్రతమును జరుపుదురు.

"స్త్రీల వ్రత కథలు"లో నీ పాట మరియొక విధముగా ఉన్నది.

చల్లచిత్తనోము చిత్తమారగ జేసి ఇల్లు వాకిళ్లతో ఈశ్వర చింతతో
చల్లబ్రతుకు సౌభాగ్యలక్ష్మితో ఉల్లసంబులతో ఉండవే తల్లి

ఈ నోము ఫలు ఇల్లు వాకిళ్లు చల్లగా ఉండాలని సకల సౌభాగ్యంతో ఉండే విధంగా దీవించాలని -

అన్నింటికి మించి ఈశ్వర చింతలో ఉండుట ముఖ్యం. పాటలు పాడుకొని, అక్షతలు తలపైన వేసు కోనీ, చల్ల చిలుకునపుడు కన్నుల కంటుకొనిన చల్లబొట్లతో పసుపు కలిపి ప్రతిదినం 'ఆరుగురు' పుణ్యస్త్రీలకు బొట్టుపెట్టవలయును. ఇట్లు నూట ఆరువతి ఐదు రోజులు చేసిన పుణ్యఫలం లభించును.

## ఏకాదశీ వ్రతము :

హిందువులు ఏకాదశ రోజును అత్యంత ప్రాముఖ్య మైనదిగా భావిస్తారు. ఏకాదశి అనగా ప్రతి పక్షమునకు పదకొండవ తిథి అని అర్థం. ప్రతి నెల యందును రెండు ఏకాదశులు వస్తాయి. ఏకాదశి రోజున హరికీర్తన ప్రధానముగా చేస్తారు. కావున దీనిని హరివానరం అని చెప్పుకుంటారు.

ఏకాదశినాడు ఉపవాసం చేయుట బ్రాహ్మణులకు భూమిని దానమిచ్చుట కంటెను. విద్యార్థులకు విద్యా దానము చేయుట కంటెను ఉత్తమమైనదిగా పురాణ ఇతిహాసములు ఎలుగెత్తి చాటుతున్నాయి.

బిరుదురాజు రామరాజు గారు ఈ క్రింది గేయాల్ని ఉదహరించిరి.

చిత్తుమ్మ ఏకాశి చిలుకు దాదోశి
మాదుమ్మ ఏకాశి మంచిదాదోశి
దక్షకుని ఏకాశి ఇంకనెల్లాళ్లు
కాసె పుల్లలుదెచ్చి కసునార దోసి
ఆవుపెండా దెచ్చి ఆరుగుల్లు అలికి
గోవుపెండా దెచ్చి గొలెంల గలిపి
ధరణి మీదా సాన్పు (కలాపి) దట్టంగ చల్లి
కాళ్లుమొకమూ గడిగి కడువలూ గడిగి
కడపకూ ఆకాంత ఏమాని మొక్కు
అష్ట సందపలివ్వు అతిభాగ్యమివ్వూ
కోటి సంపదలివ్వు కోమాండ్ల నివ్వూ
ఎప్పటికి ముత్తయిదనకు నాకివ్వూ

ఇందు ఏకాదశి మహాత్మ్యములు పేర్కొనక పోయిన ఇల్లాలి కోరికలు పేర్కొనడం జరిగింది.

ఏకాదశి మహాత్మ్యము - రుక్మాంగద మహారాజు కథలో మాత్రము

"ధరను యెవ్వరేని మరణంపునొంద
వైకుంఠపురమునకు వార్పోవు" చుండిరి అని మోక్ష ప్రధాముగా పేర్కొన్నారు.

**ఉపసంహారం :**

వ్రతాలను, వ్రత గేయాలను పరిశీలిస్తే మనకు కొన్ని సంగతులు ప్రస్ఫుటమవుతాయి. ప్రకృతి మానవునికి తల్లిలాంటిది. తల్లి వలన ఎలాంటి రక్షణ, ప్రయోజనం కలుగుతుందో ఆ విధంగానే ప్రకృతి నుండి పలు రకాలైన ఉపయోగాలను తమ కుటుంబ లాభాలను, వ్యక్తిగత, వ్యాపార, సామాజిక సౌకర్యాలను కోరుతూ ఈ వ్రతాలను ఆచరిస్తారన్నది నా పరిశీలనలో తేలిన అంశము.

ప్రకృతిని ఆరాధించడం, పర్యావరణాన్ని కాపాడు టక్కావాల్సిన ఆవశ్యకత, పాడిపంటలను వృద్ధి చేసు కోవటం, అత్తమామలు, భర్త శ్రయస్సును కాంక్షించడం, ఇతర కుటుంబ సభ్యుల బంధుమిత్రుల అభివృద్ధిని ఆశించడం లాంటి అంశాలు ఈ వ్రత గేయాలలో మనం గమనించవచ్చు.

అయితే కాలక్రమగతిలో అత్యాధునిక యుగ సంస్కృతీ వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్న నేటి తరానికి ఈ తెలుగు జానపదుల వ్రత గేయాల వైశిష్ట్యాన్ని చేరువచేసే దిశగా ప్రయత్నాలు జరగాలి. వాటిని పాఠ్యాంశాలలో చేరుస్తారా. మరే విధమైన ప్రయత్నాలు చేస్తారు అన్నది పరిశీలించాల్సిందిగా సూచన చేస్తూ నేను నా వ్యాసాన్ని ముగిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు జానపద గేయ సాహిత్యము - బి. రామరాజు జానపద విజ్ఞాన ప్రచురణలు - హైదరాబాద్, 1990.
2. తులనాత్మక సాహిత్య - ఎస్. జయప్రకాష్, ఎం. సత్యవతి, శ్రీదివ్య పబ్లికేషన్స్, 67-బి, కంబర్ వీధి, నాగమలై, మధురై - 625019.
3. తెలుగు జానపద సాహిత్యము - డా॥. చింతపల్లి వసుంధరారెడ్డి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్డు, హైదరాబాద్ - 500001.
4. గిరిజన సాహిత్యం - ఆచార్య ఎం. గోనా నాయక్, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, తెలుగు అకాడమీ, హైదరాబాద్.

❖❖❖

# బంజార సంస్కృతిలో మాయమవుతున్న స్త్రీ రూపం

- భానోతు కవిత, పరిశోధక విద్యార్థి.

**ఉపోద్ఘాతం :**

భారతదేశంలో బంజారాలు అడవిలో జన్మించి ప్రకృతితో మమేకమైన జీవనం సాగించే ప్రపంచంలోనే ఒక అరుదైన విలక్షణమైన, విశిష్టమైన తెగ ప్రకృతిలో జీవనం కొనసాగించే వీళ్ళ ప్రకృథి పరిసరాలకు అను గుణంగా వీరి వేషధారణ వాడే వస్తువులు ఉంటాయి. వీరు ఒక సమూహంగా కొండలలో కోనల్లో జీవనాన్ని కొనసాగిస్తున్న వారు గిరిజనులు గిరిజన తెగలోని బంజారా వేషధారణకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అలాగే వీళ్ళు ధరించే ప్రతి వస్త్రానికి వస్తువుకు అలంకార ప్రాయమైన ఆభరణాలకు ప్రత్యేకమైన చరిత్ర ఉంది.

బంజారులను ఆంధ్రరాష్ట్రంలో ప్రాంతాల వారీగా వివిధ పేర్లతో పిలుస్తున్నారు. తెలంగాణలో లంబాడి / బంజారులని ఆంధ్ర ప్రాంతంలో సుగాలీ / లంబాడీలని రాయలసీమలో బంజారా / సుగాలీలని అంటున్నారు. వీరు ఎక్కువగా తెలంగాణ, రాయలసీమ ప్రాంతంలో విస్తరించి వున్నారు. వీరి ముఖ్య స్థానం రాజస్థాన్ ప్రాంతం వీరిలో ప్రధానంగా నాలుగు గోత్రనామాలున్నాయి. అవి..

1. చౌహాన్ (6)
2. పమార్ (12)
3. రథోడ్ (27)
4. జాదవ్ / వాద్య

**బంజారా సంస్కృతిలో స్త్రీరూపం పూర్వ అలంకరణ :**

బంజారా స్త్రీలు దంతంతో తయారు చేసిన గాజులని వెండి కడియాలను పూసల దండలను రూపాయి బిళ్లల హారాన్ని చెవులకు ముక్కుకు వేళ్లకు వెండి బంగారు నగలను చిత్ర విచిత్రమైన రంగురంగుల గుడ్డలతో కుట్టిన లంగాలను అద్దాలు పూపసలు రంగు దారాలతో కుట్టిన రవికలు తలపై ఇరువైపులా వేలాడబడే జుట్టుకు వెండి ఆభరణాలను ధరిస్తారు. బంజారా స్త్రీలు మోగాళ్లతో సమానంగా కలిసి బృంద నృత్యం చేస్తారు. విలక్షణంగా కనిపించే బంజారా స్త్రీ రూపం నేడు కనబడకుండా పోతోంది. వారి పూర్వ రూపాలు కనుమరుగైపోతున్నాయి.

**టోప్లి-కన్యా-టిప్ని-పిన్నీస్ :**

తల వెంట్రుకల్ని రెండు సిగ పాయలుగా తీస్తారు. దీని మధ్య నుండి పాపిడ తీసి రెండు వైపులా జడను చక్కగా దువ్వుతారు. చెవలకు ముందు భాగంలో చెంపపైన వెండితో తయారుచేసి గుండ్రని ఆకారంలో తయారు చేసిన టోప్లి అనే రెండింటికి వాటిపై శంఖు ఆకారంలో ఉండే మరో ఆభరణం ఘుగ్రీ అనే దానిలో కలిపి గుడ్డతో తయారుచేసిన తాడుతో అనుసంధానం చేస్తూ మూడింటిని కలిపి కుట్టుకుంటారు. జడ చివరలో రంగు రంగుల దారంతో తయారు చేసిన పూంద అనే దానిని అమరుస్తారు. సిగ పాయలను టోప్లి దానిపై వెండితో తయారు చేసిన పిన్నుల్ని రెండు వైపులా అమరుస్తారు. ఆ రెండు వైపులా ఉన్న పిన్నులను కన్యా అనే వెండి గొలుసులని అమరుస్తారు. అవి చెంపపై నుండి కింది వరకు వేలాడబడే ఉంటాయి. తలకు మధ్యలోనున్న పాపిడ మధ్యభాగంలో టిప్ని అనే వెండి ఆభరణం అమరుస్తారు.

**భూర్యా - పుల్లి - మర్కి :**

బంజారా స్త్రీలు ముక్కుకి కుడి వైపునున్న రంధ్రానికి భూర్యా అనే చింగారంతో చేసిన పెద్ద ముక్కు పుడకను ధరిస్తారు. దీనిపైన రంగురాళ్ళు అమర్చబడి ఉంటాయి. అలాగే ఎడమవైపు ఉన్న ముక్కు రంధ్రానికి చిన్నపాటి ముక్కు పుడకను ధరిస్తారు. దీనిని వెండి లేదా బంగారంతో తయారు చేస్తారు. దీన్నే బంజారాలు "పుల్లి" అంటారు. అలాగే చెవులకు వెండి లేదా బంగారంతో తయారు చేసిన దాన్ని "మర్కి" అంటారు.

బంజారా స్త్రీలు భూర్యాను గౌరవప్రదంగా భావిస్తారు. భూర్యా లేకుంటే చాలా అవమానంగా భావిస్తారు. తినటానికి తిండి లేకపోయినా ఫరవాలేదు కాని ఈ పెద్ద ముక్కు పుడక ఉండి తీరాల్సిందే. నేటికీ బూర్యాని సంస్కృతి తండాల్లో పెద్దలు పాటిస్తున్నారు. వీరంతా 70 నుండి 80 సంవత్సరాల వయసు కలిగినవారు.

### హంస్లో - హంస్లీ - రపయార్ హర్ :

బంజారా స్త్రీలు మెడలో లావుపాటి మరియు సన్నగా ఉండే వెండితో తయారు చేసిన "హంస్లో - హంస్లే" అనే కంటెల్ని ధరిస్తారు.

ఇవి రెండు కూడా గుండ్రని ఆకారంలో ఉంటాయి. వాటిపై చక్కని నగిషీతో రంగురాళ్ళు అమర్చబడి ఉం టాయి, వీటినే బంజారాలు "రూపేరో హంస్లో - హంస్లీ" అంటారు. అంటే వెండి కంటెలని అర్థం. అలాగే మెడలో వెండితో తయారు చేసిన చ్వాక్డి / చోక్డిని ధరిస్తారు. రంగు రంగుల్లో ఉన్న పూసలు మంగళహారాన్ని కూడా ధరిస్తారు. అలాగే వెండి రూపాయి బిళ్ళలతో తయారు చేసిన "రూపేర్ రపయార్ హర్"ని ధరిస్తారు. ఇది రాజరికానికి నిదర్శనం.

### కాళీ - ఖన్యా - పేటి (రవిక) :

బంజారా స్త్రీలు రంగురంగుల గుడ్డల్ని తీసుకొని వాటిపై దారంతో (లండీ) చిన్న పతి పూసలతోను కానీ చిన్న చిన్న అద్దాలతోను మధ్యలో ఆర్సీ (పెద్ద అద్దాల) వాటి చుట్టూ రంగు రంగు దారాలతో స్వయంగా కాళీ (రవిక) తయారు చేసుకుంటారు. ఈ కాళీకి కుడి, ఎడమ భుజాలపై ఖవ్యాపై చిన్న పెద్ద అద్దాలు వాటి చుట్టూ రంగు రంగుల పూసలు, వాటి చివర్లో (రూపేర్ ఘుగ్రా) వెండి మువ్వలని మధ్యలో అన్నీ అంటే చిన్నపాటి వెండి బిల్లలని అమర్చుకుంటారు. అలాగే కడుపుపై ముందు భాగంలో ఈ రవికకు క్రింది పేటి అంటే డ్బులు దాచుకునే చిన్నపాటి జేబును అందంగా తయారుచేసి అమరుస్తారు. రవిక ముందుబాగం అంతా కూడా "ఎంబ్రాయిడింగ్" చేసి ఉంటుంది. వెనుకవైపు ఖాళీగా ఉండే కింద పైన వరుసలో కుడి ఎడమలుగా దారంతో గాని లేదా గుడ్డతో తయారు చేసిన "డోర్"తో ముడి వేసుకుంటారు.

### ఫేట్యా (లంగా) - లేపో - పుంద :

బంజారా స్త్రీలు రంగు రంగుల గుడ్డలు తీసుకొని వాటిపై పెద్ద అద్దాలు పూసలు (లాడ్జి) రంగు రంగు దారాలతో పేట్యాను తయారు చేస్తారు. దీనినే పాటేరో పేట్యా (పట్టు లంగా) అంటారు. లంగాను నడుంకు కట్టుకోవటానికి దోరణ్ అనే దారం ఉంటుంది. వారి చివర్లో రంగు రంగుల దారాలతో పుంద (దారపు గుత్తి)ని అమరుస్తారు. ఈ లంగాను తయారు చేయటానికి బంజారా స్త్రీలు చాలా కష్టపడి తయారు చేస్తారు. వారి వస్త్రాలను వారే తయారు చేసుకుంటారు. చూడ ముచ్చటగా ఉండే పేట్యాను కళాత్మకంగా తయారు చేసుకొని ధరిస్తారు. దీనిని తయారు చేయటానికి 3 నుండి 5 నెలల వరకు సమయం పడుతుంది.

### టుక్రీ - ఘంటో (ముసుగు) - తీత్రీ :

బంజారా స్త్రీలు తమ శరీర స్వరూపాన్ని కాపాడు కోవటానికి టుక్రీ అనే వస్త్రాన్ని ధరిస్తారు. ఈ టుక్రీ తలపై నుండి కిందికి జారకుడా ఉండేందుకు "రూపేరో ఘంటో" (వెండి మువ్వలతో అమర్చబడిన అద్దాల పకిడి")ను అమరుస్తారు. ఈ ఘంటోను అద్దాలు (ఆర్సీ), కాచే (చిన్న చిన్న) అద్దాలు, పూసలు (లడ్జ్) రంగు రంగుల దారాలు (దొర)తోను తయారు చేస్తారు. టుక్రీ కూడా రంగు రంగులతో ఉంటుంది. దానిపై కూడా చక్కని అద్దాలు పువ్వులు పూసలు కుట్టుకుంటారు. తలపైన ఉన్న ఘంటోకు వెండితో తయారు చేసిన మువ్వలని (చిన్నపాటి గుండ్రని బిళ్లలని) అమర్చి చక్కగా తయారు చేస్తారు. దీనిని బంజారాలు రూపరో ఘంటో అంటారు టుక్రీని ఎడమవైపు భాగాన్ని నడుము కట్టి పాట్లీ (ఏదైనా తిను బండారాలు దాచుకొని చిన్నపాటి పట్టి)ని తయారు చేస్తారు. ఎదపై నుండి కప్పుకొనేందుకు పైట కొంగును చివరలో చిన్న చిన్న అద్దాలు మువ్వలు పూసలు రంగు దారాలతో అందంగా తయారు చేసిన తేత్రీ (పైట

జారకుండా రంగు దారాలతో అందంగా తయారు చేసు కుంటారు. ఈ తేత్రీని ఒకవైపుకు టుక్రీకి కట్టి ఇంకో ఒక భుజంపై నుండి వెనుకకు వేసుకుంటారు.

ముసుగు ధరించే సంప్రదాయం ఇప్పటికీ బంజారాల్లో ఉన్నది. దుఃఖాన్ని ప్రకటించేటప్పుడు "ముసుగు" వేసుకొని ఏడుస్తారు.

**బలియా- బూజుబంద్ :**

బంజారా స్త్రీలు ముఖ్యంగా పెళ్లయినవారు చేతికి పూర్వ ఏనుగు దంతాలతో తయారైన "బలియా" అనే దండపు గాజుల్ని ధరించేవారు ఇవి భుజాలపై నుండి మోచేతి వరకు ధరించుకుంటారు. భుజంపై ధరించిన గాజుల్ని "చూడర్ బలియా" అంటారు. పెళ్ళయిన పుణ్య స్త్రీలు రెట్ట గాజులు ధరించడం ప్రత్యేకత ఇవి వారికి తాళితో సమానం ఈ గాజుల్ని వివాహ సమయంలో స్వయంగా పెళ్ళికొడుకే తొడిగిస్తాడు అవి క్రిందికి జారకుండా ఉండేందుకు "బాజుబంద్" అనే వెండితో తయారు చేసిన గాజుల్ని ధరిస్తారు

**వాంక్డి - కస్సే - కోళ్డా (కుళ్డా) :**

బంజారా స్త్రీలు ముఖ్యంగా పెళ్లయినవారు కళ్ళకు కంచు లోహంతో తయారుచేసిన వంకర టింకరగా ఉన్న గజ్జె కడియాలు ధరిస్తారు వీటినే వారు 'వాంక్డి' అంటారు అలాగే కాళ్ళకు కంచుతో తయారు చేసిన "కస్సే" అనే పట్టెలు, కడియాలు ధరిస్తారు అలాగే వెండితో తయారు చేసిన కోళ్డా / కుళ్డా" అనే కడియాలు ధరిస్తారు.

**అకుంతళ - చట్కి - చల్లా :**

బంజారా స్త్రీలు పెళ్లయినవారు పాదాలకు మొత్తం పది వేళ్లకు బొటనవేలితో సహ కంచు లోహంతో తయారు చేసిన మెట్టెలను ధరిస్తారు. బొటన వేళ్లకు ధరించే వాటిని ఆకుంతళ అంటారు. అంటే పెద్ద మెట్టెలు అలాగే మిగిలిన వేళ్లకు ధరించేవాటిని "చట్కి"లు అంటారు. చేతి వేళ్లకు వెండితో తయారయిన రూపాయి బిళ్ళలను ఉంగరాలుగా ధరిస్తారు. వీటినే "చల్లా" అంటారు.

**ముగింపు :**

పైన పేర్కొన్న వేషధారణలతో ఉన్న బంజారా స్త్రీ రూపం నేడు కనిపించకుండా పోతుంది. తమదైన ప్రత్యేక గుర్తింపు ఉన్న బంజారాలు తమ నాగరికతకు దూరం అవుతున్నాయి. నేటి ప్రపంచీకరణ ప్రవాహంలో వీరి వేషధారణ, భాష బ్రతుకంతా శూన్యమైపోయింది. వారి పూర్వ స్త్రీ రూపం మళ్లీ రావాలి. ఇప్పటివరకు తాండలో కొద్దిమంది స్త్రీలు తమపూర్వ రూపంలో కనిపిస్తారు. నేడు ఈ వేషధారణ కనుమరుగైపోయింది.

**ఆధార గ్రంథాలు :**

1. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి - చీన్యా నాయక్ (బత్రి లక్ష్మప్రాసెస్, బెంగళూరు - 1998)
2. సుగాలీ సంస్కృతి - భాష సాహిత్యాలు - డా॥. గోనా నాయక్ (ఎం. పద్మశ్రీ గ్రాఫిక్స్, హైదరాబాద్, 2002)
3. బంజారా సాహిత్య - జీవన చిత్రణ - డా॥. సూర్యధనుంజయ్ (డి. ఉజ్వల్ క్రియేషన్స్, హైదరాబాద్, 2009)
4. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం - డా॥. శంకరయ్య జనపాల (జనపా వారి ప్రచురణలు, అవునూరు, 2001)
5. బంజారా మౌఖిక కథలు - డా॥. రాజారాం (జె. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయం మరియు పరిశోధనాలయం, 2009)

❖❖❖

భావవీణ

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study


కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ISSN No. : 2456-4702


RNI No. APTEL/2003/12253

May 2024
































































Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494 660 509.